www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 12-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 148
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: నవమి రా. 11.33 తదుపరి దశమి; నక్షత్రం: మూల రా. 9.53 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: తె. ఉ. 7.10, రా. 8.14-9.53; దుర్ముహూర్తం: ఉ. 10.09-10.58, మ. 3.01-3.50; అమృతఘడియలు: మ. 3.20-4.58; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.06; సూర్యాస్తమయం: 6.16 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


తెలంగాణ వరద బాధితుల సహాయార్థం రూ.కోటి విరాళం చెక్కును టీ-సీఎం రేవంత్‌రెడ్డికి అందజేస్తున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

రూ. 7,000 కోట్లు తక్షణమే ఇవ్వండి

పోలవరంపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞాపన సిద్ధం

డయాఫ్రం వాల్, ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులు మేఘాకే

జల వనరుల శాఖ ప్రత్యేక సీఎస్ మెమో జారీ

ఈ రెండు పనులూ సమాంతరంగానే 3

తద్వారా రెండు సీజన్లు కలిసొచ్చే చాన్సు




కోర్టు ముందు హాజరవ్వాల్సిందే!

స్వీయ పూచీకత్తు సమర్పించాల్సిందే

ఎన్‌వోసీపై జగన్‌కు హైకోర్టు స్పష్టీకరణ

పాస్‌పోర్టు ఐదేళ్లకు ఇచ్చేలా ఎన్‌వోసీ ఇవ్వండి

ప్రత్యేక కోర్టు ఉత్తర్వులకు పాక్షిక సవరణ

కోర్టు ఉత్తర్వులు కఠినమైనవి కావు

కేసు పెండింగ్‌లో ఉందని జగన్‌కు తెలుసు

సమన్లు అందలేదంటూ 3

ప్రయోజనం పొందలేరు: న్యాయమూర్తి

బీచ్‌లో నిర్మాణాలా?

ఫొటోలు పరిశీలిస్తే స్పష్టంగా తెలుస్తుంది

మొత్తం ఆ నిర్మాణాల సంగతి చూడండి

సాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి 3

నిర్మాణాలపై హైకోర్టు విస్మయం

ప్రహరీ కూల్చివేత ఖర్చును ఆమె నుంచే వసూలు చేయాలని జీవీఎంసీకి ఆదేశం

సెబ్ రద్దు

పాత స్వరూపంలోకి ఎక్సైజ్.. ఉత్తర్వులు జారీ

సెబ్‌లో ఉన్న సిబ్బంది ఆ శాఖకు బదిలీ 12

ఆస్తులు, స్టేషన్లు, వాహనాలు కూడా..

కాకినాడ జిల్లా రాజుపాలెంలో ఎక్స్‌కవేటర్ ఎక్కి ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు


ఉధృతంగానే ఏలేరు వరద

ముంపులోనే 65 గ్రామాలు

హైవేపై కొనసాగుతున్న నీరు

వాహనాల రాకపోకలపై ఆంక్షలు

పిఠాపురానికి పెరిగిన ముంపు

కిర్లంపూడిలో ఒకరి గల్లంతు

ఆదుకుంటాం!

ఎవరూ అధైర్యపడొద్దు.. 17లోగా బాధితులకు పరిహారం

ఏలేరు వరద ముంపు రైతులకు న్యాయం

హెక్టారుకు రూ. 25 వేలు అందిస్తాం

గతంలో నేనే రైతులకు 20 వేలిచ్చా

జగన్ మూడు వేలు తగ్గించి ఇచ్చేవాడు

కౌలు రైతుల ఖాతాలకే ఇన్‌పుట్ సబ్సిడీ

తోపుడుబండ్లు, ఆటోరిక్షాలకు 10 వేలు

దెబ్బతిన్న ఇంటి స్థానంలో కొత్తది కట్టిస్తాం

నేటి నుంచి బాధితులకు దుస్తుల పంపిణీ

కాకినాడ, ఏలూరు జిల్లాల్లో సీఎం పర్యటన

కొల్లేరు, తాండవ వరదపై ఏరియల్ సర్వే

(కాకినాడ, ఏలూరు - ఆంధ్రజ్యోతి)

వరద బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని, అధైర్య పడవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ నెల 17వ తేదీ లోపు వరద పరిహారం అందిస్తామని తెలిపారు. దీనిపై విధివిధానాలు రూపొందిస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. ఏలేరు వరద ముంపుతో పంట నష్టపోయిన రైతులకు హెక్టారుకు రూ.25 వేలు, ప్రతి కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం, దుస్తులు

మిగతా 11వ పేజీలో...

పెద్ద మనసుతో ఆదుకోండి

కేంద్ర బృందాలకు రాష్ట్ర ప్రభుత్వం వినతి.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ 12

తొలి రోజు రెండు జిల్లాల్లో బృందాల పర్యటన

బోట్ల తొలగింపునకు అండర్ వాటర్ ఆపరేషన్ 11

'ఏలేరు'ను ముంచింది జగనే

ఆధునీకీకరణకు నాడే శ్రీకారం చుట్టా

జగన్ వచ్చి ఆ పనులు ఆపేశారు

గత ఐదేళ్లలో పూర్తిచేస్తే వరద వచ్చేది కాదు

బుడమేరుకు గండి పడేలా చేశారు

బ్యారేజీ డ్యామేజీతో 11

వేలమంది చంపాలని చూశారు

నేనే గనుక రాజకీయాలను పక్కనపెడితే అందరి తాటా తీసేవాడిని: చంద్రబాబు



ఐఎంజీకి భూ కేటాయింపు కేసులో...

సీబీఐ దర్యాప్తునకు నో

తెలంగాణ హైకోర్టులో విజయసాయికి చుక్కెదురు

2004లో చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయంపై విచారణకు ఆదేశించేందుకు కోర్టు నిరాకరణ

పాత అంశంపై కొత్తగా విచారణా?

అనుమతించం.. దీనిపై ఇప్పటికే తీర్పులొచ్చాయి

వైఎస్ విజయలక్ష్మి, పాల్వాయి గతంలో వేసిన వ్యాజ్యాలు డిస్మిస్ అయ్యాయి

ఆ కోర్టుల నిర్ణయాలు శిరోధార్యం: ధర్మాసనం

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. 20 ఏళ్ల కిందట.. 2004లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఐఎంజీ భారత్ అకాడమీస్‌కు చేసిన భూకేటాయింపు, ఎంవోయూ, సేల్‌డీడ్ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ విజయసాయిరెడ్డి తదితరులు 2012లో దాఖలు చేసిన మూడు ప్రజాహిత వ్యాజ్యాలను కోర్టు బుధవారం కొట్టివేసింది. ఇదే అంశంపై గతంలో ఏపీ మాజీ సీఎం జగన్ తల్లి వైఎస్ విజయలక్ష్మి, దివంగత కాంగ్రెస్ నేత పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లను ట్రయల్ కోర్టు నుంచి సుప్రీంకోర్టు దాకా కొట్టేశాయని గుర్తుచేసింది. ఆ తీర్పులు శిరోధార్యమని స్పష్టం చేసింది. తాజా వ్యాజ్యాల్లోనూ.. పిటిషనర్లు తీవ్ర ఆలస్యం, అలక్ష్యం చేశారని, ఏళ్ల తరబడి ఎలాంటి చర్యలూ తీసుకోలేదని.. పాత అంశంపై తాజా వివాదాన్ని కొనసాగించడానికి అనుమతించబోమని

మిగతా 2వ పేజీలో...

అదే జగన్.. అవే అబద్ధాలు!

నాడు 36 రాజకీయ హత్యలని బొంకులు

నేడు 60 మంది చనిపోయారని అబద్ధాలు

నిరూపించాలని మంత్రులు, నేతల డిమాండ్ 11

నిరూపించలేక చేతులెత్తేసిన వైసీపీ అధినేత

అబద్ధాలతో పుట్టి ఫేక్‌లో పెరిగారని నేతల ధ్వజం

అన్నమయ్య డ్యాం వరదకు కొట్టుకుపోయినప్పుడు కిక్కురుమనలేదంటూ నిప్పులు చెరిగిన మంత్రులు

క్రిమినల్ వెళ్లి మరో నేరస్థుడికి పరామర్శ అని ఎద్దేవా

కూలీలపై మృత్యు పంజా

జీడిపిక్కల వ్యాన్ అదుపు తప్పి కాల్వలో బోల్తా

బస్తాల కింద పడి ఊపిరాడక ఏడుగురు దుర్మరణం

డ్రైవర్ సహా మరో నలుగురు సురక్షితం 3

తూర్పు గోదావరి జిల్లా చిన్నాయిగూడెంలో ఘోరం

70 ఏళ్లు పైబడిన వారందరికీ.. 5 లక్షల ఉచిత ఆరోగ్య బీమా

ఆదాయం, సామాజిక స్థితితో సంబంధం లేదు

ప్రైవేటు ఆరోగ్య బీమా, ఈఎస్ఐ ఉన్నా వర్తింపు

ఇతర ప్రభుత్వ బీమా పథకాలేవైనా వర్తిస్తుంటే.. ఆ స్కీంను లేదా 'ఆయుష్మాన్'ను ఎంచుకోవచ్చు

70 వేల కోట్లతో 62 వేల కిలోమీటర్ల గ్రామీణ రోడ్లు

కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11: ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకం ఇకపై దేశంలో 70 ఏళ్లు, ఆ పైబడిన వయసు వారందరికీ వర్తించనుంది. ఆదాయంతో సంబంధం లేకుండా ఆ వయసు వారంతా అర్హులవుతారు. దీనికి బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ సమావేశం ఆమోద ముద్ర వేసింది. ఆ భేటీలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు తెలిపారు. ఆయుష్మాన్ భారత్‌లో తాజా నిర్ణయంతో దాదాపు 6 కోట్ల మంది సీనియర్ సిటిజన్లకు లబ్ధి

మిగతా 2వ పేజీలో...

తుంగభద్రపై బ్రిడ్జి కమ్ బ్యారేజీలు

ఏపీకి చెప్పకుండానే కర్ణాటక సన్నాహాలు 2

'చత్వారం చుక్కల మందు ప్రెస్‌వూ'కు
అనుమతి నిలిపివేత

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11: 'చత్వారానికి దివ్యౌషధమ'ని ఎన్‌టాడ్ కంపెనీ ప్రచారం చేసుకున్న 'ప్రెస్‌వూ' చుక్కల మందుకు ఇచ్చిన అనుమతిని ఔషధ నియంత్రణ సంస్థ (డీసీజీఐ) తాత్కాలికంగా రద్దు చేసింది. 40-55 ఏళ్ల వయస్కుల్లో కొద్దిపాటి నుంచి ఓ మోస్తరు చత్వారం(ప్రెస్బియోపియా)తో బాధపడుతున్నవారు ఈ మందును కంట్లో ఒక్క చుక్క వేసుకుంటే 15 నిమిషాల్లో పనిచేయడం ప్రారంభిస్తుందని ముంబైకి చెందిన ఆ ఫార్మా సంస్థ ప్రకటించింది. చత్వారంతో బాధపడుతున్నవారికి కళ్లజోడు అవసరాన్ని తగ్గిస్తుందని చెప్పుకుంది. ఇలాంటి మందు దేశంలో ఇంత వరకు లేదని, ఇదే మొదటిదని కూడా ప్రకటించింది. ఈ ప్రచారాన్ని తీవ్రంగా పరిగణించిన డీసీజీఐ.. 'ప్రెస్‌వూ' చుక్కల మందు తయారీ, అమ్మకాలకు గత నెల 20న ఇచ్చిన అనుమతిని సస్పెండ్ చేస్తున్నట్టు తెలిపింది. చత్వారానికి చికిత్సలో ఉపయోగించేందుకు ఈ మందుకు అనుమతి ఇచ్చామే కానీ 15 నిమిషాల్లోనే పనిచేస్తుందని, కళ్లజోడు అవసరాన్ని తగ్గిస్తుందని కాదని స్పష్టం చేసింది. ఆ కంపెనీ ప్రచారం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.

చేయని నేరానికి పదేళ్ల జైలు..
బాధితుడికి రూ.419 కోట్ల పరిహారం!

న్యూయార్క్, సెప్టెంబరు 11: చేయని నేరానికి పదేళ్ల శిక్ష అనుభవించిన వ్యక్తికి అమెరికాలోని షికాగో కోర్టు.. ఏకంగా 50 మిలియన్ డాలర్ల (రూ.419.96 కోట్ల) పరిహారం చెల్లించాలని సంచలన తీర్పునిచ్చింది. 19 ఏళ్ల వ్యక్తిని హత్య చేశాడన్న అభియోగాలపై మార్సెల్ బ్రౌన్‌ను 2008లో పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు.. అతడిని దోషిగా నిర్ధారిస్తూ 35 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అయితే బ్రౌన్‌తో పోలీసులు బలవంతంగా నేరం ఒప్పించారని.. అలాగే కల్పిత సాక్ష్యాలు సృష్టించారని 2018లో అతడి న్యాయవాదులు కోర్టుకు సాక్ష్యాలు సమర్పించారు. దీంతో బ్రౌన్‌పై నమోదైన కేసును కొట్టేసిన కోర్టు.. అతడిని విడుదల చేసింది. ఈ నేపథ్యంలోనే తనకు జరిగిన అన్యాయంపై బ్రౌన్ షికాగో ఫెడరల్ కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు.. కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 'తప్పుడు కేసులో బ్రౌన్‌ను అరెస్టు చేసినందుకు 10 మిలియన్ డాలర్లు.. 10 ఏళ్ల పాటు జైలు శిక్ష అనుభవించినందుకు 40 మిలియన్ డాలర్ల పరిహారం అతడికి చెల్లించాలి' అని ఆదేశించింది.

భరణం కోసం భార్య ఖాళీగా ఉండొద్దు

భోపాల్, సెప్టెంబరు 11: ఉన్నత చదువు, ఉద్యోగ అర్హత లుండి కూడా భార్య ఏ పని చేయకుండా కేవలం భర్త నుంచి వచ్చే భరణంపైనే ఆధారపడటం సరికాదని మధ్యప్రదేశ్ హైకోర్టు పేర్కొంది. భరణం వస్తుంది కదా అని.. జీవనోపాధి కోసం సంపాదించుకోవడం ఆపేయడం సరికాదని వ్యాఖ్యానించింది. నెలకు రూ.60 వేలు భరణంగా చెల్లించాలంటూ ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ భార్యాభర్తలిద్దరూ వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. రూ.60 వేల భరణం తనకు సరిపోదంటూ విచారణ సందర్భంగా భార్య కోర్టుకు తెలిపింది. దీనిపై భర్త వాదనలు వినిపిస్తూ.. 'ఏ కారణం లేకుండానే నా భార్య విడిగా ఉంటోంది. ఆమె కూడా దుబాయ్‌లో బ్యాంకులో ఉద్యోగం చేసింది. బ్యూటీ పార్లర్‌తో ఇప్పుడు కూడా బాగానే సంపాదిస్తోంది. కాబట్టి భరణంగా ఇవ్వాల్సిన మొత్తాన్ని తగ్గించండి' అంటూ కోర్టును కోరారు. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు.. భరణాన్ని రూ.60 వేల నుంచి రూ.40 వేలకు తగ్గిస్తూ తీర్పు వెలువరించింది.

లోకం తీరు



రీల్స్ మోజుకు కుటుంబం బలి

- పట్టాలపై రీల్స్ చేస్తుండగా దూసుకువచ్చిన రైలు
- 3 ఏళ్ల పిల్లాడు సహా తల్లిదండ్రుల దుర్మరణం

లక్కీంపూర్ ఖేరి(యూపీ), సెప్టెంబరు 11: సరదా కోసమో, సంచలనం కోసమో రీల్స్ చేస్తూ ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజురోజుకి పెరిగిపోతోంది. తాజాగా యూపీలో ఓ కుటుంబం రీల్స్ మోజుకు బలైపోయింది. రైలు పట్టాలపై రీల్స్ చేస్తున్న ఓ వ్యక్తి నిర్లక్ష్యానికి అతని భార్య, 3 ఏళ్ల కుమారుడు దుర్మరణం పాలయ్యారు. రీల్స్ చేస్తుండగానే పట్టాలపై రైలు దూసుకు రావడంతో ఈ దుర్ఘటన జరిగింది. ఉమారియా గ్రామ సమీపంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. మృతులను సీతాపూర్ జిల్లాకు చెందిన మహమ్మద్ అహ్మద్(26), అతని భార్య నజ్నీన్(24), వారి 3 ఏళ్ల కుమారుడు అబ్దుల్లాగా పోలీసులు గుర్తించారు.

మాకు మరో 20 సీట్లు వచ్చి ఉంటే వాళ్లు ఈ పాటికి జైల్లో ఉండేవారు: ఖర్గే

అనంత్‌నాగ్, సెప్టెంబరు 11: కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో తమకు మరో 20 సీట్లు దక్కి ఉంటే బీజేపీలో కొందరు నేతలు ఈ పాటికి జైళ్లలో ఉండేవారని అన్నారు. జమ్మూకశ్మీర్ అనంతనాగ్‌లో ఎన్నికల ప్రచారంలో ఖర్గే మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఖర్గే ఈ సందర్భంగా ఎవరి పేర్లు ప్రస్తావించనప్పటికీ ఈ వ్యాఖ్యలు బీజేపీ ముఖ్యనేతలకు ఉద్దేశించి చేసినవేనని అర్థమవుతోంది. మరోవైపు జమ్మూకశ్మీర్ ఎన్నికలకు కాంగ్రెస్ ఐదు గ్యారెంటీలను ప్రకటించింది. మహిళలకు రూ. 5లక్షల వరకు వడ్డీలేని రుణాలు, ప్రతి కుటుంబానికి రూ. 25లక్షల ఆరోగ్య బీమాతో పాటు పలు హామీలిచ్చింది. ప్రతి కుటుంబంలో ఓ మహిళకు నెలకు రూ. 3వేలు, కుటుంబంలోని ప్రతి ఒక్కరికి 11 కేజీల ధాన్యం అలాగే మన్మోహన్ హయాంలో హామీ ఇచ్చినట్లు వలసవచ్చిన కశ్మీరి పండిట్‌లకు పునరావాసం కల్పిస్తామని ప్రకటించింది. అలాగే జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చింది.

తుంగభద్రపై బ్రిడ్జి కమ్ బ్యారేజీలు

- ఏపీకి చెప్పకుండానే కర్ణాటక సన్నాహాలు



కర్నూలులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కర్ణాటక మంత్రి బోస్‌రాజు

కర్నూలు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదిపై రెండు ప్రాంతాల్లో బ్రిడ్జి కమ్ బ్యారేజీల నిర్మాణాలకు కర్ణాటక ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండటం రాయలసీమ ప్రాంతం రైతాంగం, రాష్ట్ర సాగునీటి నిపుణులను ఆందోళనకు గురిచేస్తోంది. ఏపీకి కనీసం చెప్పకుండానే కర్ణాటక ముందుకు వెళుతున్న తీరుపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. కర్ణాటక తలపెట్టిన నిర్మాణాలు జరిగితే కర్నూలు-కడప (కేసీ) కాలువ కింద 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కర్ణాటక చిన్న నీటి పారుదల శాఖ మంత్రి బోస్‌రాజు.. బుధవారం కర్నూలుకు రావడం, ఎంపీని, అధికారులను కలవడం చర్చనీయాంశంగా మారింది. నిజానికి, తుంగభద్ర డ్యామ్‌లో చేరిన పూడిక సాకు చూపి మాన్వి తాలుకా నవలి వద్ద 35 టీఎంసీల సామర్థ్యంతో భారీ రిజర్వాయర్ నిర్మాణం కోసం ఇప్పటికే కర్ణాటక ప్రతిపాదనలు సిద్ధం చేసింది. తాజాగా తుంగభద్ర నదిపై రెండు ప్రాంతాల్లో బ్రిడ్జి కమ్ బ్యారేజీల నిర్మాణానికి సిద్ధమవుతోంది. అందులో ఒకటి.. కర్ణాటకలోని రాయచూరు జిల్లా మాన్వి తాలుకా చికలపర్వి గ్రామాన్ని, ఏపీలోని కర్నూలు జిల్లా కౌతాళం మండలం కుంబళనూరు గ్రామాన్ని కలుపుతూ తుంగభద్ర నదిపై రూ.397.50 కోట్లతో 0.35 టీఎంసీల సామర్థ్యంతో చికలపర్వి బ్రిడ్జి కమ్ బ్యారేజీని తలపెట్టారు. ఇక రెండోవది.... కర్ణాటకలోని రాయచూరు జిల్లా చిన్నమంచాల, కర్నూలు జిల్లా ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం మధ్య తుంగభద్ర నదిపై రూ.350 కోట్లతో 0.31 టీఎంసీల సామర్థ్యంలో చిన్నమంచాల బ్రిడ్జి కమ్ బ్యారేజీని నిర్మించాలని కర్ణాటక చూస్తోంది. అయితే, మన రాష్ట్రం ఆమోదం లేకుండా నిర్మాణాలు చేపడితే భవిష్యత్తులో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే కర్ణాటక మంత్రి బోస్‌రాజ్ బుధవారం కర్నూలుకు వచ్చారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా, జలవనరుల శాఖ ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి, రాయచూరు ఎంపీ కుమార్‌నాయక్‌లతో భేటీ అయ్యారు.

ఇప్పటికే కటకట..

కర్నూలు- కడప (కేసీ) కాలువకు కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్ (కేడబ్ల్యూడీటీ)-1 31.90 టీఎంసీల నికర జలాలను కేటాయించింది. ఇందులో 10 టీఎంసీలు తుంగభద్ర డ్యామ్ నుంచి, 21.90 టీఎంసీలు నదీప్రవాహం ద్వారా తీసుకోవాల్సి ఉంది. తుంగభద్రకు వరద రోజులు తగ్గిపోవడంతో కేసీ కెనాల్ చివరి ఆయకట్టుకు ఇప్పటికే సాగునీరు అందని పరిస్థితి ఉంది. తుంగభద్ర డ్యామ్ నుంచి వాటా జలాలు 10 టీఎంసీల్లో ఇంజనీర్లు ఇచ్చే ఇండెంట్ మేరకు విడుదల చేసినా, సుంకేసుల బ్యారేజీకి 40-50 శాతం కూడా చేరడం లేదని రాయలసీమ సాగునీటి నిపుణులు చెబుతున్నారు. ఎగువన కర్ణాటక బ్రిడ్జి కమ్ బ్యారేజీలు నిర్మిస్తే వాటిని దాటి ఆ వాటా జలాలు కూడా రావని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సమగ్రంగా అధ్యయనం చేసిన తరువాతే చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

భారత్‌లోకి చైనా చొరబాటు

4వేల చ.కి.మీ మేర చొచ్చుకు వచ్చింది.. ఢిల్లీ ఎంత మేర ఉందో అంతమేర లద్దాఖ్‌లోకి

- మోదీ ఎదుర్కోలేకపోయారు
- వాషింగ్టన్‌లో రాహుల్ వ్యాఖ్యలు
- దేశ ప్రతిష్ఠకు గాయం: రాజ్‌నాథ్



న్యూఢిల్లీ/బెంగళూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అమెరికా పర్యటనలో ఉన్న విపక్షనేత రాహుల్ గాంధీ మోదీ ప్రభుత్వంపై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత భూభాగాన్ని చైనా 4వేల చదరపు కిలోమీటర్ల మేర ఆక్రమించిందని.. ఢిల్లీ ఎంత మేర విస్తరించి ఉందో.. అంత మేర లద్దాఖ్‌లో భారత నేలను చైనా దళాలు ఆక్రమించాయని పేర్కొన్నారు. బుధవారం వాషింగ్టన్‌లో ప్రెస్‌క్లబ్‌లో రాహుల్ మాట్లాడారు. భారత్‌లోకి చైనా చొరబాటు ఘోర ఉత్పాతం అని, చైనాను ప్రధాని మోదీ సరిగా ఎదుర్కోలేకపోయారని ఆరోపించారు. తమ భూభాగాన్ని 4వేల చ.కి.మీ పొరుగుదేశం ఆక్రమిస్తే అమెరికా ఏ రకంగా స్పందిస్తుంది? తాను అంతా బాగానే చేశానని ఏ అమెరికా అధ్యక్షుడైనా చెప్పి తప్పించుకోగలరా? అని ప్రశ్నించారు. కాగా దేశం మంచి స్థితికి చేరుకున్న తర్వాత రిజర్వేషన్ల రద్దును పరిశీలిస్తామని మంగళవారం చేసిన వ్యాఖ్యలపై దుమారం చెలరేగడంతో రాహుల్ వివరణ ఇచ్చారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని.. తాను రిజర్వేషన్లను సమర్థిస్తానని.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రిజర్వేషన్ల పరిమితిని 50శాతానికి పైగా తీసుకెళ్తామని చెప్పారు. కాగా చైనా దురాక్రమణ అంటూ రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ అగ్రనేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు ప్రకటనలతో జనాన్ని రాహుల్ తప్పుదోవ పట్టిస్తున్నారని, ఆయన మాటల్లో వాస్తవం లేదని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ విమర్శించారు. మొహబ్బత్ (ప్రేమ) దుకాణాన్ని నడుపుతున్నానని ఇంతవరకూ చెప్పిన రాహుల్ అబద్ధాల దుకాణాలను తెరిచినట్లుందన్నారు. విదేశీ పర్యటనలో రాహుల్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని, ఆయన వ్యాఖ్యలు దేశ ప్రతిష్ఠను గాయపరిచాయని మండిపడ్డారు. దేశ వ్యతిరేక ప్రకటనలు చేస్తున్న రాహుల్ దేశాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులతో చేతులు కలిపారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా విమర్శించారు. జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ దేశ వ్యతిరేక, రిజర్వేషన్ వ్యతిరేక ఎజెండాను సమర్థించడం, విదేశీ వేదికల్లో భారత వ్యతిరేక ప్రకటనలు చేయడం ద్వారా దేశ భద్రత, ప్రజల మనోభావాలకు రాహుల్ వ్యాఖ్యలు ముప్పు అని ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పడం ద్వారా కాంగ్రెస్ రిజర్వేషన్ వ్యతిరేక వైఖరి బయటపడిందని అన్నారు. బీజేపీ ఉన్నంతవరకూ రిజర్వేషన్లను రద్దు చేయడం కానీ, దేశ భద్రతతో ఎవరైనా చెలగాటమాడటాన్ని కానీ అనుమతించదని పేర్కొన్నారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ రాహుల్‌ను భారత వ్యతిరేక వేర్పాటువాదిగా అభివర్ణించారు. దేశ సమైక్యత, సమగ్రత, సామాజిక సామరస్యాన్ని ధ్వంసం చేసేందుకు, దేశాన్ని అంతర్యుద్ధం దిశగా నడిపించేందుకు ఆయన కంకణం కట్టుకున్నారని యోగి విమర్శించారు. ఇదిలా ఉండగా, కర్ణాటక సీఎం సిద్దరామయ్య ముడా వివాదంలో చిక్కుకుని.. సీఎం మార్పుపై చర్చ నడుస్తున్న నేపథ్యంలో.. రాహుల్‌గాంధీని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వాషింగ్టన్‌లో కలిశారు. దీనిపై రాజకీయంగా చర్చలు సాగుతున్నాయి. శివకుమార్ అమెరికా వెళ్లేముందు ఖర్గేకు లేఖ రాశారు. వ్యక్తిగత కారణాలతోనే అమెరికా వెళ్తున్నట్లు అందులో పేర్కొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలు ఖలిస్థాన్‌కు సమర్థనే



భారత్‌లో సిక్కుల మతస్వేచ్ఛ గురించి రాహుల్ చేసిన వ్యాఖ్యలను నిషేధిత ఉగ్రవాద సంస్థ సిఖ్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జే) సమర్థించింది. రాహుల్ వ్యాఖ్యలు ప్రత్యేక ఖలిస్థాన్ డిమాండ్‌ను సమర్థిస్తున్నాయని ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్ అన్నారు. వర్జీనియాలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో రాహుల్ మాట్లాడుతూ 'సిక్కులు తలపాగాలు, కడియాలు ధరించవచ్చా, వారు గురుద్వారాకు వెళ్లగలుగుతున్నారా అనే దానిపైనే భారత్‌లో పోరాటం జరుగుతోంది' అని ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై పన్నూన్ సోషల్ మీడియాలో స్పందించారు. 'భారత్‌లో సిక్కుల అస్తిత్వానికి ముప్పు గురించి రాహుల్ చేసిన వ్యాఖ్యలు సాహసోపేతమైనవి, మార్గదర్శమైనవి మాత్రమే కాదు. ఇది ఖలిస్థాన్ స్థాపనకు పంజాబ్ ఇండిపెండెన్స్ రెఫరెండంను సమర్థించడంపై ఎస్ఎఫ్‌జే వైఖరిని కూడా ధ్రువీకరిస్తుంది' అని పన్నూన్ తెలిపారు.

ఐఎంజీకి భూ కేటాయింపు కేసులో...
సీబీఐ దర్యాప్తునకు నో

(మొదటి పేజీ తరువాయి)

తేల్చిచెప్పింది. ఈ వ్యాజ్యాలపై ఆర్టికల్ 226 కింద తమకున్న అసాధారణ, విచక్షణాధికారాన్ని వినియోగించాల్సిన అవసరం లేదని వివరించింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. 2003లో ఉమ్మడి ఏపీలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఐఎంజీ భారత్ అకాడమీస్‌కు చేసిన 850 ఎకరాల భూకేటాయింపు, ఎంవోయూపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని కోరుతూ వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, జర్నలిస్టు ఏబీకే ప్రసాద్, న్యాయవాది టి.శ్రీరంగారావు 2012లో వేర్వేరు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలుచేశారు. వీటిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం తాజాగా తుది విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు శ్రీపాద ప్రభాకర్, గంద్ర మోహన్‌రావు వాదనలు వినిపించారు. ఈ భూకేటాయింపు వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దిశగా జీవో 310 జారీచేసిందని.. దాన్ని అమలు చేయాలనిమాత్రమే తాము కోరుతున్నామని వివరించారు. ప్రతివాదులు ఐఎంజీ భారత్, ఈ కేసులో ప్రతివాదిగా ఇంప్లీడ్ అయిన అప్పటి క్రీడామంత్రి పి.రాములు తరఫున సీనియర్ న్యాయవాదులు వేదుల వెంకటరమణ, సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. ఐఎంజీ భారత్‌కు చేసిన భూకేటాయింపు,ఎంవోయూను.. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తుచేశారు. రద్దయిన వ్యవహారంపై 21ఏళ్ల తర్వాత దర్యాప్తు చేయడం అంటే శవానికి చికిత్స చేయడంలాంటిదేనని పేర్కొన్నారు. 'విజయసాయిరెడ్డి రాజకీయ నేపథ్యం ఉన్న వ్యక్తి. పిటిషన్ దాఖలు సమయంలో (2012లో) ఆయన సీఏ. వైఎస్ విజయలక్ష్మికి, జగన్‌కు సలహాదారుగా ఉండేవారు. జగన్ అక్రమాస్తుల కేసుల్లో సహనిందితుడిగా జైల్లో ఉన్నారు. వైఎస్ విజయలక్ష్మి దాఖలు చేసిన కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది.' అని తెలిపారు.

సోనియా నివాసం వద్ద
నిరసన ప్రదర్శన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11: భారత్‌లో మతస్వేచ్ఛపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ మద్దతు ఉన్న సిక్కుల గ్రూప్ ఢిల్లీలోని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ నివాసం ఎదుట నిరసన చేపట్టింది. కాంగ్రెస్ పాలనలో కంటే బీజేపీ ప్రభుత్వంలో తాము సురక్షితంగా ఉన్నామని, తన వ్యాఖ్యలకు రాహుల్ క్షమాపణలు చెప్పాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. మరోవైపు, రాహుల్ గాంధీపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఎన్ఐఏ డైరెక్టర్ జనరల్, ఢిల్లీ పోలీసు కమిషనర్‌కు సుప్రీంకోర్టు న్యాయవాది వినీత్ జిందాల్ బుధవారం ఫిర్యాదు చేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం తన వ్యాఖ్యలతో సిక్కులను రెచ్చగొట్టేందుకు రాహుల్ ప్రయత్నించారని ఆ ఫిర్యాదులో జిందాల్ ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రకటనలు చేసినందుకు ఆయనపై కేసు నమోదు చేయాలని, ఆయన పాస్‌పోర్టును రద్దు చేయాలని కేంద్ర హోంమంత్రిని, ఎన్ఐఏను ఫిర్యాదులో కోరానని జిందాల్ తెలిపారు.

వినేశ్‌పై పోటీకి రెజ్లర్‌ను దింపిన ఆప్

జులానా, సెప్టెంబరు 11: రానున్న హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు ఆమ్ ఆద్మీ పార్టీ బుధవారం 20 మంది అభ్యర్థులతో తన రెండో జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో 'జులానా' నియోజకవర్గం నుంచి మాజీ రెజ్లర్ కవితా దలాల్‌ను బరిలోకి దింపనున్నట్లు ప్రకటించింది. ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఆమెపై బీజేపీ తరఫున కెప్టెన్ యోగేశ్ బైరాగీ పోటీ చేస్తుండగా, ఆప్ కవితా దలాల్‌ను రంగంలోకి దింపింది. దాంతో అక్కడ పోటీ ఆసక్తిగా మారింది. కవితా దలాల్ భారతదేశం తరఫున డబ్ల్యూడబ్ల్యూఈలో పాల్గొన్న మొదటి మహిళా రెజ్లర్‌గా గుర్తింపు పొందారు. హరియాణాలో ఆప్ కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేస్తుందని ఊహించినప్పటికీ ఒంటరిగా బరిలోకి దిగింది.

70 ఏళ్లు పైబడిన వారందరికీ..
5 లక్షల ఉచిత ఆరోగ్య బీమా

(మొదటి పేజీ తరువాయి)

కలుగుతుందన్నారు. వారి సామాజిక, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ఏడాదిలో రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సౌకర్యం పొందవచ్చన్నారు. ఇప్పటికే ఈ పథకం వర్తిస్తున్న కుటుంబాల్లోని 70 ఏళ్లు, ఆ పైబడిన వారుంటే... వారికి అదనంగా ఏడాదికి రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తారు. ఒకవేళ ఇతర ప్రభుత్వ బీమా పథకాల్లో (సీజీహెచ్ఎస్, ఈసీహెచ్ఎస్, సీఏపీఎఫ్) ఏవైనా వర్తిస్తుంటే.. దాన్ని లేదా ఆయుష్మాన్ భారత్‌ను ఎంచుకునే వెసులుబాటు ఉంటుంది. ప్రైవేటు ఆరోగ్య బీమా పాలసీలు ఉన్నా లేదా కార్మిక రాజ్య బీమా (ఈఎస్ఐ) పథకం వర్తిస్తున్న వారు ఆయుష్మాన్ భారత్‌లో కూడా లబ్ధి పొందవచ్చు. ఈ పథకంలో అర్హులైన సీనియర్ సిటిజన్లకు ప్రత్యేకంగా కొత్త కార్డు జారీ చేస్తారు. ప్రస్తుతం ఈ పథకంలో 12.34 కోట్ల కుటుంబాలకు చెందిన 55 కోట్ల మందికి ఆరోగ్య బీమా సౌకర్యం ఉంది. పరిమితి ఏడాదికి రూ.5 లక్షలు. ఈ పథకంలో ప్రజలు ఇప్పటిదాకా లక్ష కోట్ల రూపాయల లబ్ధి పొందారని, లబ్ధిదారుల్లో 49 శాతం మహిళలని కేంద్రం పేర్కొంది. ప్రపంచంలో ప్రభుత్వాలు అమలుచేసే ఆరోగ్య బీమా పథకాల్లో అతి పెద్దదిగా ఆయుష్మాన్ భారత్‌కు పేరుంది. ఈ పథకాన్ని 70 ఏళ్లు, ఆ పైబడిన వారి కోసం విస్తరిస్తామని ప్రధాని మోదీ ఏప్రిల్‌లో ప్రకటించారు. కాగా, కేంద్ర క్యాబినెట్ మరికొన్ని కీలక నిర్ణయాలు కూడా తీసుకుంది. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన నాలుగో దశ అమలుకు పచ్చజెండా ఊపింది. రూ.70,125 కోట్లతో 62,500 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులను నిర్మించనున్నట్లు పేర్కొంది. ఈ మొత్తంలో కేంద్రం వాటా రూ.49,087 కోట్లు కాగా.. రాష్ట్రాలది రూ.21,037 కోట్లు. ఈ రహదారుల నిర్మాణంలో 25 వేల నివాస ప్రాంతాలు అనుసంధానం అవుతాయని తెలిపింది. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు ఉద్దేశించిన 'పీఎం ఈ-డ్రైవ్' పథకానికి ఆమోదం తెలిపింది. దీనికి రెండేళ్లలో రూ.10,900 కోట్లు ఖర్చు చేయనుంది. దేశవ్యాప్తంగా 88,500 చార్జింగ్ స్టేషన్లకు కేంద్రం తోడ్పాటు అందించనుంది. 31,350 మెగావాట్ల జల విద్యుత్ ప్రాజెక్టుల కోసం రూ.12,461 కోట్ల కేటాయింపునకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. వచ్చే ఎనిమిదేళ్లలో ఆయా ప్రాజెక్టుల అభివృద్ధికి ఈ నిధులు ఖర్చు చేస్తారు. వాతావరణ హెచ్చరిక వ్యవస్థ సామర్థ్యం పెంచేందుకు, ప్రకృతి విపత్తులను తట్టుకునేందుకు ఉద్దేశించిన 'మిషన్ మౌసమ్'కు కూడా క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ పథకానికి వచ్చే రెండేళ్లలో రూ.2 వేల కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించింది.



సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నివాసంలో బుధవారం నిర్వహించిన గణపతి పూజలో పాల్గొన్న ప్రధాని మోదీ

ఇక ఉత్పత్తిదారులు చెప్పిన ధరే!

- హోల్‌సేల్ ధరల ఇండెక్స్ స్థానంలో 'పీపీఐ'ని తెచ్చే యోచన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11: దేశవ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే వస్తువులు, పదార్థాల ధరలను టోకుగా(హోల్‌సేల్) నిర్ణయించే విధానాన్ని మార్పు చేయాలని కేంద్రం నిర్ణయించింది. 1970ల నుంచి అనుసరిస్తున్న హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్(డబ్ల్యూపీఐ) స్థానంలో ఉత్పత్తిదారుడు సూచించిన ధర.. ప్రొడ్యూసర్ ప్రైస్ ఇండెక్స్(పీపీఐ)ను విధానాన్ని తీసుకురానుంది. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో ప్రస్తుతం పీపీఐ విధానం అమలవుతోంది. ఈ నేపథ్యంలో దేశంలోనూ దీనిని అమలులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. డబ్ల్యూపీఐ విధానంలో ప్రాథమిక అవసరాలకు సంబంధించిన 117 వస్తువులు, చమురు, విద్యుత్‌కు సంబంధించిన 16, తయారీ రంగానికి సంబంధించి 564 ఉత్పత్తులకు ధరలను నిర్ణయిస్తున్నారు.

భారత్‌లో పర్యటించనున్న ముయిజ్జు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు త్వరలో భారత్‌లో పర్యటించనున్నారు. ఈ ప్రకటన వెలువడకముందే గతంలో ప్రధాని మోదీపై నోరు జారిన ఇద్దరు మాల్దీవుల మంత్రులు రాజీనామా చేశారు. అయితే వీరిని గత జనవరిలోనే సస్పెండ్ చేశారు. ముయిజ్జు భారత పర్యటన తేదీపై రెండు దేశాల అధికార వర్గాలు చర్చిస్తున్నాయి. 2023 నవంబర్‌లో అధికారం చేపట్టినప్పటినుంచి ముయిజ్జు చైనా అనుకూల, భారత వ్యతిరేక విధానాలకు ప్రాధాన్యమిచ్చారు. మాల్దీవుల నుంచి తక్షణమే భారత సైనిక బలగాలు వెళ్లిపోవాలని ఆదేశించారు. ఆ తర్వాత ప్రధాని మోదీ లక్షద్వీప్ పర్యటనపై మాల్దీవుల మంత్రులు అభ్యంతర వ్యాఖ్యలు చేయడంతో రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి.

వాడివేడిగా ప్రెసిడెన్షియల్ డిబేట్..
అదరగొట్టిన కమలా హ్యారిస్

- ప్రత్యర్థి డోనాల్డ్ ట్రంప్‌పై స్పష్టమైన ఆధిక్యం
- కమలను మార్క్సిస్ట్‌గా అభివర్ణించిన ట్రంప్
- ట్రంప్ నియంతలను ఆరాధిస్తారన్న కమల



వాషింగ్టన్, సెప్టెంబరు 11: అమెరికా అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న డోనాల్డ్ ట్రంప్, కమలా హ్యారిస్ మధ్య తొలి డిబేట్ వాడివేడిగా జరిగింది. ట్రంప్ కమలను మార్క్సిస్ట్‌గా అభివర్ణిస్తే.. కమల ట్రంప్‌ను నియంతలను ఆరాధించే వ్యక్తి అన్నారు! రష్యా-ఉక్రెయిన్ యుద్ధం అంశం ప్రస్తావనకు వచ్చినప్పుడు ట్రంప్ కమలను 'అసమర్థ సంధానకర్త (బ్యాడ్ నెగోషియేటర్)' అంటే.. 'పుతిన్ నిన్ను లంచ్‌లో నంచుకుతినేస్తాడు' అంటూ కమల తిప్పికొట్టారు. ఈ సంవాదంలో ట్రంప్‌పై స్పష్టమైన ఆధిక్యం సాధించారు. కాపిటోల్‌హిల్‌పై దాడి గురించి, ట్రంప్ పాత పాపాల గురించి అడిగి ఇరుకునపెట్టారు. కమల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ట్రంప్ ఒక దశలో ఆత్మరక్షణ ధోరణిలో పడిపోయారు. డిబేట్ మొదట్లోనే... ట్రంప్‌పై ఉన్న కేసుల గురించి కమలా హ్యారిస్ గట్టిగా ప్రస్తావించారు. పోర్న్‌స్టార్‌తో హష్ మనీ కేసులో సివిల్ కోర్టు శిక్ష విధించిన విషయాన్ని గుర్తుచేశారు. చట్టపరమైన చిక్కుల్లో ఉన్న వ్యక్తి అమెరికా అధ్యక్ష పదవికి ఎంత మాత్రం అర్హుడు కారని వాదించారు. ఈ డిబేట్‌లో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చిన విధానపరమైన అంశాలు.. ఆర్థిక వ్యవస్థ, గర్భవిచ్ఛిత్తి హక్కులు, వలస విధానాలు, ఆరోగ్య సంరక్షణ. బైడెన్ పాలనలో అమెరికా ఆర్థిక వ్యవస్థ కుదేలైందని, యంత్రాంగం సరిగ్గా పనిచేయలేదని ట్రంప్ విమర్శించగా.. ట్రంప్ పాలనలో ధ్వంసమైన ఆర్థికవ్యవస్థ తమ చేతికి వచ్చిందని కమల తిప్పికొట్టారు. దేశంలో అక్రమ వలసదారుల సంఖ్య పెరిగిపోవడానికి కారణం కమలా హ్యారిసేనని.. అలా వస్తున్న వలసదారులు తినడానికి తిండి లేక ప్రజల పెంపుడుకుక్కల్ని తింటున్నారంటూ ఆన్‌లైన్‌లో వచ్చే వదంతులను ట్రంప్ ప్రస్తావించారు. ట్రంప్ పాలనలో ఇమిగ్రేషన్, విదేశీ విధానాలు, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో లోపాలను కమల ఎత్తిచూపారు. అబార్షన్ల హక్కుపైనా ట్రంప్‌ను నిలదీశారు. ఆయన అధ్యక్షుడైతే అబార్షన్ల నిషేధ చట్టంపై సంతకం చేస్తారన్నారు. అబార్షన్ల నిషేధానికి తాను అనుకూలం కాదని ట్రంప్ పేర్కొన్నారు.

యుద్ధాలపైనా..

ఇజ్రాయెల్-హమాస్, ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర, అఫ్ఘానిస్థాన్ నుంచి అమెరికా సేనల ఉపసంహరణ అంశాలపై ట్రంప్, హ్యారిస్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. కమలాహ్యారిస్‌ను అసమర్థ సంధానకర్తగా అభివర్ణించిన ట్రంప్.. తాను గెలిస్తే అధ్యక్షుడిగా (2025 జనవరిలో) పగ్గాలు చేపట్టే సమయానికే ఈ యుద్ధాన్ని ఒక కొలిక్కి తెస్తానని చెప్పారు. అయితే.. ఈ యుద్ధం మొదలైనప్పుడు ట్రంప్ అధ్యక్షుడిగా ఉండి ఉంటే.. ఈ పాటికే పుతిన్ ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో తిష్టవేసి యూరప్‌పై దృష్టి సారించి ఉండేవారని కమల ఆందోళన వ్యక్తం చేశారు. కమల గెలిస్తే ఇజ్రాయెల్ ఉనికి లేకుండా చేస్తారని, ఆమె ఇజ్రాయెల్ ద్వేషి అని ట్రంప్ వ్యాఖ్యానించగా.. ఇజ్రాయెల్‌కు తనను తాను రక్షించుకునే హక్కుందని, అయితే ఈ యుద్ధం ముగియాలని తాము కోరుకుంటున్నామని కమల చెప్పారు. ట్రంప్ చైనాకు అమ్ముడుపోయారని, ఆయన నియంతలను ఆరాధిస్తారని, ఉత్తర కొరియా నియంత కిమ్‌జోంగ్ ఉన్‌కు ప్రేమలేఖలు రాశారని కమల అంటే.. చైనా, రష్యా ఉత్తరకొరియా తనకు భయపడ్డాయని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ సంవాదంలో కమల అదరగొట్టారని అమెరికా మీడియా కితాబివ్వడం గమనార్హం! డిబేట్ 105 నిమిషాలపాటు జరిగింది. కాగా.. కమలకు, రిపబ్లికన్ల ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్ భార్య ఉషకు.. ఇద్దరికీ భారతీయ మూలాలున్నా ఈ డిబేట్‌లో ఎక్కడా భారత్ గురించి ప్రస్తావన రాకపోవడం గమనార్హం.

హ్యావ్ ఫన్.. ట్రంప్ వ్యంగ్యం

డిబేట్ మొదలుపెట్టడానికి ముందు కమలాహ్యారిస్ ట్రంప్‌తో కరచాలనం చేశారు. ఆ సమయంలో ఆమె తన పేరు చెప్పగా.. 'నైస్ టు సీ యూ.. హ్యావ్ ఫన్' అంటూ ట్రంప్ వ్యంగ్యంగా బదులిచ్చారు. 2016 తర్వాత ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో అధ్యక్ష అభ్యర్థులు షేక్ హ్యాండ్ ఇచ్చుకోవడం ఇదే మొదటిసారి అని అమెరికన్ మీడియా తెలిపింది.

శభాష్ కమలా..

డిబేట్ తర్వాత అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, ప్రస్తుత అధ్యక్షుడు జోబైడెన్ స్పందించారు. కమలా హ్యారిస్ అమెరికాకు అధ్యక్షురాలు కావడం తథ్యమని వారు అభిప్రాయపడ్డారు. డిబేట్‌లో ఆమె అద్భుతంగా మాట్లాడారని కితాబిచ్చారు. కమల తన విజన్‌ను స్పష్టంగా చెప్పగలిగారని కొనియాడారు. జోబైడెన్ కూడా.. అమెరికాకు కమలా హ్యారిస్ ఒక గొప్ప అవకాశమంటూ ట్వీట్ చేశారు. పాప్ స్టార్ టేలర్ స్విఫ్ట్ కూడా కమలకు మద్దతు ప్రకటించారు.

చెవి పోగులేనా?

ఈ డిబేట్‌లో కమలా హ్యారిస్ ధరించిన చెవి పోగులపై సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. డిబేట్ ముగిసిన అనంతరం.. అచ్చం ఆమె ధరించిన చెవి పోగుల్లాంటి ఇయర్‌ఫోన్లనే ఒక టెక్ ఆర్టికల్‌లో చూశానంటూ 'ఎక్స్'లో ఒక వ్యక్తి ట్వీట్ చేశాడు. అది వైరల్ అయ్యింది. మరికొందరు కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

కూలీలపై మృత్యు పంజా





కాల్వలో బోల్తాపడిన జీడి పిక్కల వ్యాన్, (ఇన్‌సెట్)ప్రమాద స్థలంలో మృతదేహాలు

- జీడిపిక్కల వ్యాన్ అదుపు తప్పి కాల్వలో బోల్తా
- బస్తాల కింద పడి ఊపిరాడక ఏడుగురు దుర్మరణం
- డ్రైవర్ సహా మరో నలుగురు సురక్షితం
- తూర్పు గోదావరి జిల్లా చిన్నాయిగూడెంలో ఘోరం
- కన్నీటి సంద్రమైన తాడిమళ్ల గ్రామం
- మృతుల కుటుంబాలకు రూ.ఐదేసి లక్షల ఎక్స్‌గ్రేషియా

దేవరపల్లి, సెప్టెంబరు 11: తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం శివారు చిలకావారిపాక సమీపంలో జీడిపిక్కల బస్తాలతో వెళ్తున్న మినీ వ్యాను అదుపు తప్పి కాల్వలో పడడంతో ఏడుగురు జట్టు కూలీలు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. మరొకరు తీవ్ర గాయాల పాలయ్యారు. ఏలూరు జిల్లా టి.నర్సాపురం మండలం బొర్రంపాలెం నుంచి నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామానికి వెళ్తుండగా గతుకుల రోడ్డు కారణంగా మంగళవారం రాత్రి ఈ ఘోరం జరిగింది. మృతులంతా తాడిమళ్ల గ్రామానికి చెందినవారే. తాడిమళ్లలో సుమారు 100 వరకు జీడి పిక్కల ఫ్యాక్టరీలు ఉన్నాయి. జీడిపిక్కలను బస్తాల్లో పట్టడం, ఎగుమతి, దిగుమతికి తాడిమళ్లతోపాటు.. చుట్టుపక్క గ్రామాల నుంచి పురుషులు జట్టు కూలీలుగా పనులకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కాత్తవ కృష్ణ(మేస్త్రి-40) ఆధ్వర్యంలో కాత్తవ నారాయుడు(45), తాడి రామకృష్ణ(45), తమ్మిరెడ్డి సత్యనారాయణ(44), దేశాల వీర వెంకటరావు (బూరయ్య-40), బొక్కా ప్రసాద్ (35), పెనుగుర్తి చినముసలయ్య(35) జట్టుగా మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో వ్యానులో బయలుదేరి జంగారెడ్డిగూడెం మండలం బొర్రంపాలెం వెళ్లారు. వీరంతా నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామానికి చెందినవారు కాగా, బొక్కా ప్రసాద్ (40)ది కాటాకోటేశ్వరం గ్రామం. వీరంతా జీడి పిక్కలను బస్తాల్లోకి ఎత్తి ఎగుమతి చేసుకొని అక్కడి నుంచి రాత్రి 8 గంటల ప్రాంతంలో బయలుదేరారు. వ్యాను చిన్నాయిగూడెం దగ్గరలోని చిలకవారిపాకలు(పట్టాభిపురం-తాడిమళ్లకు 15కి.లో.దూరం) వద్ద బుధవారం రాత్రి 11.30 గంటల సమయంలో అదుపుతప్పి రోడ్డు పక్క తుప్పలతో నిండిన చిన్న లోయలాంటి కాల్వలో బోల్తాపడింది. దీంతో ఎనిమిది మందిలో ఏడుగురు 15 టన్నుల లోడు బస్తాల కింద నలిగి అక్కడికక్కడే మృతి చెందారు. వ్యాను క్యాబిన్‌లో ఉన్న ఇమ్మానుయెల్ అనే మరో కూలీ, డ్రైవరు, క్లీనరు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ వ్యానుకు ముందు వెళుతున్న మరో వ్యానులో జీడిపిక్కల ఫ్యాక్టరీ యజమాని అనుచరుడు నాగబాబు, మరో నలుగురు జట్టు కూలీలు ఉన్నారు. ఇమ్మానుయెల్ ఫోన్ చేయడంతో వారితోపాటు స్థానికులు వచ్చి సుమారు 2 గంటలపాటు శ్రమించి మొత్తం ఎనిమిది మందినీ బయటకు తీశారు. అందులో ఏడుగురు చనిపోగా, తీవ్రగాయాలైన గంటా మధును 108 వాహనంలో గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ మాపాటి శివాజీ పరారీలో ఉన్నాడు. బుధవారం తెల్లవారుజాము మూడు గంటల సమయంలో డీఎస్పీ దేవకుమార్ ఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. వ్యాను రోడ్డుపై డ్రైవర్ గోతులను తప్పించబోయి అదుపుతప్పి బోల్తాపడిందని చెప్పారు. అలాగే మెయిన్ రోడ్డులోంచి రావాల్సిన ఈ వ్యాన్ చెక్‌పోస్టులో సెస్ తప్పించుకోవడానికి అర్ధరాత్రి ఈ అడ్డరోడ్డులో వచ్చిందన్నారు.. ఎస్పీ నరసింహకిశోర్ బుధవారం ఉదయం ఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, మృతులంతా నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామానికి చెందిన వారే కావడంతో ఆ గ్రామం అంతటా రోదనలతో నిండిపోయింది. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాల వద్ద వారి విలపించిన తీరు అందరినీ కన్నీళ్లు పెట్టించింది.

చంద్రబాబు, పవన్ దిగ్భ్రాంతి

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం చిలకావారిపాకలు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జీడిపిక్కల లోడు లారీ బోల్తా కొట్టిన ప్రమాదంలో ఏడుగురు మృతి చెందటంపై తీవ్ర విచారం తీవ్ర వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు.బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్యంపై బుధవారం ఉదయం ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం

నిడదవోలు, సెప్టెంబరు 11: మృతుల కుటుంబాలకు.. రూ.ఐదేసి లక్షల చొప్పున ప్రభుత్వ పరిహారం ప్రకటించింది. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే మంత్రి కందుల దుర్గేష్ బుధవారం తాడిమళ్ల గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆయన స్వయంగా ఒక్కో కుటుంబానికి రూ.25 వేల చొప్పున, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు రూ.20 వేల చొప్పున పరిహారం అందజేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యం మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.3లక్షల చొప్పున అందజేస్తామని ప్రకటించింది.

రూ.7,000 కోట్లు తక్షణమే ఇవ్వండి!

- పోలవరంపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన

అమరావతి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో అత్యంత ప్రధానమైన కొత్త డయాఫ్రం వాల్, దానిపై ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం నిర్మాణాలను సమాంతరంగా చేపట్టేందుకు తక్షణమే రూ.7 వేల కోట్లు మంజూరు చేయాలంటూ కేంద్రాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ కోరనుంది. ప్రాజెక్టులో మిగిలిన ప్రధాన డ్యాం పనులు పూర్తి చేసేందుకు రూ.12,127 కోట్లు కేటాయించాలని కేంద్ర కేబినెట్ ఇప్పటికే నిర్ణయించింది. ఈ సమాచారాన్ని కేంద్ర జలశక్తి శాఖ రాష్ట్రానికి చేరవేసింది. 2025 మార్చిదాకా అవసరమయ్యే నిధుల కోసం అభ్యర్థన పంపాలని సూచించింది. దీంతో వెంటనే రూ.7 వేల కోట్లు విడుదల చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు విజ్ఞాపన పంపనుంది. కేంద్రం తప్పకుండా సానుకూలంగా స్పందిస్తుందని భావిస్తోంది. ఇంకోవైపు.. ప్రాజెక్టుకు కేంద్రం రూ.12,127 కోట్లు మంజూరు చేసేందుకు అంగీకరించడం.. కొత్త వాల్, ఈసీఆర్ఎఫ్ డ్యాం నిర్మాణాలను వచ్చే నవంబరు నుంచే మొదలుపెట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో.. కొత్త టెండర్లకు వెళ్లకుండా.. ఇప్పటికే నిర్మాణ పనులు చేపడుతున్న మేఘా ఇంజనీరింగ్ సంస్థకే వాటి నిర్మాణ పనులు అప్పగిస్తూ జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఇటీవల మెమో జారీ చేశారు. నవంబరు నుంచి కొత్త వాల్ నిర్మాణ పనులు చేస్తూనే.. దానిపై సమాంతరంగా ఈసీఆర్ఎఫ్ డ్యాం కూడా కట్టడం వల్ల రెండు సీజన్లు కలిసొస్తాయని.. ఏడాదిన్నరలోనే ఈ రెండు కీలక నిర్మాణాలు పూర్తవుతాయని విశ్వసిస్తోంది. జలశక్తి శాఖ కూడా 2027 నాటికి పోలవరం తొలిదశ పూర్తికావాలని లక్ష్యం విధించింది.

ఆదిమూలం పిటిషన్‌ను తగిన బెంచ్ ముందు ఉంచండి

- రిజిస్ట్రీకి న్యాయమూర్తి ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపుల ఆరోపణలతో తిరుపతి ఈస్ట్ పోలీసులు నమోదు చేసిన అత్యాచారం కేసును కొట్టివేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. అయితే, ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను తగిన బెంచ్ ముందు ఉంచాలని రిజిస్ట్రీని న్యాయమూర్తి ఆదేశించారు. వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి ముందుంచి సాధ్యమైనంత త్వరగా విచారణకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ప్రజాప్రతినిధులపై నమోదైన కేసులను రోస్టర్ ప్రకారం మరో బెంచ్ విచారించాల్సి ఉందని తెలిపారు.

హోర్డింగ్స్, ఫ్లెక్సీలను నియంత్రించాల్సిందే

- రోడ్ల పక్కన, వీధి దీపాల స్తంభాలకు విచ్చలవిడిగా కడుతున్నారు: హైకోర్టు
- అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల వివరాలూ సమర్పించండి
- రాష్ట్ర ప్రభుత్వానికి ధర్మాసనం ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విచ్చలవిడిగా వెలుస్తున్న హోర్డింగ్స్, ఫ్లెక్సీ బ్యానర్లను నియంత్రించాల్సిన అవసరం ఉందని హైకోర్టు వ్యాఖ్యానించింది. నగరాలు, పట్టణాలు ఉన్నది హోర్డింగ్స్ ఏర్పాటు చేయడానికి కాదని వ్యాఖ్యానించింది. ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారీతిన రోడ్ల పక్కన, వీధి దీపాల స్తంభాలకు హోర్డింగ్స్ కడుతున్నారని.. రాకపోకలకు అసౌకర్యం కలిగిస్తున్నారని వ్యాఖ్యానించింది. రాజకీయ పార్టీల నాయకులే కాకుండా ప్రైవేటు వ్యక్తులు సైతం అనుమతులు లేకుండా హోర్డింగ్స్ ఏర్పాటు చేస్తున్నారని పేర్కొంది. చట్టవిరుద్ధంగా వీటిని పెడుతుంటే మున్సిపల్ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించింది. వాటిని తొలగించాల్సిన బాధ్యత వారిది కాదా అని నిలదీసింది. రాష్ట్రంలోని ఉన్న అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అవి హోర్డింగ్స్ ఏర్పాటుకు ఎంత మందికి అనుమతులు ఇచ్చాయి.. అనధికారికంగా ఎంతమంది పెట్టారు.. వారిపై ఏం చర్యలు తీసుకున్నారు తదితర అంశాలపై వివరణ కోరతామని తెలిపారు. ఆ వివరణను పరిశీలించిన అనంతరం తగిన ఆదేశాలు ఇస్తామని తెలిపింది. ఈ వ్యవహారంలో కోర్టుకు సహాయకారిగా(అమికస్ క్యూరీ)గా న్యాయవాది వివేక్ చంద్రశేఖర్‌ను నియమించింది. విచారణను రెండువారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అనధికారిక హోర్డింగ్స్, బ్యానర్లను అధికారులు తొలగించకపోవడాన్ని సవాల్ చేస్తూ డాక్టర్ అగరాల ఈశ్వర్‌రెడ్డి 2018లో దాఖలు చేసిన పిల్‌పై బుధవారం హైకోర్టు విచారణ జరిపింది.

బీచ్‌లో నిర్మాణాలా?

- సాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి నిర్మాణాలపై హైకోర్టు విస్మయం

అమరావతి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం, భీమునిపట్నం బీచ్‌లో వైసీపీ రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె పెనకా నేహారెడ్డి చేపట్టిన నిర్మాణాలపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఫొటోలను పరిశీలిస్తే ఆ నిర్మాణాలన్నీ బీచ్‌లోనే నిర్మించినట్లు స్పష్టంగా అర్థమవుతుందని పేర్కొంది. ప్రహరీ విషయమే కాదు ఆ నిర్మాణాల సంగతి కూడా చూడాలని జీవీఎంసీని ఆదేశించింది. ప్రహరీ కూల్చివేతకు అయిన ఖర్చును కూడా నేహారెడ్డి నుంచే వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. నిర్మాణాలు చేపట్టిన భూమి యాజమాన్య హక్కులపై ఆధారాలు చూపాలంటూ జీవీఎంసీ ఆమెను వివరణ అడిగిన నేపథ్యంలో హైకోర్టు తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. భీమునిపట్నం పరిధిలో సీఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించి సముద్రానికి అతిసమీపంలో విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి నిర్మాణాలు చేపడుతున్నారంటూ జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. పిల్‌పై విచారణ జరిపిన సీజే ధర్మాసనం సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి సముద్ర తీరంలో జరుపుతున్న నిర్మాణాలను నిలుపుదల చేయాలని, వాటి తొలగింపునకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. బుధవారం ఈ వ్యాజ్యం మరోసారి విచారణకు వచ్చింది. ధర్మాసనం ఆదేశాలను అనుసరించి బీచ్‌లో నిర్మించిన ప్రహరీని అధికారులు తొలగించారని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి తెలిపారు. ఇతర నిర్మాణాల విషయంలో నేహారెడ్డి ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదన్నారు. ఈ నేపథ్యంలో ఆ భూమికి సంబంధించిన యాజమాన్య హక్కుపై ఆధారాలు చూపాలని అధికారులు నోటీసులు ఇచ్చారన్నారు. వివరాలు సమర్పించేందుకు మరో రెండు రోజులు సమయం ఉందన్నారు. మూర్తియాదవ్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వం సమర్పించిన నివేదికపై రిప్లై వేసేందుకు సమయం ఇవ్వాలని కోరారు. నేహారెడ్డి తరఫు న్యాయవాది స్పందిస్తూ.. తమను ప్రతివాదిగా చేర్చకుండానే ప్రజాహిత వ్యాజ్యంలో ఆదేశాలు పొందారన్నారు. కేసులో సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తారని, ఈ రోజే వకాల్తా వేశామన్నారు. వ్యాజ్యంపై గురువారం విచారణ చేపట్టాలని కోరారు. ధర్మాసనం విచారణను వారం రోజులకు వాయిదా వేసింది.

చంద్రబాబుపై సీఐడీ కేసులను సీబీఐ, ఈడీకి ఇవ్వాలంటూ పిల్

- హైకోర్టు విచారణ 2 నెలలకు వాయిదా

అమరావతి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, మరికొందరిపై దాఖలైన కేసుల విచారణను సీబీఐ, ఈడీలకు అప్పగించేలా ఆదేశాలివ్వాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)పై విచారణను హైకోర్టు రెండు నెలలకు వాయిదా వేసింది. కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం ఇవ్వాలన్న అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ అభ్యర్థనకు సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. అమరావతిలో ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం, అసైన్డ్ భూముల కొనుగోలు, లిక్కర్ పాలసీ, ఉచిత ఇసుక విధానం, ఫైబర్‌గ్రిడ్, స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో చంద్రబాబు, మరికొందరిపై సీఐడీ నమోదు చేసిన కేసులన్నింటినీ సీబీఐ, ఈడీలకు అప్పగించాలంటూ విజయవాడకు చెందిన స్వర్ణాంధ్ర తెలుగు డైలీ ఎడిటర్ కె.బాలగంగాధర్ తిలక్ ఈ పిల్ వేశారు.

కోర్టు ముందు హాజరవ్వాల్సిందే!

స్వీయ పూచీకత్తు సమర్పించాల్సిందే.. ఎన్‌వోసీపై జగన్‌కు హైకోర్టు స్పష్టీకరణ

పూచీకత్తు సమర్పించడమంటే విచారణ ప్రక్రియలో పాల్గొంటానని కోర్టుకు వాగ్దానం చేయడమే. కోర్టు విచారణ ప్రక్రియకు లోబడి ఉంటానని జగన్ ఒకవైపు చెబుతూ.. అందుకు భిన్నంగా ప్రత్యేక కోర్టు ఉత్తర్వులను ప్రశ్నిస్తున్నారు. 2018 నుంచి పరువునష్టం కేసు పెండింగ్‌లో ఉందని జగన్‌కు తెలుసు. న్యాయవాదిని పెట్టుకుని కోర్టు నుంచి అనుకూల ఉత్తర్వులు కూడా పొందారు. సమన్లు అందలేదన్న వాదనతో ప్రయోజనం పొందలేరు.

- హైకోర్టు

అమరావతి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాస్‌పోర్టు జారీకి అవసరమైన నిరభ్యంతరం పత్రం (ఎన్‌వోసీ) పొందేందుకు ప్రత్యేక కోర్టు ముందు హాజరవ్వాలని.. రూ.20 వేల స్వీయ పూచీకత్తు సమర్పించాల్సిందేనని హైకోర్టు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి తేల్చిచెప్పింది. పాస్‌పోర్టును ఏడాది పాటే పునరుద్ధరిస్తామని, తమ ముందు హాజరై రూ.20వేల పూచీకత్తు సమర్పించాలని విజయవాడ ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు విధించిన షరతులను పాక్షికంగా సవరించింది. ఐదేళ్లపాటు పాస్‌పోర్టు రెన్యువల్‌కు వీలుగా ఎన్‌వోసీ జారీ చేయాలని సదరు కోర్టును ఆదేశించింది. రూ.20 వేల బాండ్‌తో పూచీకత్తు సమర్పించాలని ప్రత్యేక కోర్టు విధించిన షరతు కఠినమైనదేమీ కాదని పేర్కొంది. 'రాజ్యాంగం నిర్దేశించిన చట్టబద్ధమైన పాలనకు లోబడి దేశ పరిపాలన ఉంటుందని, న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలకు అందరూ బద్ధులై ఉండాల్సిందేనని ప్రజాజీవితంలో ఉన్న పిటిషనర్ (జగన్)కు బాగా తెలుసు. విజయవాడ ప్రత్యేక కోర్టులో 2018 నుంచీ పరువునష్టం కేసు ఉందని ఆయనకు తెలుసు. ఆయన సహనిందితుడు కేసు విచారణలో పాల్గొంటున్నారని కూడా తెలుసు. ఈ నేపథ్యంలో ఆ కేసు విచారణలో సాధ్యమైనంత త్వరగా పాల్గొంటారని ఆశిస్తాం. అయితే అలా జరుగలేదు. ప్రస్తుతం జగన్ తరఫున ప్రత్యేక కోర్టులో న్యాయవాది వకాలత్ వేసి పాస్‌పోర్ట్ జారీకి అవసరమైన ఎన్‌వోసీ కోసం పిటిషన్ వేశారు. అవసరం కాబట్టే ఆయన న్యాయవిచారణ ప్రక్రియలో పాల్గొన్నారని గుర్తించాలి. పరువునష్టం కేసులో సమన్లు అందనందున పూచీకత్తు సమర్పించాలని ప్రత్యేక కోర్టు ఆదేశించజాలదన్న జగన్ వాదన సరికాదు. కేసు పెండింగ్‌లో ఉందని తెలియనివారికి.. కేసు ప్రొసీడింగ్స్‌లో పాల్గొనేందుకు వీలుగా సమాచారం ఇచ్చేందుకు మాత్రమే సమన్లు జారీ చేస్తారు. కోర్టుకు హాజరైతే భద్రత కల్పన విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయని జగన్ చెబుతున్నారు. రాజకీయ ప్రముఖుల కేసులను విచారిస్తున్న ప్రత్యేక కోర్టు వద్ద ఇలాంటివి సర్వసాధారణం. కోర్టు ఉత్తర్వులు సాఫీగా అమలయ్యేందుకు వీలుగా రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక కోర్టు వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలి' అని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఎన్‌వోసీ జారీకి కోర్టు ముందు హాజరై.. రూ.20 వేల స్వీయ పూచీకత్తు సమర్పించడం సహా ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ బుధవారం తీర్పు ఇచ్చారు. పాస్‌పోర్ట్ జారీకి అవసరమైన నిరభ్యంతరపత్రం(ఎన్‌వోసీ) ఇచ్చేందుకు విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు కఠిన షరతులు విధించడాన్ని సవాల్ చేస్తూ జగన్ శుక్రవారం అత్యవసరంగా హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై సోమవారం సుదీర్ఘ వాదనలు జరిగాయి. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. తీర్పును రిజర్వ్ చేసిన న్యాయస్థానం బుధవారం నిర్ణయం వెలువరించింది.

బిగ్‌బాస్ షోపై తీర్పు రిజర్వ్

- హైకోర్టులో ముగిసిన వాదనలు

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): యువతను పెడదారి పట్టించడంతోపాటు అశ్లీలత, హింసను ప్రోత్సహించేలా ఉన్న బిగ్‌బాస్ రియాలిటీ షో ప్రసారాన్ని నిలిపివేయాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. దీంతో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ప్రకటించింది. సామాజిక కార్యకర్త, సినీ నిర్మాత కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి ఈ పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది శివప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. బిగ్‌బాస్ షో అశ్లీలత, అసభ్యతను ప్రోత్సహించేదిలా ఉందని, సెన్సార్ లేకుండా షోను ప్రసారం చేస్తున్నారని తెలిపారు. నిబంధనల ప్రకారం అశ్లీలత ఉన్న కార్యక్రమాలను రాత్రి 11, ఉదయం 5 గంటల మధ్య మాత్రమే ప్రసారం చేయాలన్నారు. అయితే, కార్యక్రమంలో అశ్లీలతను వివరించేందుకు న్యాయవాది వాడుతున్న బాషపై ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. కాగా, వ్యాజ్యంలో సినీనటుడు నాగార్జున ప్రతివాదిగా ఉన్నారని, ఆయన ఇప్పటివరకు వకాలత్ వేయలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. స్టార్ ఇండియా తరఫున సీనియర్ న్యాయవాది ఒ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ... టీవీ ప్రసారాల్లో అశ్లీలతపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యామ్నాయమార్గం ఉందన్నారు. కేబుల్ టీవీ నెట్‌వర్క్ చట్టం ప్రకారం ఫిర్యాదులను పరిశీలించేందుకు మూడు అంచెల వ్యవస్థ ఉందని తెలిపారు. చట్టనిబంధనలకు లోబడే కార్యక్రమాన్ని ప్రసారం చేస్తున్నామన్నారు. అశ్లీలతపై పిటిషనర్ ఎలాంటి ఆధారాలనూ కోర్టు ముందు ఉంచలేదన్నారు.

నందిగం సురేశ్ కేసు వివరాలు ఇవ్వండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై జరిగిన మూకదాడి కేసులో వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్‌పై దాఖలైన కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై జరిగిన మూకదాడి కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ నందిగం సురేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదే కేసులో ఆయనకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరిస్తూ హైకోర్టు ఇటీవల ఉత్తర్వులు ఇచ్చింది. అనంతరం, రాష్ట్రం విడిచి హైదరాబాద్ పారిపోతున్న సురేశ్‌ను పోలీసులు హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డుపై అరెస్టు చేశారు. మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా 14 రోజులు జ్యుడీషియల్ కస్టడీ విధించారు. ప్రస్తుతం ఆయన గుంటూరు జైల్లో ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సముచిత నిర్ణయం

తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయానికి చిట్యాల (చాకలి) ఐలమ్మ పేరు పెట్టాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం స్వాగతించదగింది. దొరల అరాచకాలకు ఎదురొడ్డి నిలచిన ఈ వీర వనిత పోరాటస్ఫూర్తి భవిష్యత్ తరాలకు గుర్తుండేలా హైదరాబాద్ కోఠీలోని విశ్వవిద్యాలయానికి ఆమె పేరు పెడుతున్నామని రేవంత్ ప్రకటించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పేదలకు భూహక్కులు కల్పించడం, పీవీ నరసింహారావు చేపట్టిన భూ సంస్కరణలు లక్షలాదిమంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, నిరుపేదలకు మేలు చేకూర్చాయని, ఆ నిర్ణయాల వెనుక ఐలమ్మ భూ పోరాటం స్ఫూర్తి ఉన్నదని అన్నారు రేవంత్. విశ్వవిద్యాలయానికి ఐలమ్మ పేరుపెట్టడంతోపాటు, ఆమె మనుమరాలు శ్వేతను రాష్ట్ర మహిళాకమిషన్ సభ్యురాలిగా నియమిస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. బడుగులకు, వృత్తి కులాలకు గుర్తింపునూ, గౌరవాన్ని కల్పించే సముచిత నిర్ణయాలివి.

రవీంద్రభారతిలో ఐలమ్మ 39వ వర్ధంతి కార్యక్రమంలో అప్పటికప్పుడు చేసిన ప్రకటనగా కనిపించినప్పటికీ, మహిళా యూనివర్సిటీకి ఈ వీరవనిత పేరుపెట్టాలన్న నిర్ణయం వెనుక పాలకుల మదిలో ఏదో వ్యూహం, వెనుక మేధోమథనం ఉండక పోదు. ప్రొఫెసర్ కంచ ఐలయ్య ఈ పేరును సూచించారంటూ రేవంత్ చెప్పడం ఉదాత్తంగా ఉంది. అధికారంలోకి రాగానే ప్రజా భవన్‌కు జ్యోతీబా పూలే పేరుపెట్టడాన్ని రేవంత్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఐఐహెచ్‌టీకి కొండా లక్ష్మణ్ పేరుపెట్టడం వరకూ తన ప్రభుత్వం తెలంగాణ కోసం పోరాడిన మహనీయులను ఏ విధంగా స్మరించుకుంటున్నదో కూడా ఆయన వివరించారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ భూములు, చెరువుల పరిరక్షణకు ఏర్పడిన హైడ్రా దూకుడుగా తనపనిచేసుకుపోతున్న నేపథ్యంలో, భూముల ఆక్రమణలను అడ్డుకోవడంలోనూ ఐలమ్మ తమకు స్ఫూర్తిగా నిలిచిందని ముఖ్యమంత్రి చెప్పుకున్నారు. ఇటీవల దివంగతులైన వడ్డేపల్లి కృష్ణ ఐలమ్మమీద రచించిన నృత్యరూపకాన్ని ఈ సందర్భంగా తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు అలేఖ్య పుంజాల బృందం ప్రదర్శించడం సముచితంగా, శోభస్కరంగా ఉంది.

ఐలమ్మ వర్ధంతి సందర్భంగా తీసుకున్న నిర్ణయమే అయినప్పటికీ, తెలంగాణ సాయుధపోరాట వారోత్సవాల నేపథ్యంలోనూ ఇది మరింత సరైన నిర్ణయం. దొరల అరాచకాలకు ఎదురొడ్డి నిలిచిన ఐలమ్మ తెలంగాణ సాయుధపోరాటానికి ఆది, పునాది. భూమికోసం, భుక్తికోసం, వెట్టినుంచి విముక్తికోసం సాగిన ఆ సుదీర్ఘ పోరాటానికి ఆమె భూసమస్యే వేదికైంది. విస్నూర్ దేశ్‌ముఖ్ మీద ఆమె తిరుగుబాటు, దొర గూండాలు, రజాకార్లతో నిత్య ఘర్షణలు ఒక నిరంతర స్ఫూర్తి. ఒక చిన్న తిరుగుబాటుగా మొదలై, రైతాంగపోరాటంగా మారి నిరుపేదలకు పదిలక్షల ఎకరాల భూపంపిణీకి వీలుకల్పించింది, సమాజంలో అట్టడుగువర్గాలకు, అంటరాని కులాలకు పీడననుంచి విముక్తి దక్కింది. ఆధిపత్యపెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా ఆమె చేసిన ఆత్మగౌరవపోరాటం బడుగులకు కొండంత శక్తినిచ్చింది. దొర అకృత్యాలకు తన కుటుంబం చిన్నాభిన్నమైపోయినా, ఆత్మవిశ్వాసమే ఆయుధంగా భూపోరాటాలకు దారిచూపింది ఆమె. ప్రజాపోరాటాలకు స్ఫూర్తిగా, మహిళాశక్తికీ, చైతన్యానికీ ప్రతీకగా నిలిచిన ఆ యోధురాలి పేరును మహిళావిశ్వవిద్యాలయానికి పెట్టడం సముచితంగా ఉంటుందని ప్రభుత్వం భావించింది. ఆమె ధైర్యం, తెగువ, ప్రతిఘటనాతత్వం మహిళలు, విద్యార్థినులకు ఎల్లవేళలా స్ఫూర్తినివ్వాలన్నది పాలకుల అభీష్టం కావచ్చు. తెలంగాణకు సంబంధించిన చిహ్నాలు, గుర్తింపుల విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఒక పోటీ నడుస్తోంది. పాటలు, స్థలాలు, విగ్రహాలు ఇత్యాది అంశాల్లో ఇరుపక్షాల మధ్యా సాగుతున్నదేమిటో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. గత బీఆర్ఎస్ పాలనలో వెనుకపట్టుపట్టిన లేదా గుర్తింపునకు నోచుకోని అంశాలను ముందుకు తీసుకురావడం, తన ప్రత్యేకతను నిలబెట్టుకోవడం లక్ష్యంగా రేవంత్ అడుగులు, నిర్ణయాలు ఉన్నాయి.

అవధులు లేని అసమానతలు

దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆర్థిక అసమానతలు, అంతరాలు పెరుగుతున్నాయి. కార్పొరేట్ సంస్థల యజమానులు వేల కోట్ల రూపాయల ఖర్చుతో వివాహాది శుభకార్యాలు, సంబరాలు విదేశాల్లో నిర్వహిస్తున్నారు. దేశంలో ప్రతి సంవత్సరం బిలియనీర్ల, కుబేరుల సంఖ్య శరవేగంగా పెరుగుతున్నది.

మన ఆర్థిక వ్యవస్థను సంపూర్ణంగా కార్పొరేటీకరణ చేయడమే ప్రధాన లక్ష్యంగా అభివృద్ధి సాగుతున్నదనేది నిర్వివాదాంశం. కేంద్ర ప్రభుత్వం కార్మికుల వేతనాల నియంత్రణ, కుదింపు, పని గంటల పెంపునకు సహకరిస్తూ, కార్పొరేట్ సంస్థల లాభాలపై పన్ను శాతం తగ్గిస్తూ ప్రతి సంవత్సరం వారి లాభాలను పెంచుతున్నది. లాభాల వెల్లువను, పెట్టుబడులను, ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక వ్యవస్థను సంపూర్ణంగా కార్పొరేటీకరించడం జరుగుతోంది.

కేంద్ర ప్రభుత్వ సంస్థలలో 30 లక్షలకు పైగా ఉద్యోగాలు భర్తీ కాకుండా ఉన్నాయి. దేశంలో ఒక పక్క పెట్రేగుతున్న నిరుద్యోగ సమస్య, మరో పక్క నిరంతరం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను గమనిస్తే ఆర్థిక వ్యవస్థలో పరస్పర వైరుధ్యాలు కలిగిన పరిస్థితులు ఎంతగా ఉన్నాయో అర్థమవుతుంది. ఆర్థిక వృద్ధిరేటు ఆరు శాతం, ఉపాధి–ఉద్యోగిత రేటు కేవలం రెండు శాతం మాత్రమే నమోదు అవుతున్న ఆర్థిక విధానంలో, దాదాపు ఉపాధి లేని అభివృద్ధి జరుగుతున్నదని ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ ఆర్థికవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఈ తిరోగమన ఆర్థిక విధానాల పుణ్యమా అని మధ్య, దిగువ స్థాయి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మరింత దిగజారుతున్న విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పెట్రోల్, డీజిల్ పన్నులు, జీఎస్టీ పన్నుల భారం మధ్య, దిగువ తరగతి ప్రజలపై అధికంగా విధించడం వల్ల సగటు వినియోగదారుని నికర ఆదాయం కుదించుకుపోతోంది. నిత్యం పెరుగుతున్న ధరలతో అసంఘటిత, అనియత రంగంలోని ఉద్యోగుల, కార్మికుల వాస్తవ వేతనాలు రోజురోజుకూ కరిగిపోతున్నాయి.

ఎదుగుతున్న కోట్లాది విద్యావంతులైన యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించే ప్రయత్నంలో జి–20 దేశాలలో భారత్ వెనుకబడి ఉందని ఇటీవల ప్రపంచ బ్యాంకు అధికారి గోపీనాథ్ గుర్తుచేశారు. పేదలకు, ధనవంతులకు మధ్య సాపేక్ష పేదరికం మరింత పెరుగుతున్నది. డెబ్బై ఏడు సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత కూడా 80 కోట్ల మంది ప్రజలకు ఉచిత బియ్యం పంపిణీ జరుగుతున్నది. ఆర్థికాభివృద్ధి ఫలితాలు కార్పొరేట్ సంస్థలకు, పేద వర్గాలకు ఉచితాలు పంపిణీ చేసి పాలకులు చేతులు దులుపుకుంటున్నారు.

51 కోట్ల మంది ప్రజలు ఇప్పటికీ రూ.100 నుండి రూ.150 దినసరి ఆదాయంతో బతుకుతున్నారు. నివాసయోగ్యమైన గృహ సదుపాయం లేక ఆదివాసులు, గిరిజనులు, ఇతర పేదలు కోట్లాదిగా నిరాశ, నిస్పృహలకు గురి అవుతున్నారు. విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగ రంగాల ద్వారా ప్రజల సమగ్ర అభివృద్ధికి కావలసిన ఆర్థిక విధానాలు అమలు చేయాలి. దేశ సంపదలో ప్రజలందరికీ భాగస్వామ్యం లభించాలి.

18వ లోక్‌సభలో 400 సీట్లు ఇవ్వండని అడిగినా, ప్రజలు కేవలం 240 సీట్లు ఇచ్చి కేంద్ర ప్రభుత్వ దూకుడుకు కళ్లెం వేశారు. ఇకనైనా ప్రజల ఎజెండాను పాలకులు గుర్తించడం ఎంతైనా అవసరం. మెజారిటీ ప్రజలకు అవసరమైన ఆర్థిక, సామాజిక అభివృద్ధి విధానాలను రూపొందించాలి. పిడివాదపు ఆర్థిక విధానాలను విడనాడి ప్రజలకు ఉపాధి, ఉద్యోగ, ఆదాయాలను కల్పించి నిరుద్యోగిత, ద్రవ్యోల్బణం నుండి రక్షించవలసిన అవసరాన్ని గుర్తించాలి. యువతలో పెరుగుతున్న అశాంతి, అభద్రతాభావాన్ని తొలగించాలి. వెనిజులా, శ్రీలంక, బంగ్లాదేశ్ మొదలైన దేశాలలో యువతలో పెల్లుబికిన అశాంతి, జరిగిన పరిణామాలు రాజకీయ వ్యవస్థలనే సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయి. మన దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న నిరుద్యోగ సమస్య, సాపేక్ష పేదరికం, ఆర్థిక అసమానతల అంతరాలను తగ్గించడానికి తగిన ఆర్థిక, రాజకీయ, సామాజిక సంస్కరణలు ఆదాయ పంపిణీ విధానాలను ప్రవేశపెట్టి అభివృద్ధిలో అన్ని వర్గాల ప్రజలకు తగిన భాగస్వామ్యం కల్పించినప్పుడే ప్రజాస్వామ్యం అర్థవంతమవుతుందని భావించాలి.

– ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ

వీళ్లు నీతులు మాట్లాడినప్పుడు నవ్వులే నవ్వులు!



■ కె. శ్రీనివాస్

సందర్భం



నిజమో కాదో కానీ, శ్రీనాథుడికి ఆపాదించి చెబుతారీ కథ. ఒక రాజుని కలవడానికి వెళ్లినప్పుడు, అసూయ పడిన ఆస్థానపండితులు అతన్ని దెబ్బతీయాలని ఒక సమస్య ఇచ్చి పద్యంలో పూరించమన్నారట. "అందఱు నందఱే మఱియు నందఱు నందఱె యంద ఱందఱే" అన్నది సమస్య. ఆ సభికుల మీదనే పద్యం చెప్పాలి. అప్పుడా కవిగారు "కొందఱు భైరవాశ్వములు, కొందఱు పార్థుని తేరి టెక్కెముల్, కొందఱు ప్రాక్కిటీశ్వరులు, కొందఱు కాలుని యెక్కిరింతలున్, కొందఱు కృష్ణ జన్మమునం గూసిన ధన్యులు నీ సదస్సులో నందరు నందరే మరియు..." అని పద్యం చెప్పారట. దానితో చిన్నబుచ్చాలనుకున్నవారే చిన్నబోయారట. ఇంతకీ, అందరూ అందరే అయిన ఆ సభికులను ఏమని వర్ణించాడు శ్రీనాథుడు? "కొందరు కుక్కలు, కొందరు కోతులు, కొందరు పందులు, కొందరు దున్నపోతులు, కొందరు గాడిదలు, ఎవరు మాత్రం తక్కువ? అందరూ అందరే, అందరందరే.." అని పద్యం కట్టాడు. కాకపోతే, ఆ జంతుజాలం పేర్లను పచ్చిగా కాకుండా, వాటి వాటి పౌరాణిక పాత్రలను, అందమైన మాటల పొట్లంలో చుట్టి చెప్పాడు. స్తుతినింద అన్నమాట.

మంచి అయినా, చెడు అయినా, ఎక్కువా తక్కువా కాకుండా, గుంపులోని అందరికీ; ఒకే రకమైన లక్షణాలుంటే అప్పుడు "అందరూ అందరే" అంటాం. మంచితనం కలిగిన అనేకమందిని ఒకేచోట చూడగలిగే అవకాశాలు అతి తక్కువ. ప్రస్తుత రాజకీయ రంగస్థలాన్ని చూసినప్పుడు మాత్రం, అందరూ అందరే అనిపిస్తే అందుకు బాధ్యత మనది కాదు. శ్రీనాథుడిలాగా కష్టపడి, మభ్యపెట్టే అవసరం కూడా లేదు. అట్లాగని, నేరుగా పోలిస్తే, భైరవుడి గుర్రాలకు, యమధర్మరాజు వాహనాలకు మనోభావాలు దెబ్బతింటాయి.

చిట్టచివరకు పిల్లి మెడలో న్యాయరంగం గంట కట్టింది. పిల్లి ఎవరు అన్న విచికిత్స మంచిది కాదు కానీ, ఫిరాయింపుల చెలామణీకి, అధికార పార్టీలకు అందుతున్న సహకారానికి ఇప్పుడు ఇబ్బంది ఏర్పడింది. రాజ్యాంగ విహిత కర్తవ్యాలను నెరవేర్చడానికి అన్ని రాజ్యాంగ వ్యవస్థలు లోబడి ఉండాలని, సభాపతులు ఫిరాయింపుల ఫిర్యాదుల మీద నిర్ణయం తీసుకోవడానికి నిరవధికమైన గడువు ఉండకూడదని తెలంగాణ హైకోర్టు అభిప్రాయపడింది. ఈ కీలకమయిన తీర్పు ఇవ్వడానికి ముందు మునుపు సుప్రీంకోర్టు రెండు సందర్భాలలో చెప్పిన తీర్పులు నేపథ్యంగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ముగ్గురు ప్రతిపక్ష సభ్యుల ఫిరాయింపు ఈ వ్యాజ్యానికి సందర్భం.

ఈ తీర్పు చాలా కీలకమైనది. సభాపతికి ఉన్న ప్రత్యేక ప్రతిపత్తి, నియమాలలో ఉన్న కొంత అస్పష్టత కారణంగా ఫిరాయింపులకు ఏర్పడుతున్న సానుకూలతను తొలగించే న్యాయనిర్ణయం ఇది. ఫిరాయింపుల చట్టానికి ప్రాతిపదికలుగా ఉన్న రాజ్యాంగ, ప్రజాస్వామిక విలువలను బలపరచే తీర్పు ఇది. అయితే, ఒక కీలకమైన ప్రశ్న!

ఎవరికి కావాలి ఈ తీర్పు? ఫిరాయింపులకు శాశ్వతంగా నిరోధం ఏర్పడాలని ఎవరు కోరుకుంటున్నారు? ప్రజాస్వామ్యం మీద అంతటి ప్రేమ ఎవరికి వెల్లువెత్తుతున్నది?

ప్రస్తుత కేసులో అయితే కాంగ్రెస్ పార్టీయే ముద్దాయి. ఈ కేసులో నిర్ణయం ఆ పార్టీకి వ్యతిరేకంగా వచ్చిందనే భావించాలి. పిటిషన్‌దారులు బీఆర్ఎస్‌కు చెందినవారు. ఆ పార్టీ ఈ వ్యాజ్యంలో బాధితురాలు. ప్రస్తుత తీర్పు ఆ పార్టీకి విజయం. ఈ రాజకీయ జయాపజయాలు, ఇప్పటికి, ఈ సందర్భానికి మాత్రమే పరిమితం. నిన్న లేవు. రేపు ఉండవు.

తాము ఫిరాయింపులను ఆహ్వానించకుంటే, ప్రతిపక్షమే తమ నుంచి సభ్యులను లాగికొని, ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రమాదం ఉన్నదని కాంగ్రెస్ చెబుతుంది. తన ప్రభుత్వాన్ని, విధానాలను స్థిరపరచుకోవడానికి తనకు నాలుగు అదనపు సీట్లు దొరికితే బాగుంటుందని ఆ పార్టీ అనుకుంటుంది. కాంగ్రెస్ కారణాలతో తెలంగాణ సమాజానికి ఏమి నిమిత్తం? రాజ్యాంగ వ్యవస్థల దృష్టిలో ఆ కారణాలకేమి విలువ ఉంది? కాంగ్రెస్‌కు తెలంగాణ సమాజం 64 సీట్లే ఇచ్చింది. ఆ సీట్లతోనే తనకు అధికారమూ వచ్చింది. అది బొటాబొటి మెజారిటీ కదా అంటే, ప్రజలు అంతవరకే ప్రసాదించారు. బీఆర్ఎస్‌కు 38 సీట్లు ఇచ్చి ప్రతిపక్షంగా వ్యవహరించమన్నారు. ప్రతిపక్షబాధ్యత నిర్వహించవలసిన శాసన సభ్యులు అధికారపక్షానికి మారడం కానీ, అధికారపక్షం దాన్ని ప్రోత్సహించడం కానీ, ప్రజాస్వామ్యం రూల్‌బుక్‌లో లేవు. బీజేపీ తాను ఫిరాయింపులకు వ్యతిరేకమని, రాజీనామాలు చేసి రావాలని చెబుతుంది కానీ, సాంకేతికమైన నియమాలను పాటించి, సారాంశంలో పెద్ద అభ్యంతరం లేనట్టే వ్యవహరిస్తుంది. అనధికార పార్టీ సభ్యులుగా ఎందరినో చేర్చుకున్న ఉదంతాలున్నాయి.

సభాపతుల సహకారం అధికారపార్టీలకు విశ్వాసపరీక్షల వంటి కీలకసమయాల్లో మాత్రమే అవసరం ఉండేది. గత రెండు దశాబ్దాలుగా, ఫిరాయింపుల నిర్వహణలో కూడా వారి చేదోడు కావలసివస్తోంది. ఫిరాయింపు ఫిర్యాదుల మీద కానీ, ఫిరాయింపు సభ్యుడి రాజీనామా మీద నిర్ణయం తీసుకోవడానికి గానీ ఇదమిత్థమైన గడువు అంటూ ఏదీ లేకపోవడం వల్ల, సభాకాలమంతా ఫిరాయింపుదారుడు సభ్యుడిగా కొనసాగే అవకాశం ఏర్పడుతున్నది. ఆ అవకాశాన్ని వినియోగించుకోని అధికారపార్టీ లేదు. ఇప్పుడు ఈ కేసులో కోర్టుకు వెళ్లిన బీఆర్ఎస్ కూడా ఈ ఫిరాయింపు శాస్త్రంలో పిహెచ్‌డి చేసింది.

తెలంగాణ హైకోర్టు తీర్పు మీద బీఆర్ఎస్ చేస్తున్న హంగామా, విలువల ఉద్ఘాటనలు చూస్తుంటే, 'ఔరా, కలికాలము!' అనిపిస్తుంది. వేదాలు, దెయ్యాలు వంటి పోలికలన్నీ పాతపడిపోయాయి కానీ, నైతికధనార్జన గురించి అదానీ, నిరాడంబరత గురించి అంబానీ మాట్లాడినట్టు ఉంటోంది. ఫిరాయింపు సభ్యుడిని మంత్రిని చేసి, సభాకాలం ముగిసేదాకా నడిపించిన చరిత్ర కదా బీఆర్ఎస్‌ది! నిజానికి, కేసీఆర్‌ని, ఆయన పార్టీని రాజకీయ నైతికత విషయంలో తప్పుపట్టవలసింది ఇటీవలి పదవీకాలంలో చేసిన పనుల గురించి కాదు! తెలంగాణ ఉద్యమంలో నిబద్ధత లేని వృత్తిరాజకీయవాదులకు ప్రవేశం కల్పించినందుకు ఆయనను, ఆయన పార్టీని చరిత్ర బోనులో నిలబెట్టాలి! ఎంతో చిత్తశుద్ధి, త్యాగసాహసాలు అవసరమైన ఒక ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించే రాజకీయ పార్టీ తన సభ్యులను నిప్పులా నిలుపుకోవాలి! రాజశేఖర రెడ్డి ఫిరాయింపు యాగం మొదలుపెట్టగానే వంగిపోయి అమ్ముడుపోయినవారు నాటి కొందరు టీఆర్ఎస్ శాసన సభ్యులు! చేర్చుకోవడంలోనూ నీతికి ఏ మాత్రం ప్రాధాన్యం ఇవ్వనిది కేసీఆరే! ఒకవైపున నిలువునా కాల్చుకుని, ప్రాణాలు ఇచ్చిన ఉద్యమకారులు సాధించిన తెలంగాణను, ఏ అగ్నిపరీక్షలూ లేకుండా అవకాశవాదులకు అందుబాటులోకి తెచ్చారు! అమ్ముడుపోయే, కొనుక్కోగలిగే సరుకును తెలంగాణ రాజకీయ సమాజంలో ప్రోత్సహించిన వారికి, ఇప్పుడు తమ మందలో నుంచి దొంగిలిస్తున్నారని ఆక్రోశించే హక్కు ఉన్నదా?

సభాపతులు సకాలంలో నిర్ణయం తీసుకోవాలని తీర్పు చెబుతున్నది కదా? అంటే, స్పీకర్లు రాజకీయ అనుబంధాలను పక్కనబెట్టి న్యాయనిర్ణయం చేయాలన్న సూచనా ఉన్నట్టే కదా? అంటే సభాపతులు తమ వెన్నెముకలను సవరించుకోవలసిన అవసరం వచ్చింది కదా? కొత్త లోక్‌సభ సభ్యుల ప్రమాణాల సందర్భంగా, కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ స్పీకర్ ఓంబిర్లాను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలేమిటి? నరేంద్రమోదీ ప్రమాణం చేసిన తరువాత, తనను కలిసినప్పుడు ఓంబిర్లా ఆయన ఎదుట తలవంచారని కదా, రాహుల్ అన్నది? లోక్‌సభ సభాపతి ఎవరి ఎదుట అయినా నిటారుగా ఉండవలసిందేనని కదా ఆయన అభిప్రాయం? మరి తాము పాలించే రాష్ట్రాలలో స్పీకర్లు, ముఖ్యమంత్రుల ఎదుట అమిత విధేయతతో వ్యవహరించకుండా రాహుల్ కానీ, ఆయన పార్టీ కానీ ఏమైనా సూచనలు చేశారా? ఫిరాయింపులతో సహా ఏ వివాదంలో అయినా పార్టీ రహితంగా స్వతంత్రంగా వ్యవహరించాలని కాంగ్రెస్ ఒక విలువగా ప్రచారం చేసి, అమలుచేస్తోందా? ఈ ప్రశ్నలు అవసరమైనవి. వీటికి అవును అన్న సమాధానం వస్తే, ఫిరాయింపుల విషయంలో తెలంగాణ స్పీకర్ మరో రకంగా నిర్ణయం తీసుకుంటారన్న ఊహకే ఆస్కారం ఉండేది కాదు. కానీ, దురదృష్టవశాత్తూ, కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో చెబుతున్న సిద్ధాంతాలకు, విలువలకు, క్షేత్రస్థాయి దాకా పాటింపు జరగడం లేదు. జరగాలన్న పట్టింపూ ఆ పార్టీకి ఉండడం లేదు. అదేమంటే, పెద్ద ప్రత్యర్థిని ఎదుర్కొంటున్న అత్యవసర కాలంలో, "చిన్నచిన్న" విషయాలకు మినహాయింపు ఇవ్వాలి కాబట్టి!

> ఎవరికీ అక్కరలేని ఒక ప్రజాస్వామిక, రాజ్యాంగ విలువ కోసం న్యాయస్థానం చొరవ చూపింది. తక్షణ రాజకీయ ప్రయోజనం కోసం ఆ చొరవను శ్లాఘించేవారే తప్ప, దాన్ని మనసా వాచా ఇష్టపడేవారు లేరు. నువ్వు అధికారంలో ఉన్న కాలంలో ఏమిచేశావు అని ఎదురు ప్రశ్నించడమే తప్ప, కాంగ్రెస్ పార్టీ వద్ద మరో సమాధానం లేదు. పైగా, కోర్టు తీర్పులో దాగిన ఒక ప్రజాస్వామిక సూత్రం మీద కనీస గౌరవం కూడా ఆ పార్టీ చూపించలేదు. చూపించి ఉంటే, కోర్టు నిర్ణయం చెప్పిన రోజునే, పీఏసీ చైర్మన్‌గా ఒక ఫిరాయింపు శాసనసభ్యుడిని నియమిస్తుందా? పైకి, ఇది ప్రతిపక్ష పార్టీకి విసిరిన సవాల్‌గా కనిపిస్తుంది కానీ, వాస్తవంలో అది ఒకరకమైన కోర్టు ధిక్కారమే కదా?

> ఒకవైపున నిలువునా కాల్చుకుని, ప్రాణాలు ఇచ్చిన ఉద్యమకారులు సాధించిన తెలంగాణను, ఏ అగ్నిపరీక్షలూ లేకుండా అవకాశవాదులకు అందుబాటులోకి తెచ్చారు! అమ్ముడుపోయే, కొనుక్కోగలిగే సరుకును తెలంగాణ రాజకీయ సమాజంలో ప్రోత్సహించిన వారికి, ఇప్పుడు తమ మందలో నుంచి దొంగిలిస్తున్నారని ఆక్రోశించే హక్కు ఉన్నదా?

ఎవరికీ అక్కరలేని ఒక ప్రజాస్వామిక, రాజ్యాంగ విలువ కోసం న్యాయస్థానం చొరవ చూపింది. తక్షణ రాజకీయ ప్రయోజనం కోసం ఆ చొరవను శ్లాఘించేవారే తప్ప, దాన్ని మనసా వాచా ఇష్టపడేవారు లేరు. నువ్వు అధికారంలో ఉన్న కాలంలో ఏమిచేశావు అని ఎదురు ప్రశ్నించడమే తప్ప, కాంగ్రెస్ పార్టీ వద్ద మరో సమాధానం లేదు. పైగా, కోర్టు తీర్పులో దాగిన ఒక ప్రజాస్వామిక సూత్రం మీద కనీస గౌరవం కూడా ఆ పార్టీ చూపించలేదు. చూపించి ఉంటే, కోర్టు నిర్ణయం చెప్పిన రోజునే, పీఏసీ చైర్మన్‌గా ఒక ఫిరాయింపు శాసన సభ్యుడిని నియమిస్తుందా? పైకి, ఇది ప్రతిపక్ష పార్టీకి విసిరిన సవాల్‌గా కనిపిస్తుంది కానీ, వాస్తవంలో అది ఒకరకమైన కోర్టు ధిక్కారమే కదా? ఫిరాయింపు ఎమ్మెల్యేకు తన పార్టీ ఎంపీ టికెట్ ఇచ్చి నిలబెట్టినప్పుడు చూపిన బోరవిరుపునే కాంగ్రెస్ ఇప్పుడూ చూపింది!

వాళ్లూ కాని, వీళ్లూ కాని తెలంగాణ పౌరసమాజం అంటూ ఒకటి ఉంటే, అది ఫిరాయింపుల మీద మాట్లాడాలి. ప్రజలు మాట్లాడితే, నిజానికి, ఏ కోర్టూ నిర్దేశించనక్కరలేదు, రాజకీయంగా నష్టంజరిగే అవకాశం ఉంటే, ఏ పార్టీ కూడా ప్రజాకాంక్షను అతిక్రమించదు. బాధాకరమేమిటంటే, ప్రజలు కూడా అత్యధికులు రాజకీయ పాక్షికులుగా మారిపోయారు. విలువల ఆధారంగా కాక, ఇతర ప్రాతిపదికల మీద రాజకీయపార్టీల వెనుక సమీకృతులవుతున్నారు. వెధవాయను నేను నీకంటె పెద్ద వెధవాయను నేను, అంటూ నాయకులు పోటీపడి అల్పత్వాన్ని ప్రకటించుకుంటుంటే, చప్పట్లు కొడుతూ వినోదం చూస్తున్నారు. మంచీచెడూ తెలిసినవారు, ఏ గొంగట్లో తింటే ఏమిటి అంటూ నిర్లిప్తంగా ఉంటున్నారు.

కూలిన ఒంటినిట్టాడి గుడిసె

"నాకు సాహిత్యమంటే పిచ్చి/ అప్పుడప్పుడూ రాస్తుంటాను/ కనపడ్డ పుస్తకాల్ని కొంటూ వుంటాను/ చిన్న గ్రంథాలయం నా ఇంట్లో/ పుస్తకాలు నా మరోప్రపంచం"... నా ఇష్టాలు అనే కవితలో ఈ మాటలు రాసుకున్నది సెప్టెంబర్ మూడున హైదరాబాద్‌లో తీవ్ర అనారోగ్యంతో కన్నుమూసిన కొప్పోలు మోహనరావు. ప్రకాశం జిల్లా కందుకూరు సమీపగ్రామం అయిన చౌటపాలెంలో 22 సెప్టెంబరు 1955లో మోహనరావు జన్మించారు. తల్లిదండ్రులు కొప్పోలు వెంకట సుబ్బమ్మ, మాలకొండయ్య. విద్యార్థిగా చిన్న చిన్న ప్రేమ కవితలు రాసుకున్న మోహనరావు, డిగ్రీ చదువుల కోసం కావలి జవహర్ భారతి కొచ్చాక సాహిత్యం పట్ల మరింత మక్కువ పెంచుకున్నారు. వారం వారం బొటానికల్ గార్డెన్‌లో జరిగే 'తెలుగు సాహితి' కార్యక్రమాల్లో ఆసక్తిగా పాల్గొనేవాడు. ప్రతీ ఏడాది కాలేజీ మేగజైన్‌లో కవితలు అచ్చయ్యేవి. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, భుజంగరాయశర్మ, కెవియార్, మధునాపంతుల వంటి ఉద్దండ పండితులు పనిచేసే కాలేజీ జవహర్ భారతి.



శ్రీశ్రీ, కెవియార్, శివసాగర్, చెరబండరాజుల ప్రభావంతో తొలి రోజుల్లో వామపక్ష భావాలతో కవితలు రాసినప్పటికీ, తర్వాతి కాలంలో అంబేద్కరిజం వైపు మళ్లాడు. డిగ్రీ తర్వాత ఎం.కాం. చదువుతుండగానే కెనరా బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. దాంతో దేశాలు పట్టి తిరగడంతో కవిత్వ సృజన వెనకపట్టింది. అయితే ఎక్కడున్నా డైరీలో కవితలు రాయడం మానలేదు. 1996లో హైదరాబాద్‌కు బదిలీ అయి వచ్చాక మోహనరావులోని నివురుకప్పిన కవిత్వపు నిప్పు జ్వలించడం మొదలుపెట్టింది. 2005 మే 12–15 తేదీలలో కవిసంధ్య దళిత రచయితల వేదిక సంయుక్తంగా నిర్వహించిన దళిత రచయితల శిక్షణా శిబిరంలో కీలకపాత్ర పోషించడమే కాక కో–కన్వీనర్‌గా వ్యవహరించారు. దానితో ఎన్నాళ్ళనుంచో అణగారి వున్న కవిత్వ స్పృహ, దళిత చైతన్యం ఒక్కసారిగా విజృంభించింది. దాని ఫలితమే 2020లో మోహనరావు వెలువరించిన 'ఒంటినిట్టాడి గుడిసె' దళిత కవితా సంకలనం. దీనికి కొలకలూరి భగీరథి కవిత్వ పురస్కారం 2021లోనూ, కవిసంధ్య ప్రతిభా పురస్కారం 2020లోనూ లభించింది. ఆంధ్రప్రభ, నేటినిజం, సాహితీ స్రవంతి, బహుజన కెరటాలు, కవిసంధ్య వంటి పత్రికల్లో మోహనరావు రచనలు అచ్చయ్యాయి. "నా కవితలు నా భావావేశం నుండి పుట్టుకొచ్చినవి. సామాజికంగా జరిగే అన్యాయాలను ప్రశ్నిస్తూ, స్పందిస్తూ, రాసాను" అని మోహనరావే చెప్పుకున్నారు.

అంబేద్కరిస్టుగా 'బోధివృక్షం, దళితుడి వాంగ్మూలం' వంటి కవితలు రాసిన మోహనరావు, వరవరరావుని ఉపా చట్టం కింద అక్రమ అరెస్టు చేసినప్పుడు "కవిని కష్టపెట్టకండ్రా! కాస్త స్వేచ్ఛనివ్వండి/ రేపటి ఉషోదయాన్ని తాను/ భూపాల రాగమై మేల్కొలుపుతాడు' అని రాసాడు. ఒక్క సంపుటే వెలువరించినా మోహనరావు దళిత కవిత్వంలో సాధించింది తన స్థానీయతను నమోదుచేయడం, అతడి యాసను కవిత్వం చేయడం. కవిత్వ రచనలో గొప్ప మూలమలుపులో వున్నప్పుడు మోహనరావు నిష్క్రమించడంతో ఒంటి నిట్టాడి గుడిసె నిలువునా కూలిపోయినట్టయింది. ఖాజా అన్నట్టు "ఎండాకాలపు వొడుస్తున్న కొత్త నీటికుండ" మోహనరావు కవిత్వం! మోహనరావుకు దళిత రచయితల వేదిక అశ్రునివాళి!

– డా. శిఖామణి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా

ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్,
హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

తెలుగువారి తరఫున వకాల్తా పుచ్చుకునే అర్హత ఉందా?

> "తెలుగు అంటే ఒక భాష కాదు. ఒక చరిత్ర.. ఒక సంప్రదాయం.. ఒక సంస్కృతి" అని రాహుల్ గాంధీ డల్లాస్‌లో అన్నారు. రాహుల్‌కు తెలుగు భాష గురించి కానీ, చరిత్ర గురించి కానీ, సంస్కృతి గురించి కానీ ఓనమాలు కూడా తెలిసే అవకాశాలు లేవు. తెలిసి ఉంటే తెలుగు భాషకు దేశంలో గౌరవం తీసుకువచ్చిన నందమూరి తారకరామారావు తెలుగువాడి ఆత్మగౌరవాన్ని ఢిల్లీ వీధుల్లో పణంగా పెట్టిన కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారన్న విషయం అర్థమయి ఉండేది.



కొందరు నేతలు కేవలం ఇతరులను దూషించడం, సంచలనాత్మక వ్యాఖ్యలు చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించాలనుకుంటారు. వారికి వేరే నిర్మాణాత్మకమైన పనులు ఏమీ ఉండవు. అలాంటి రాజకీయ నిరుద్యోగుల్లో రాహుల్‌గాంధీ ఒకరని చెప్పక తప్పదు.

రాహుల్‌గాంధీ 2004లో రాజకీయాల్లోకి ప్రవేశించారు. అమేథీ నుంచి తొలిసారి లోక్‌సభకు ఎన్నికై లోక్‌సభలో వచ్చీరాని మాటలతో మాట్లాడాలని ప్రయత్నించి హాస్యాస్పదం అయ్యారు. సోనియాగాంధీ ఆయనకు ఏదైనా ఒక పని అప్పజెప్పాలని భావించి 2007లో ఎన్ఎస్‌యుఐతో పాటు యువజన కాంగ్రెస్, ఇతర అనుబంధ సంస్థల బాధ్యతలను అప్పగించారు. విషాదం ఏమంటే ఈ అనుబంధ సంస్థల్లో పెద్ద ఎత్తున మార్పులు తీసుకురావాలని, సంస్థాగత ఎన్నికలు జరిపించాలని సంకల్పించి ఆయన విఫలమయ్యారు. 2008లో ఆయన లోక్‌సభలో తొలిసారి ప్రసంగిస్తూ బుందేల్‌ఖండ్‌లో కళావతి అనే పేద మహిళ గురించి మాట్లాడుతూ దేశంలో పేదరికాన్ని ప్రస్తావించారు. కళావతి జీవితం ఏమీ బాగుపడలేదు సరికదా రాహుల్ రాజకీయ జీవితమూ ఎదుగూ బొదుగూ లేకుండా పోయింది. ఆయనను ఆ తర్వాత కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా నియమించారు. 2013లో ఆయన ఢిల్లీ ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో తన ప్రభుత్వం ఆమోదించిన ఒక ఆర్డినెన్స్‌నే చించేసి వివాదాస్పదం అయ్యారు. 2014లో ఘోర పరాజయం చెందడంతో ప్రధాని కావాలన్న రాహుల్ ఆశలు అడియాసలయ్యాయి. లోక్‌సభలో కన్నుగీటడం, వెకిలిగా నవ్వడం, వేగంగా నడుచుకుంటూ వచ్చి ప్రధానిని కౌగలించుకోవడం వంటి పనులు చేసి నవ్వుల పాలయ్యారు.

2019లో బీజేపీ రెండోసారి విజయం సాధించగా, ఆయన స్వంత నియోజకవర్గంలోనే ఓడిపోయారు. 2024లో బీజేపీ మళ్లీ అధికారంలోకి రావడంతో ఆయన లోక్‌సభలో ప్రతిపక్ష హోదాతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 543 సీట్లలో కేవలం 99 సీట్లు గెలిచిన రాహుల్ తానేదో పెద్ద విజయం సాధించినట్లు, మోదీ నేతృత్వంలో బీజేపీ చిత్తుగా ఓడిపోయినట్లు మాట్లాడడం మొదలుపెట్టారు. తాను భారత్ జోడో యాత్ర పేరుతో తిరిగిన పలురాష్ట్రాల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం చెందిన విషయాన్ని కూడా ఆయన మరిచిపోయారు.

అబద్ధాలు మాట్లాడడం, దూషించడం వల్ల తనపై కేసులు మోపే అవకాశం ఉన్నదని రాహుల్‌కు తెలుసు. అయినా అలా అయినా వార్తల్లో రావడం ఆయన ధ్యేయం. నేషనల్ హెరాల్డ్ కేసులో బెయిల్‌పై ఉన్న రాహుల్‌గాంధీ ఒకసారి మహాత్మా గాంధీని ఆరెస్సెస్ హత్య చేసిందని విమర్శించి పరువు నష్టం దావా ఎదుర్కొన్నారు. దీనిపై ఆయనను సుప్రీంకోర్టు తీవ్రంగా మందలించాల్సి వచ్చింది. బెంగళూరులో గౌరీలంకేష్ హత్య విషయంలోనూ లేనిపోని ఆరోపణలు చేసినందుకు, మోదీ పేరు గలవారందరూ దొంగలే అన్నందుకు, ఒక బ్యాంకు నోట్ల మార్పిడి చేస్తోందని విమర్శించినందుకు కూడా ఆయన కేసులు ఎదుర్కోవాల్సి వచ్చింది. చివరకు ఒక కేసులో ఆయనకు రెండు సంవత్సరాల జైలు శిక్ష కూడా విధించింది. అయినప్పటికీ రాహుల్ తన వైఖరి మార్చుకోలేదు.

ఇప్పుడు అమెరికా వెళ్ళి భారతదేశంపై, మోదీ, బీజేపీ, ఆరెస్సెస్‌లపై ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యలు చేశారు. "తెలుగు అంటే ఒక భాష కాదు. ఒక చరిత్ర.. ఒక సంప్రదాయం.. ఒక సంస్కృతి" అని ఆయన డల్లాస్‌లో అన్నారు. భారత జాతీయ గీతం అన్ని రాష్ట్రాలను ప్రతిబింబిస్తుందని, కానీ బీజేపీ మాత్రం రాష్ట్రాల పట్ల వివక్ష చూపుతుందని, తెలుగు భాషను విస్మరిస్తోందని రాహుల్ చెప్పారు. రాహుల్‌కు తెలుగు భాష గురించి కానీ, చరిత్ర గురించి కానీ, సంస్కృతి గురించి కానీ ఓనమాలు కూడా తెలిసే అవకాశాలు లేవు. తెలిసి ఉంటే తెలుగు భాషకు దేశంలో గౌరవం తీసుకువచ్చిన నందమూరి తారకరామారావు తెలుగువాడి ఆత్మగౌరవాన్ని ఢిల్లీ వీధుల్లో పణంగా పెట్టిన కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారన్న విషయం అర్థమయి ఉండేది. కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ప్రతి రోజూ ఢిల్లీలో క్యూలు కట్టి కాంగ్రెస్ అగ్రనేతల దర్శనానికి రోజుల తరబడి వేచి ఉండే సంస్కృతిని ఆ పార్టీ ప్రవేశపెట్టిందని, ఒక వెనుకబడిన వర్గాల ముఖ్యమంత్రిని విమానాశ్రయంలోనే అవమానించారని ఆయన తెలుసుకోవాలి.

తెలుగు ప్రజల మనోభావాలు గాయపడ్డందుకే ప్రజలు ఎన్టీఆర్‌కు, తెలుగుదేశానికి పట్టం కట్టారని, అదే ఎన్టీఆర్‌ను కుట్రపూరితంగా గద్దె దించేందుకు తన నాయనమ్మ రాంలాల్ అనే గవర్నర్‌ను ప్రయోగించారని ఆయనకు తెలిసి ఉండదు. ఎన్టీఆర్‌ను తిరిగి అధికారంలోకి తీసుకువచ్చేందుకు జరిగిన ప్రజాస్వామ్య పరిరక్షణోద్యమంలో అటల్ బిహారీ వాజపేయి, లాల్‌కృష్ణ అద్వాణీ వంటి బీజేపీ హేమాహేమీలు రంగంలోకి దిగారని, నేషనల్ ఫ్రంట్ స్థాపించి కాంగ్రెస్‌కు ముచ్చెమటలు పట్టించారని రాహుల్‌కు ఎవరూ చెప్పి ఉండకపోవచ్చు. తెలుగు వారికి తీరని అన్యాయం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదే అని తెలియని రాహుల్ ఇవాళ తెలుగు భాష, చరిత్ర, సంస్కృతుల గురించి మాట్లాడడం అమాయకత్వమే కాదు, అజ్ఞానం కూడా.

పోనీ దక్షిణాది పట్ల అయినా కాంగ్రెస్‌కు ఏమైనా మమకారం ఉన్నదా? ఎన్నో దశాబ్దాల క్రితమే దక్షిణాదిలో ప్రజలు కాంగ్రెస్ పార్టీని తిరస్కరించారు. కేరళలో 1957లోనే కాంగ్రెస్ ఓటమి ఎదుర్కొంటే ఆ తర్వాత పదేళ్లకు తమిళనాడు ప్రజలు కాంగ్రెస్‌ను పూర్తిగా తరిమికొట్టారు. 83లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటకలో కూడా తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పడింది. కేరళలో 1959లో ఈఎంఎస్ నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని, కర్ణాటకలో 1989లో బొమ్మయి ప్రభుత్వాన్ని, తమిళనాడులో 1976లో కరుణానిధి ప్రభుత్వాన్ని, 1980లో ఎంజీఆర్ ప్రభుత్వాన్ని, 1984లో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని రద్దు చేసింది కాంగ్రెస్ నాయకత్వమే కాదా? ప్రజలు ప్రజాస్వామికంగా ఎన్నుకున్న ప్రభుత్వాలను రద్దు చేయడం ద్వారా వారి మనోభావాలను గాయపరిచినట్లు అప్పుడు కాంగ్రెస్ నాయకత్వానికి తెలియదా? దక్షిణాది పట్ల కాంగ్రెస్‌కు ఏ మాత్రం ప్రేమ లేదని ప్రజలందరికీ తెలుసు. 2019లో కేరళలోని వాయనాడు నుంచి గెలిచిన రాహుల్‌గాంధీ 2024లో రాయబరేలీలో విజయం సాధించగానే వాయనాడును వదులుకున్నారు. ఓటమి ఎదురైనప్పుడే కాంగ్రెస్ ఢిల్లీ నేతలకు దక్షిణాది గుర్తుకు వస్తుంది.

అమెరికాలో రాహుల్ భారతదేశాన్ని అవమానించే విధంగా చేసిన వ్యాఖ్యలు గర్హనీయమైనవి. భారతదేశం తన ఉత్పాదక రంగాన్ని చైనాకు అప్పగించి నిరుద్యోగాన్ని పెంచిందని ఆయన ప్రకటించారు. ఇవాళ మన జీడీపీలో 17 శాతం ఉత్పాదక రంగానిదే వాటా. ప్రధానమంత్రి మోదీ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే మేక్ఇన్ ఇండియా కార్యక్రమాన్ని చేపట్టారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి భారత ఉత్పాదక రంగం ట్రిలియన్ డాలర్లకు చేరుకోనున్నది. భారత్‌లో కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా చైనాలో రికార్డు స్థాయిలో దాదాపు 17శాతం నిరుద్యోగం ఉన్నదన్న విషయం రాహుల్‌కు తెలియకపోవడం విషాదకరం. మోదీ పట్ల వ్యతిరేకతతో రాహుల్ కమ్యూనిస్టుల కంటే ఎక్కువగా చైనా భక్తుడు అయినట్లున్నారు.

అన్ని ప్రాంతాల సంస్కృతులను, సంప్రదాయాలను బీజేపీ గౌరవించదని రాహుల్‌కు ఎవరు చెప్పారు? ఈ బహుళత్వాన్నే భారతీయతగా బీజేపీ భావిస్తుందని ఆయనకు తెలియదు. బీజేపీ భిన్నత్వంలో ఏకత్వాన్ని చూస్తుంది కాని ఏ ఒక్క సంస్కృతినీ ఇతరులపై రుద్దదు. మన భారతదేశంలో శ్రీరాముడి మందిరం అడుగడుగునా కనపడుతుంది. మహాభారతం గురించి ప్రతి ఇంటిలో కథలు కథలుగా చెప్పుకుంటారు. మన పౌరాణిక పురుషులు, స్త్రీల గాథలు అందరికీ తెలుసు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా అడుగడుగునా మన భారతీయత ఉట్టిపడుతూ ఉంటుంది. ఈ దేశాన్ని విభజించి పాలించాలన్న దృక్పథం కాంగ్రెస్‌ది మాత్రమే. అందుకే కులాలను, మతాలను, ప్రాంతాలను, భాషలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తోంది.



■ వై.సత్యకుమార్
రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ వైద్య విద్యామంత్రి



పాఠ్య పుస్తకాలు.. వరదపాలు.. : కబేళాలోని ఓ గోడౌన్‌లో..



వదలదు.. కదలదు.. : పాయకాపురంలో ఇంట్లోని నీటిని తోడుతున్న మహిళ



జీవితాలు : కండ్రిక వీధుల్లో ఇంకా తొలగని మురుగునీరు



సర్వం.. నాశనం..



రోడ్డుపైనే జీవనం..



దారులన్నీ దారుణం

కన్నీటితీరంలో..

- ఇంకా కోలుకోని వరద ప్రభావిత ప్రాంతాలు
- కీలక ప్రాంతాల్లోని వీధులను వదలని వరద నీరు

కంపు కొడుతున్న కాలనీలు.. రొచ్చుగా మారిన రహదారులు.. బురదతో నిండిపోయిన భవనాలు.. వరద మిగిల్చిన నష్టాన్ని చూస్తే కన్నీరొస్తుండగా, గుక్కెడు నీళ్ల కోసం, ఓ పూట భోజనం కోసం బాధితులు పడే కష్టాన్ని చూస్తే గుండె తరుక్కుపోతోంది. వరద ముంపు నుంచి ఒక్కొక్కటిగా కాలనీలు బయటపడుతున్నా.. ఆ బాధలు మాత్రం ఇప్పట్లో తీరేలా కనిపించట్లేదు. పూర్తిగా నాశనమైపోయిన ఇళ్లతో పాటు మొరాయించిన వాహనాలు, పనికిరాకుండా పోయిన ఇంటి సామాన్లను చూస్తూ కట్టుబట్టలతో రోడ్డుపై విలపిస్తున్న దృశ్యాలు ప్రతి ఒక్కరినీ కదిలిస్తున్నాయి. కలవరానికి గురి చేస్తున్నాయి. నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాలైన అజిత్‌సింగ్‌నగర్, వాంబేకాలనీ, కండ్రిక, కబేళా, విద్యాధరపురం, కేఎల్‌రావు నగర్ ప్రాంతాల్లో బుధవారం కూడా హృదయ విదారక దృశ్యాలు కంటతడి పెట్టించాయి.



మొరాయించగా..

- నల్లగా మారిన మురుగునీటితో అష్టకష్టాలు
- మోటార్లు పెట్టి తోడుతున్నా తొలగని అవస్థలు
- కట్టుబట్టలతో రోడ్డుపైనే ఉంటున్న బాధితులు
- కదిలిస్తే చాలు.. అన్నీ కన్నీటి కథలే..



ముం'చెత్తగా..'



కన్నీటిపర్యంతం : వాంబేకాలనీలో కట్టుబట్టలతో రోడ్డుపాలు



చెర వీడదు : రామరాజ్యనగర్‌లో ఇంకా తొలగని వరద నీరు

ఎన్యూమరేషన్ 90.57 శాతం పూర్తి

నేడే తుది గడువు

- నగరంలో 32 డివిజన్ల పరిధిలో 1,52,314 ఇళ్లకు సర్వే
- ఇంకా 99,375 ఇళ్లకు పెండింగ్
- విజయవాడ రూరల్ మండలంలో ఆలస్యం
- మోకాలు లోతు నీరు ఉండటం వల్లే..
- రెండు, మూడు రోజులు గడువు పెంచే అవకాశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వరద నష్టం అంచనాకు సంబంధించి నగరంలో చేపట్టిన ఎన్యూమరేషన్ 90.57 శాతం పూర్తయ్యింది. అయితే, విజయవాడ రూరల్ మండల పరిధిలో మాత్రం ఇంకా వరద నీరు ఉండటం వల్ల కేవలం 26.44 శాతం మాత్రమే జరిగింది. గురువారం నాటికి ఎన్యూమరేషన్ ప్రక్రియకు తుది గడువు కాగా, కొత్త గుర్తింపులు, సర్వేల వల్ల కొంత ఆలస్యమైంది. గురువారంతో గడువు ముగుస్తున్నప్పటికీ, పూర్తి చేయటానికి ఇంకో రెండు రోజులు పట్టే అవకాశముంది. నగరంలోని 32 డివిజన్లు, 286 సచివాలయాల పరిధిలో ఎన్యూమరేషన్ ప్రక్రియను ప్రారంభించారు. 1,478 మంది రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక ఫ్లడ్ ఎన్యూమరేషన్ మొబైల్ యాప్‌లో ఇంటింటి సర్వే వివరాలను నమోదు చేశారు. విజయవాడలో మొత్తం 1,68,176 మంది ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహించాల్సి ఉండగా, బుధవారం సాయంత్రం నాటికి 1,52,314 ఇళ్లను పూర్తిచేశారు. మరో 99,375 కొత్త ఎన్యూమరేషన్లు కూడా నమోదు చేశారు. ఇక బుధవారం సాయంత్రానికి నగరంలో 2,524 వాణిజ్య సముదాయాల ఎన్యూమరేషన్లు జరిగాయి. నగరంలో డివిజన్ నెంబర్ 1, 5, 7, 15, 16, 17, 18, 19, 20, 21, 22, 30, 32, 40, 41, 42, 43, 44, 45, 46, 47, 54, 55, 56, 57, 58, 59, 60, 61, 62, 63, 64లో ఏకకాలంలో ఎన్యూమరేషన్ నిర్వహిస్తున్నారు. వీటిలో నూరుశాతం పూర్తి చేసుకున్న వాటిలో 1, 5, 18, 20, 21, 22, 32, 40 డివిజన్లు ఉన్నాయి. ఇంటికి జరిగిన నష్టం, వ్యక్తిగత నష్టం, ప్రాణనష్టం, అవయవాల నష్టం, ధన నష్టం, వాహన నష్టం, ఇంటి వస్తువుల నష్టం ఇలా అన్నింటినీ అంచనా వేస్తున్నారు.

రూరల్ మండలంలో 26.44 శాతమే..

విజయవాడ రూరల్ మండలంలో మాత్రం ఆశించిన విధంగా ఎన్యూమరేషన్ జరగలేదు. ఇక్కడ ఇంకా నడుములోతు నీరు ఉండటం వల్ల ఈ ప్రక్రియకు ఆటంకం కలుగుతోంది. వరద నీరు పూర్తిగా తగ్గితే తప్ప ఇది సాధ్యం కాని పనిగా ఉంది. గురువారంతో ఎన్యూమరేషన్‌కు తుది గడువైనా రూరల్ మండలాన్ని దృష్టిలో ఉంచుకుని రెండు, మూడు రోజులు గడువు పెంచే అవకాశం ఉంది. ఈ మండలంలో మొత్తం 32 గ్రామ సచివాలయాల పరిధిలో 119 మంది ఎన్యూమరేటర్లు సర్వే చేపడుతున్నారు. 19,780 ఇళ్లను సర్వే చేయాల్సి ఉండగా, బుధవారం సాయంత్రం నాటికి 5,423 పూర్తయ్యాయి. మరో 5,332 ఇళ్ల ఎన్యూమరేషన్ చేపట్టారు. వాణిజ్య సంబంధ ఎన్యూమరేషన్ తొమ్మిది మాత్రమే జరిగాయి.

దరఖాస్తుల వరద

- మూడు రోజుల్లో 5,151 దరఖాస్తులు
- ఇన్సూరెన్స్ ఫెసిలిటేషన్ సెంటర్‌కు క్యూ

407 క్లెయింలు పరిష్కరించి రూ.3.36 కోట్లు చెల్లింపు

మిగిలిన క్లెయింలూ 10 రోజుల్లో పరిష్కారం



సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇన్సూరెన్స్ క్లెయిం ఫెసిలిటేషన్ సెంటర్

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలుస్తోంది. నష్టపోయిన లేదా దెబ్బతిన్న వాహనాలు, నివాసాలు, దుకాణాలు, చిన్న మధ్యతరహా వ్యాపార సముదాయాలకు సంబంధించిన బీమా క్లెయింలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తున్నారు. ఇందుకోసం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఇన్సూరెన్స్ క్లెయిం ఫెసిలిటేషన్ సెంటర్ నిరంతరం శ్రమిస్తోంది. తక్షణమే క్లెయిం నమోదు చేసుకునేందుకు వాట్సాప్, టోల్‌ఫ్రీ నెంబరు, ఈ-మెయిల్, వెబ్‌సైట్ లేదా ఇతర మార్గాల ద్వారా అవకాశం కల్పించింది. ఈనెల 9న ప్రారంభమైన ఈ సెంటర్‌కు భారీ స్పందన వస్తోంది. ఇప్పటి వరకు 5,151 క్లెయింలు నమోదు కాగా, వాటి విలువ రూ.182.76 కోట్లు. మూడు రోజుల్లో 407 క్లెయింలను పరిష్కరించి రూ.3.36 కోట్లను చెల్లించారు. ఇంకా 4,744 క్లెయింలను పరిష్కరించాల్సి ఉంది. వీటి విలువ రూ.179.40 కోట్లు. వచ్చిన క్లెయింల్లో మోటారు వాహనాలకు సంబంధించినవే 4,452 ఉన్నాయి. వీటి విలువ రూ.45.83 కోట్లు. వీటిలో 323 క్లెయింలను పరిష్కరించి రూ.94 లక్షలు చెల్లించారు. మోటారు వాహనాలకు సంబంధించినవి కాకుండా గృహోపకరణాలు, ఇంటి బీమాకు సంబంధించినవి 699 ఉన్నాయి. వీటి విలువ రూ.136.93 కోట్లు. వీటిలో 84 క్లెయింలు పరిష్కరించి రూ.2.42 కోట్లు చెల్లించారు.

అనుసంధానకర్తగా ఏపీ జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్

ఈనెల 9వ తేదీన ఏపీ జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇన్సూరెన్స్ క్లెయిం ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. 22 ఇన్సూరెన్స్ కంపెనీలను ఒక వేదికపైకి తీసుకొచ్చారు. 15 కౌంటర్లలో సేవలందిస్తున్నారు. అన్నీ సక్రమంగా ఉండి బీమాదారు అంగీకరిస్తే అక్కడికక్కడే క్లెయింలు పరిష్కరిస్తున్నారు. సరైన పత్రాలు, ఫొటోలు లేకపోయినా క్షేత్రస్థాయిలో పరిశీలించి క్లెయింలను పరిష్కరించేందుకు కాస్త సమయం తీసుకుంటున్నారు.

10 రోజుల్లో క్లెయింల పరిష్కారమే లక్ష్యం

వరద బాధితులకు ఇన్సూరెన్స్ క్లెయింల పరిష్కారంలో ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఈ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. 10 రోజుల్లో క్లెయింలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలన్న ఉద్దేశంతో ఇన్సూరెన్స్ కంపెనీలు కూడా ఉదారంగా వ్యవహరిస్తున్నాయి. ఈ సెంటర్ ఏర్పాటుచేసి మూడు రోజులవుతోంది. తొలిరోజు స్పందన లేదు. రెండు రోజులుగా మంచి స్పందన వస్తోంది. ఇప్పటి వరకు 5వేల పైచిలుకు పేర్లు నమోదు చేసుకున్నారు. ఒరిజినల్ పత్రాలు పోయినా జిరాక్స్‌తోనైనా క్లెయిం చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు.

- ఎస్.సుజీత్, చీఫ్ రిస్క్ ఆఫీసర్, ఏపీ జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్

నేడు జిల్లాలో కేంద్రబృందం పర్యటన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వరద ప్రభావిత ప్రాంతాల్లో నష్టాన్ని అంచనా వేసేందుకు గురువారం కేంద్రబృందం జిల్లాలో పర్యటించనుంది. కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి అనిల్ సుబ్రహ్మణ్యం నేతృత్వంలోని బృందం ఈ పర్యటనలో పాల్గొంటుంది. ప్రకాశం బ్యారేజీకి జరిగిన నష్టం, బుడమేరు డైవర్షన్ చానల్‌కు పడిన గండ్లు, వాటిని పూడ్చటానికి తీసుకున్న చర్యలతో పాటు ఇబ్రహీంపట్నం, రాయనపాడు ప్రాంతాల్లో వ్యవసాయానికి జరిగిన నష్టాన్ని పరిశీలిస్తుంది. ఆ తర్వాత జక్కంపూడి, సింగ్‌నగర్ ప్రాంతాల్లో పర్యటిస్తుంది. జిల్లావ్యాప్తంగా జరిగిన నష్టంపై కలెక్టర్ కార్యాలయంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్రబృందానికి కలెక్టర్ సృజన వివరిస్తారు.

సబ్‌కా మాలిక్ ఏక్ హై



వీరంతా ముస్లిం యువకులు. న్యూ రాజరాజేశ్వరిపేట అమరావతి కాలనీలోని వినాయకుడి ఆలయాన్ని ఇలా శుభ్రం చేశారు. బుడమేరు వరద తగ్గడంతో కులమతాలకు అతీతంగా జనం సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఫారూక్ షుబ్లీ ఆధ్వర్యంలో ముస్లిం యువకులు స్వచ్ఛందంగా ఈ ప్రాంతంలో పరిశుభ్రత పనులు నిర్వహిస్తున్నారు. ఇళ్లు, ఆలయాలు, మసీదులు, చర్చిల్లో పేరుకుపోయిన బురదను గంటలపాటు శ్రమించి కడిగేశారు. వీరిని స్థానికులు అభినందించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ



నిమజ్జనోత్సవం

వినాయక నిమజ్జనోత్సవాల సందడితో ప్రకాశం బ్యారేజీ వద్ద పండుగ వాతావరణం కనిపిస్తోంది. ఓవక్క, బ్యారేజీ గేట్లను ఢీకొన్న బోట్ల తొలగింపు పనులు జరుగుతున్నా.. మరోపక్క, కృష్ణానదికి వరద భారీగా చేరుతున్నా.. అధికారులు పకడ్బందీ ఏర్పాట్ల నడుమ శనైశ్చరస్వామి ఆలయం వద్ద పెద్ద క్రేన్ల సాయంతో విగ్రహాలను నదిలో నిమజ్జనం చేస్తున్నారు.



బుడమేరు ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని

స్వచ్ఛందంగా..

- రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన సంస్థలు
- ప్రజాప్రతినిధులూ వరద బాధితుల సేవలోనే
- 10 రోజుల్లో 1.14 కోట్ల ఆహార ప్యాకెట్ల పంపిణీ
- 1.12 కోట్ల వాటర్ బ్యాటిళ్ల సరఫరా

బెజవాడను ముంచెత్తిన బుడమేరు వరద బాధితులను ఆదుకునేందుకు ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు తరలివచ్చారు. మేమున్నామంటూ బాధితులకు అండగా నిలిచారు. కలెక్టరేట్ కేంద్రంగా 10 రోజులు నిర్విరామంగా సహాయ, పునరావాస కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో జిల్లా ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఎందరో తరలివచ్చి భాగస్వాములయ్యారు.



కార్గిల్ ఇండియా ప్రతినిధుల సాయం..



లిటిల్ హ్యాండ్ ఆధ్వర్యంలో..



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న యార్లగడ్డ

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన విజయవాడను సాధారణస్థితికి తీసుకొచ్చేందుకు సీఎం చంద్రబాబు తొలిరోజే రంగంలోకి దిగారు. కలెక్టరేట్‌ను సీఎం కార్యాలయంగా మార్చుకుని 24/7 వరద బాధితులకు అండగా నిలిచేందుకు అన్ని చర్యలూ తీసుకున్నారు. నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ బాధితుల కష్టాలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించారు. మంత్రులు నారాయణ, కొల్లు రవీంద్ర, పార్థసారథి తదితరులు సైతం క్షేత్రస్థాయిలో ఉంటూ వీలైనంత త్వరగా బాధితులు కోలుకునేందుకు కృషి చేశారు.

ప్రజాప్రతినిధుల సేవలు ప్రశంసనీయం..

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ 10 రోజులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ బాధితులకు అండగా నిలిచారు. కేశినేని ఫౌండేషన్ ద్వారా కూడా ఆహారం, తాగునీరు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా కల్పించారు. పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి తరఫున పశ్చిమ టీడీపీ నేతలు ఎంకేబేగ్ తదితరులు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు రామలింగేశ్వరనగర్, కృష్ణలంక ప్రాంతాల్లో వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు త్వరగా కోలుకునేందుకు అండగా నిలిచారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆహార పంపిణీలో కీలకపాత్ర పోషించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో బాధితులకు ఆహారం తయారుచేయించడం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఆహారాన్ని ప్యాకింగ్ చేయించడం, తాగునీరు ఏయే ప్రాంతాలకు పంపాలన్న అంశాలన్నీ యార్లగడ్డ పర్యవేక్షణలో జరిగాయి. 10 రోజుల్లో 1.14 కోట్ల ఆహార ప్యాకెట్లు పంపిణీ చేయడంతోపాటు 1.12 కోట్ల వాటర్ బ్యాటిల్స్‌ను బాధితులకు చేరేలా చూడటంలో వెంకట్రావు పాత్ర కీలకం. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ తన నియోజకవర్గంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు అండగా నిలిచారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మంగళవారం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం శాంతినగర్‌లో పర్యటించారు. బాధితులకు భరోసా కల్పించారు

తరలి వచ్చిన స్వచ్ఛంద సేవకులు..

దేశవిదేశాల నుంచి పలు స్వచ్ఛంద సంస్థలు వరదబాధితుల కోసం తరలివచ్చాయి. తానా వంటి సంస్థలతోపాటు స్థానికంగా సేవా కార్యక్రమాలు నిర్వహించే పలు సంస్థలు వరదబాధితులకు అండగా నిలిచాయి. విశాఖపట్నంకు చెందిన శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు డాక్టర్ కుప్పిలి కీర్తి పట్నాయక్ ఆధ్వర్యంలో వరద బాధితులకు ఆహారం, దుప్పట్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. మూగజీవాలకూ ఆహారం అందించారు. గుడివాడకు చెందిన లిటిల్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్‌కు చెందిన అల్లూరి హేమంత్‌కుమార్ తదితరులు రాపిడ్ రెస్పాన్స్ టీంగా ఏర్పడి వరదల్లో చిక్కుకుపోయిన వారిని రక్షించడం.. ఆహారం, తాగునీరు అందించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. కార్గిల్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు ఇస్కాన్‌తో కలిసి బాధితులకు నిత్యావసరాలు సరఫరా చేశారు. ఇలా ఎందరో స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు వరద ప్రభావిత ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలతో తమ పెద్ద మనసు చాటుకున్నారు.

ప్రజాప్రతినిధుల సేవలు ప్రశంసనీయం..

సోనోవిజన్ జనార్దన్ మూర్తి, విజయలక్ష్మి ట్రస్ట్ రూ.10 లక్షలు వితరణ



సీఎం చంద్రబాబును కలిసిన సోనోవిజన్ అధినేత భాస్కరమూర్తి

వన్‌టౌన్ : వరద బాధితుల సహాయార్థం సోనోవిజన్ జనార్దన్ మూర్తి, విజయలక్ష్మి ట్రస్ట్ తరఫున రూ.10 లక్షల విరాళాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. సోనోవిజన్ మేనేజింగ్ పార్టనర్ పొట్లూరి భాస్కరమూర్తి బుధవారం చంద్రబాబును కలిసి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరద బాధిత ప్రాంతాల్లో పాడైపోయిన ఎల్ఈడీ, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, వాషింగ్‌మెషిన్‌లు, తదితరాలకు ఉచిత సర్వీసును అందజేస్తున్నామని, విడిపరికరాలకు 50 శాతం రాయితీ ఇస్తున్నట్టు తెలిపారు.

త్వరలో ఆపరేషన్ బుడమేరు!

- ముంపు ప్రాంతాల్లో మంత్రి నారాయణ పర్యటన

విద్యాధరపురం, సెప్టెంబరు 11 : బుడమేరు ఉండాల్సిన విస్తీర్ణం కంటే చాలా వరకు కుచించుకుపోయిందని.. దీనికోసం ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ఆపరేషన్ 'బుడమేరు' పేరిట ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామని మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు.బుడమేరు ఆక్రమణలు పెరిగిపోయాయన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలైన విద్యాధరపురం, జక్కంపూడి, కుందావరి కండ్రికలో అధికారులతో కలిసి ఆయన బుధవారం పర్యటించారు. జక్కంపూడి, వైఎస్ఆర్ కాలనీలలో బుడమేరు ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయన వెంట కుమార్తె సింధూర కూడా ఉన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. వరద ప్రభావిత ప్రాంతాలలో పది వేలమంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారని బుధవారం సాయంత్రానికల్లా దాదాపు అన్ని ప్రాంతాల్లో పరిస్థితులను ఒక కొలిక్కి తీసుకువస్తామన్నారు. తీవ్రమైన వరద ఇబ్బందులను సీఎంతో పాటు మంత్రులు, అధికారులు పదిరోజులపాటు కష్టపడి సాధారణ స్థితికి తీసుకువచ్చారన్నారు. ఐదు ప్రాంతాల్లో ఇంకా వరద నీరు ఉందని, దానిని కూడా తగ్గించివేస్తామని చెప్పారు. మనిసిపల్, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరుస్తున్నామన్నారు. బుడమేరు ప్రవాహానికి ఉన్న ఆటంకాలను అధిగమించటంపై ఈ సందర్భంగా అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు.



అధికారులతో కలిసి బుడమేరు ముంపు పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

ఊరును చుట్టేసిన వరద



నీటిలో కుళ్లిపోయిన వరి, పంటను చూపుతున్న రైతులు



- పదిరోజులుగా ముంపులోనే వరి చేలు
- దుర్గంధం భరించలేక అల్లాడుతున్న ఈలప్రోలు వాసులు
- నీరు బయటకు పోయే మార్గం లేదు
- పొట్టకు వస్తుందనుకున్న తరుణంలో 1200 ఎకరాల్లో వరి సర్వనాశనం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 11 : బుడమేరు వరద ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలు గ్రామ రైతుల్ని కోలుకోలేని దెబ్బతీసింది. గ్రామం చుట్టూ వరిచేలు చెరువులను తలపిస్తున్నాయి. సుమారు 1,200 ఎకరాల్లో మరో వారం పది రోజుల్లో పొట్ట దశకు చేరుకుంటుందనుకుంటున్న పంట వరదపాలవడం రైతులకు మింగుడు పడటం లేదు. నీటిలో నానుతున్న పంట కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఏం రోగాలు వస్తాయోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. చేతికొస్తుందనుకున్న పంట వరద పాలవ్వడం ఊరు చుట్టు పట్టిన వరద నీరు ఇప్పటికీ బయటకు పోకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో గ్రామస్థులున్నారు. మరోవైపు పశుగ్రాసం కోసం మూగ జీవాలు అల్లాడుతున్నాయి. ఏ రైతును కదిలించినా అయ్యా పంటలు మొత్తం పోయాయి. ప్రాణాలు మాత్రం దక్కించుకోగలిగామని వాపోతున్నారు.

రైతుల కష్టాలు వారి మాటల్లోనే...

నిండా ముంచేసింది



- జూలపల్లి గంగారావు

బుడమేరు వరద నిండా ముంచేసింది. ఎకరానికి రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టాం. మరో కట్ట మందు, ఇంకోసారి పురుగు మందు కొడితే పొట్టదశకు మాగాణి చేరుకునేది. వరద పట్టి మొత్తం పంట సర్వనాశనమైంది. ఇప్పట్లో పొలాల్లో నీరు బయటకు పోయే మార్గం లేదు. ఈ ఏడాదికి ఏ పంట సాగు చేసుకునే వీలు లేదు. గండ్లు పడ్డాయి. చాలా వరకు పొలాలు మేటలు వేసి ఉంటాయి. వరద పూర్తిగా తగ్గితే మేటలు ఏ మేర వేశాయో తెలుస్తుంది.

రోగాలు వస్తాయని భయమేస్తోంది



- దామా హనుమంతరావు

పంటలు మొత్తం కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. పది రోజులుగా పొలాల్లో ఎక్కడి నీరు అక్కడే ఉంది. బయటకు వెళ్లే అవకాశం లేదు. బుడమేరు పూర్తిగా తగ్గితే తప్ప ఈనీరు వాగు ద్వారా బయటకు పోయే మార్గం లేదు. రెగ్యులేటర్ గేట్లు ఎత్తినా, గండ్లు పడిన ముందు మునిగిపోయేది మాగ్రామమే. దుర్వాసన వల్ల రోగాలు వస్తాయేమోనని భయమేస్తున్నది.

కౌలు రైతులకు పరిహారం అందాలి :



- వల్లూరు కిషోర్ కుమార్

పంట పరిహార విషయంలో ప్రభుత్వం నిబంధనలు సడలించాలి. హెక్టారుకు రూ.25 వేలు ఇస్తామని అంటున్నది. అయితే రెండు హెక్టార్లుకు మాత్రమే పరిహారం ఇస్తే 20 నుంచి 30 ఎకరాలు కౌలుచేసే రైతులున్నారు. వారి పరిస్థితి ఏం కావాలి. ప్రభుత్వం నిబంధనలు సడలించి మొత్తం పంటకు పరిహారం అందించి ఆదుకోవాలి.

శాశ్వత పరిష్కారం చూపాలి



- దారపనేని కిషోర్ కుమార్

బుడమేరు వరద ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలి. వరదల వల్ల పంటలు పూర్తిగా పోయాయి. పశువులకు మేత లభించడం లేదు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. బుడమేరు వరద వచ్చి పడేది ముందు మా గ్రామం మీదే. ఆ తర్వాతే విజయవాడ పల్లపు ప్రాంతాలు మునుగుతాయి. సీఎం చంద్రబాబు చొరవ బాగుంది. నిత్యావసరాలు అందాయి. పంట పరిహారంలో కూడా న్యాయం చేయాలి.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- రైతుల రుణాలు పూర్తిగా రద్దుచేయాలి
- కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య డిమాండ్



మంగళాపురంలో దెబ్బతిన్న వరిపొలాన్ని పరిశీలిస్తున్న రావుల వెంకయ్య

చల్లపల్లి, సెప్టెంబరు 11 : వరద, అధిక వర్షాల కారణంగా నష్టపోయిన రైతుల రుణాలను పూర్తిగా రద్దుచేయాలని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చల్లపల్లి మండలం వెలివోలు, మంగళాపురం గ్రామాల్లో బుధవారం పర్యటించి వరదలు, వర్షాల కారణంగా నీటమునిగిన వాణిజ్య పంటలు, పట్టుపురుగుల షెడ్లు, పొలాలను పరిశీలించారు. రైతులను పరామర్శించి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, బుడమేరు పొంగి విజయవాడ నగరం ముంపునకు గురైతే, వరదలు, వర్షాల కారణంగా నదీపరీవాహక ప్రాంతాల్లో రైతాంగం తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇంతటి ఘోరవిపత్తు సంభవించినా కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకూ జాతీయ విపత్తుగా ప్రకటించకపోవటం బాధాకరమన్నారు. వెలివోలులో పట్టు రైతులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోవాలనీ, ఒక్కొక్క షెడ్డుకు రూ.నాలుగు లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. తమ భూములు ఆన్‌లైన్ చేయలేదని రైతులు చెబుతున్నారనీ, భూపోరాట యోధుడు చండ్ర రాజేశ్వరరావు ఆధ్వర్యంలో పంపిణీ జరిగిన భూములను ఇప్పటివరకు ఆన్‌లైన్ చేయకపోవటం అధికారుల తప్పిదం కాదా అని ప్రశ్నించారు. తక్షణమే భూములను ఆన్‌లైన్ చేయాలనీ, నిబంధనలు సడలించి ప్రభుత్వం వారిని ఆదుకోవాలన్నారు. వరికి ఎకరాకు రూ.50వేలు, వాణిజ్య పంటలైన అరటి, కంద, పసుపు పంటలకు ఎకరాకు రూ. లక్ష పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వరదలలో ఇప్పటి వరకు సుమారు 40 మంది చనిపోయారనీ, ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల చొప్పున పరిహారం అందించి ఆ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. యుద్ధ ప్రాతిపదికన డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలన్నారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్నీడు యలమందరావు, పరుచూరి శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య, సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, రైతుసంఘం నేతలు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, గుత్తికొండ రామారావు, వేమూరి రత్నగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు సహకరించాలి

- ప్రభుత్వ అదనపు కార్యదర్శి నివాస్



విజయవాడ లీగల్ : వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఆర్థిక పునర్నిర్మాణ ప్యాకేజీ ద్వారా వీలైనంత అధిక మద్దతు ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, ప్రభుత్వ రంగ, ప్రైవేటు బ్యాంకులు బాధిత ప్రజలకు భరోసా కల్పించడంలో కీలక భాగస్వాములు కావాలని రాష్ట్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి (ఫైనాన్స్) జెనివాస్, కలెక్టర్ సృజన కోరారు. బుధవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో వారు బ్యాంకర్లతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు ఆర్‌బీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా వరద ప్రభావిత ప్రజలకు బ్యాంకుల ద్వారా అందించాల్సిన సహాయ సహకారాలకు ప్రతిపాదనల రూపకల్పనపై చర్చించారు. ఈ సందర్భంగా నివాస్ మాట్లాడుతూ, వరద వల్ల నష్టపోయిన ప్రజలకు తగిన సహాయం అందించి, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. ఇందుకు ఆర్‌బీఐతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపారు. రుణాల రీషెడ్యూలింగ్, వినియోగ రుణాల్లో వెసులుబాటు, కొత్త రుణాల మంజూరుకు సంబంధించి వరద ప్రభావిత ప్రాంతాల్లోని బ్యాంకు శాఖలు తమ పరిధిలో ఇప్పటికే వివిధ రకాల రుణాలు పొందినవారు, వినియోగ రుణాలు పొందిన వారు, రుణాల మొత్తం, రుణ ఖాతాలు, జరిగిన నష్టం విలువ తదితర వివరాలతో సమాచార నిధి (డేటా బేస్) రూపొందించాలని, ఇందుకు తమ సర్వేయర్స్, అసెసర్స్ వంటి ఫీల్డ్ సిబ్బందిని ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ యంత్రాంగం నుంచి కూడా సమాచారం అందుబాటులో వుంటుందని, ఈ మొత్తం సమాచారాన్ని మదించి పునర్నిర్మాణ ప్యాకేజీపై ప్రతిపాదనలు రూపొందాల్సి వుందని నివాస్ వివరించారు.

సమష్టి భాగస్వామ్యంతో భరోసా..

కష్టాల్లో వున్నవారిని గట్టెక్కించడంలో ప్రభుత్వ యంత్రాంగంతో బ్యాంకులు కలిసి రావాలని కలెక్టర్ జి.సృజన తెలిపారు. ముఖ్యమంత్రి బ్యాంకులు, బీమా సంస్థలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారని, త్వరలో ఆయన అధ్యక్షతన మరో సమావేశం వుంటుందని కలెక్టర్ వివరించారు. సమావేశంలో ఎల్‌డీఎం కె.ప్రియాంక, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

అందరినీ ఆదుకుంటాం

- కష్టమొచ్చిన ప్రతి ఒక్కరి నష్టాన్ని గణిస్తాం
- ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- ఎన్యూమరేషన్ బృందాన్ని పంపి నష్టాన్ని నమోదు చేస్తాం
- అన్ని విధాలా సహాయ సహకారాలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



విజయవాడ లీగల్, సెప్టెంబరు 11 : విజయవాడ పరిసర ప్రాంత వరద ప్రభావిత ప్రాంతాల్లో గృహాలకు, వ్యాపార వాణిజ్య ఆస్తులకు జరిగిన నష్టాన్ని యాప్‌లో నమోదు చేసే ప్రక్రియ అర్బన్ ఏరియాలో దాదాపు పూర్తికావచ్చిందని, గ్రామీణ ప్రాంతంలోను శరవేగంగా జరుగుతోందని, అయితే ఇంకా ఎవరైనా మిగిలివుంటే వారు ఈనెల 12న తమ పరిధిలోని గ్రామ/వార్డు సచివాలయాన్ని సంప్రదిస్తే ఎన్యూమరేషన్ బృందాన్ని పంపి నష్ట నమోదు చేయడం జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడుతూ, వరద ప్రభావం నుంచి 32 వార్డులు, ఐదు గ్రామాల్లో రక్షణ, ఉపశమన చర్యలు విజయవంతంగా పూర్తిచేయడం జరిగిందని, ఇప్పుడు పునరావాస చర్యలను ప్రణాళికాయుతంగా చేపడుతున్నట్టు వెల్లడించారు. ఈనెల 9వ తేదీన నష్ట నమోదు ప్రక్రియ ప్రారంభించామని, బాధితులను ముంపు నష్టాల నుంచి బయటపడేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకాలను అనుగుణంగా కృషి చేస్తున్నట్టు తెలిపారు. దాదాపు 2,32,000 కుటుంబాలకు సంబంధించిన నష్ట గణాంకాలను నమోదు చేయడం జరుగుతోందని, ఒకవేళ ఇల్లు విడిచి బయటకు వెళ్లినా, ఎన్యూమరేషన్ బృందం ఇంటికి వచ్చినప్పుడు అందుబాటులో లేకున్నా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈనెల 12వ తేదీన తమ పరిధిలోని గ్రామ/వార్డు సచివాలయ కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు. నష్ట గణనకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా టోల్ ఫ్రీ నెంబర్లలో సబ్ కలెక్టర్ కార్యాలయం (0866-2574454), విజయవాడ మున్సిపల్ కార్యాలయం (8181960909) సంప్రదించి ఎన్యూమరేషన్‌ను పూర్తిచేయించుకోవచ్చని వివరించారు. నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు తదితర ప్రాంతాల్లోనూ నష్ట గణనను మర్గదర్శకాలకు అనుగుణంగా పూర్తిచేస్తామని కలెక్టర్ సృజన తెలిపారు.

అన్ని విధాలా అండగా..

రిలీఫ్ అంటే కేవలం ఆహారం, ఆర్థిక సహకారమే కాకుండా బాధితులకు ఎన్ని విధాలా సహాయం అందించాలో అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాధితులకు చేసే సహాయం రియాక్టివ్‌గా కాకుండా ప్రో యాక్టివ్‌గా (క్రియాశీలంగా) వుండాలని ముఖ్యమంత్రి నిర్దేశించారని, ఈ క్రమంలోనే బాధితుల వాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఎలక్ట్రికల్ రిపేర్లు వంటివి చాలా తక్కువ ధరలో చేయించడం జరుగుతోందని, అవసరమైతే ప్రభుత్వమే రాయితీతో ఇవన్నీ చేయించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితుల సౌకర్యార్థం అందుబాటులో వుంచిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని అందరూ సమిష్టిగా విజయవాడను పూర్వస్థితికి తీసుకొచ్చేందుకు కృషి చేద్దామని కలెక్టర్ సృజన పిలుపునిచ్చారు.

అర్బన్‌లో 90 శాతం నిత్యావసరాల కిట్ల పంపిణీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వరద బాధితులకు నిత్యావసర కిట్ల పంపిణీని సివిల్ సప్లయిస్ అధికారులు వేగవంతం చేశారు. బుధవారం నాటికి విజయవాడ అర్బన్‌లో 90 శాతం కిట్లను పంపిణీ చేశారు. బుధవారం నాటికి 2.20లక్షల కిట్లను పంపిణీ చేశారు. ఇంకా కేవలం 14 వేల కిట్లను పంపిణీ చేస్తే నూరుశాతం పూర్తి అవుతుంది. బుధవారం నుంచి గ్రామీణ ప్రాంతాలలో మరో 33 వేల కిట్ల పంపిణీకి ఎన్టీఆర్ జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులు చర్యలు చేపట్టారు. జగ్గయ్యపేట, నందిగామ, విజయవాడ రూరల్, తిరువూరు వంటి ప్రాంతాలలో వరద ప్రభావానికి గురైన ప్రాంతాలకు సంబంధించి నిత్యావసరాల కిట్ల పంపిణీని చేపట్టారు. గురువారం నాటికి నూరు శాతం కిట్ల పంపిణీని అధికారులు పూర్తి చేయనున్నారు.

భారీగా రైళ్ల రద్దు

విజయవాడ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్-హసన్‌పర్తి-కాజీపేట (ఎఫ్)సెక్షన్‌లో నాన్ ఇంటర్ లాకింగ్ పనుల రీత్యా భారీఎత్తున రైళ్లను రద్దు చేశారు. రికార్డు స్థాయిలో మొత్తం 53 రైళ్లను సెప్టెంబరు 25 వ తేదీ వరకు రద్దు చేశారు. అలాగే 13 రైళ్లను డైవర్షన్ చేశారు. మరో 12 రూటు మార్చారు. విజయవాడ-సికింద్రాబాద్ (12713), సికింద్రాబాద్-విజయవాడ (12714), డోర్నకల్- విజయవాడ (07755), విజయవాడ-డోర్నకల్ (07756), విజయవాడ-గుంటూరు (07464), గుంటూరు-విజయవాడ (07465) రైళ్లు పూర్తిగా రద్దయ్యాయి. గోరఖ్‌పూర్- కోచెవెల్లి, చెన్నై-కాత్రా, బెంగళూరు-దానాపూర్‌ల మధ్యన నడిచే రైళ్లు పెద్ద సంఖ్యలో రద్దయ్యాయి.

అక్టోబరులో రైల్వే జీఎం-ఎంపీల సమావేశం

రైల్వే అంశాలపై చర్చించేందుకు అక్టోబరు మొదటి, రెండవ వారంలో ఏపీ పార్లమెంట్ సభ్యులతో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ సమావేశం నిర్వహించనున్నారు. దీనిపై అధికారికంగా అధికారులు సమచారం ఇవ్వనప్పటికీ.. ఎంపీలతో సమావేశాన్ని నిర్వహించటం కోసం ఏర్పాట్లు చేపట్టారు. ఎప్పటిలా సత్యనారాయణపురం రైల్వే ఇన్‌స్టిట్యూట్ హాల్‌లో ఎంపీలతో మీటింగ్ నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. లోక్‌సభ సభ్యులతో పాటు రాజ్యసభ సభ్యులకూడా ఆహ్వానాలు పలకనున్నారు.

ప్రాణం నిలిపిన పోలీసులు

విజయవాడ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు మందలించడంతో కాల్వలోకి దూకి ఆత్మహత్యకు యత్నించిన యువకుడి ప్రాణాలను కృష్ణలంక పోలీసులు కాపాడారు. అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన వికాస్ బుధవారం మద్యం తాగి ఇంటికి వెళ్లాడు. దీనితో తల్లిదండ్రులు అతడిని మందలించారు. మనస్తాపం చెందిన వికాస్ ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలోని బందరు లాకుల వద్ద నుంచి కాల్వలోకి దూకాడు. స్థానికులు గమనించి కంట్రోల్ రూంకు సమాచారమిచ్చారు. కృష్ణలంక కానిస్టేబుళ్లు వి.నాగేశ్వరరావు, అబ్దుల్ మజీద్‌లు స్థానికుల సహాయంతో వికాస్‌ను ప్రాణాలతో ఒడ్డుకు చేర్చారు. అనంతరం అతడి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ పోలీసులను సీపీ రాజశేఖర్ బాబు అభినందించారు.



వృద్ధ దంపతులు వెంకటరత్నం, మణెమ్మ

బిడ్డ జాడ చెప్పరూ!

- తనయుడి కోసం వృద్ధ దంపతుల వేదన..



తిరువూరు : కనిపించకుండా పోయిన కుమారుడి కోసం వృద్ధ దంపతులు ఎదురుతెన్నులు చూస్తున్నారు. అతడి ద్విచక్ర వాహనం ఏట్లో లభించడంతో కుమారుడు ఎమయ్యాడోనని ఆందోళన చెందుతున్నారు. వివరాల ప్రకారం.. మండలంలోని వావిలాల శివారు రాజుగూడెంకు చెందిన కౌలురైతు కోట వెంకట్రావు(45), ఆగస్టు 31న పని నిమిత్తం వెళుతున్నట్టు చెప్పి వెళ్లాడు. ఇప్పటి వరకు అతడి అచూకీ తెలియటం లేదు.. స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం.. అని వృద్ధ దంపతులు కోట వెంకటరత్నం, మణెమ్మలు చెబుతున్నారు. తమకు ఆధారం కుమారుడే అని కన్నీటి పర్యంతమవుతున్నారు. కోడలు కోటకుమారి(మరియమ్మ) ఏడాది క్రితం కేన్సర్‌తో మృతి చెందింది. వృద్ధులైన తల్లిదండ్రుల్ని చూసుకుంటు, కౌలుకు వ్యవసాయం చేస్తున్నాడు. ఈనెల 5న చింతలపాడు వాగులో చేపలు పట్టేందుకు కొందరు వలలు వేయగా వెంకట్రావు ద్విచక్ర వాహనం బయటపడింది. కొడుకు వాగులో కొట్టుకుపోయాడా, లేక ఎక్కడైనా క్షేమంగా ఉన్నాడా తెలియక వృద్ధ దంపతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని, వాగులో ద్విచక్రవాహనం లభ్యమవడంతో వాగు పరిసరాల్లో వెంకట్రావు అచూకి కోసం గాలింపు కొనసాగుతోందని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.



బొడ్డు రాయి చోరీపై ఫిర్యాదు

విస్సన్నపేట : పుత్రేల శివారు జానలగడ్డ గ్రామంలో ముత్యాలమ్మ తల్లి గుడి ప్రదేశంలో కోట్లాది రూపాయల విలువగల బొడ్డు రాయి చోరీపై పూర్తి విచారణ చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మంగళవారం ఎస్ఐ పి.రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. విలువైన రాయి మాయమైన ఘటనలో కోట్లు చేతులు మారినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.



పలిశెట్టి చందు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పశువుల కోసం వెళ్లి.. అశువులు బాసాడు!

- బ్యాంకు ఉద్యోగి పలిశెట్టి చంద్రశేఖర్ సంతాపసభలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కృష్ణలంక : సింగ్‌నగర్ తోటవారి వీధిలో వున్న తన సోదరుడి పాలడైరీలోని పనివారు, పశువులు వరదకు కొట్టుకుపోతుంటే వారిని కాపాడబోయి ఈతవచ్చినప్పటికీ ఐడీఎఫ్‌సీ బ్యాంకు ఉద్యోగి పలిశెట్టి చంద్రశేఖర్ (చందు) ప్రవాహంలో కొట్టుకుపోయి మృతిచెందడం బాధాకరమని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విచారం వ్యక్తం చేశారు. చందు సంస్మరణ సభ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. చందుకు 15 నెలల క్రితం వివాహం కాగా భార్య ఏడు నెలల గర్భిణి. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను కుటుంబసభ్యులకు అందజేశారు.



ఆఫ్రికాలో ఫార్మశీ రంగంలో ఉపాధి మెండు

మొగల్రాజపురం, సెప్టెంబరు 11: ఆఫ్రికా దేశాలలో ఫార్మశీ రంగంలో ఉపాధి అవకాశాలు భారీగా ఉన్నాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆఫ్రికాలో టాంజానియాలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడికల్ ప్రొడక్ట్స్‌కు డైరెక్టర్‌గా సేవలు అందిస్తున్న యోనా హెబ్రాన్ వాల్విసి చెప్పారు. కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మశీ కళాశాలలో ఆఫ్రికాలో ఫార్మశీ ఉద్యోగావకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ టాంజానియా, ఇతర ఆఫ్రికా దేశాలకు ఎగుమతులు జరుగుతున్నందున ఫార్మారంగ కంపెనీల్లో ఫార్మాసిస్టు పోస్టులకు నిపుణులైన ఫార్మశీ విద్యార్థుల అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, డాక్టర్ జి. రమణ, డాక్టర్ ఘంటా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరూ అధైర్యపడొద్దు...అండగా ఉంటా

43, 44, 45 డివిజన్లలో బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే సుజనా

భవానీపురం/ వన్‌టౌన్, సెప్టెంబరు 11 : ప్రకృతి విపత్తుల వలన వరదలు సంభవించడం దురదృష్టకరమని, అన్ని వర్గాల ప్రజలను ఎన్యూమరేషన్ అయ్యాక కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి భరోసా ఇచ్చారు. 43, 44, 45 డివిజన్లలోని ఊర్మిళానగర్, ఏకలవ్యనగర్, జోజినగర్, పున్నమిఘాట్‌ల్లోని పలు ప్రాంతాల బాధితులను బుధవారం ఆయన పరామర్శించారు. అందర్నీ ఆదుకుంటామని ధైర్యం చెబుతూ, సహాయ కార్యక్రమాలు అందాయా అంటూ ఆరా తీశారు. ఏకలవ్యనగర్‌లోని పలు ప్రాంతాల్లో ఇళ్ల శుభ్రపరచడానికి ఫైరింజన్లు కావాలని కోరగా, వెంటనే ఏర్పాటు చేయాలని ఫైర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఏ ఒక్కరూ అధైర్య పడొద్దని, కష్టకాలంలోనే అందరూ ధైర్యంగా ఉండాలని, తాను అండగా ఉంటానని సుజనా హామీ ఇచ్చారు. ఆయన వెంట హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగుల్ మీరా, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ నాయకులు బొమ్మసాని సుబ్బారావు, ఫైలా సోమినాయుడు, డివిజన్ అధ్యక్షుడు మోరబోయిన రాంబాబు, పేరం సత్యనారాయణ, కొనికి కొండయ్య, జనసేన అధ్యక్షురాలు బొమ్ము గోవింద లక్ష్మి, రాంబాబు పాల్గొన్నారు.



ఊర్మిళానగర్‌లో వరద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుజనా

వీఎంసీ కాలనీలో....

చిట్టినగర్: చిట్టినగర్ వీఎంసీ కాలనీలో ఎమ్మెల్యే సుజనా చౌదరి పలువురు కూటమి నాయకులతో కలసి వరద బాధితులను పరామర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేతోపాటు టీడీపీ సీనియర్ నాయకులు కె.నాగుల్‌మీరా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ నాయకుడు గుర్రం కొండ, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి పి. శ్రీధర్, డివిజన్ టీడీపీ అధ్యక్షుడు డి. ప్రభుదాస్, పి.లోకేష్ పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వరద నీరు నిల్వకుండా చూడండి

కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, సెప్టెంబరు 11: వరద నీరు నిల్వకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం వరద ప్రభావిత ప్రాంతాలు చనమోలు వెంకట్రావ్ ఫ్లైఓవర్, వాంబేకాలనీ, కండ్రిక సెంటర్, నందమూరినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో కుళాయిల ద్వారా వస్తున్న నీటిని వాడుకోవడానికి మాత్రమే వినియోగించుకోవాలని, ట్రాక్టర్లతో మంచినీటిని సరఫరా చేస్తున్నామని వాటిని తాగేందుకు వినియోగించాలన్నారు. వరదలో కొట్టుకు వచ్చిన వ్యర్థాలను తొలగించడానికి వీఎంసీ 465 వాహనాలతో ప్రతి డివిజన్‌లో పారిశుధ్య పనులు చేపడుతుందన్నారు. మంత్రి నారాయణ సహకారంతో 184 ట్రాక్టర్లు, 122 టిప్పర్లు, 65 జేసీబీలు, 22 బాబ్‌కాట్‌లు, 13 డోజర్లు, 7 పొక్లెయినర్లు, 2 క్రేన్లు, 25 కంపెక్టర్లు, 23 ఎయిర్ టెక్ మిషన్‌లతో శుభ్రం చేసేందుకు శరవేగంగా పనులు జరుగుతున్నాయన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన 6830 పారిశుధ్య కార్మికులు, 950 శానిటరీ సూపర్‌వైజర్లు, 62 శానిటరీ నోడల్ ఆఫీసర్లు, 149 సచివాలయ స్పెషల్ ఆఫీసర్లు, 32 వార్డు స్పెషల్ ఆఫీసర్లు, ప్రతి వార్డుకి ఒక ఐఏఎస్ వార్డు స్పెషల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో శరవేగంగా పారిశుధ్య నిర్వహణ జరుగుతుందన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర



భోజనం వడ్డిస్తున్న పరుచూరి ప్రసాద్



బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ , ఎమ్మెల్యేలు గల్లా మాధవి, సుజనా చౌదరి,బాబుల్ ఉలూమ్ మసీదులో, అమృతహస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

విపత్తును ఎదుర్కోవడం బాబుతోనే సాధ్యం

ఎంపీ కేశినేని శివనాథ్

ధర్నాచౌక్, సెప్టెంబరు 11: విపత్తును ఎదుర్కోవడం చంద్రబాబుతోనే సాధ్యమని ఎంపీ కేశినేని చిన్ని అన్నారు. తాత మనవడు ఫ్రెండ్స్ సర్కిల్, బాబాయ్ అబ్బాయ్ యూత్, ఎంపీ కేశినేని చిన్ని, ఇతర దాతల సహకారంతో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక 64వ డివిజన్ కండ్రికలో వరద బాధితులకు భోజన పంపిణీ కార్యక్రమంలో 5వ రోజు బుధవారం 6 వేల మందికి ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో సాధారణ పరిస్థితి నెలకొంటుందన్నారు. బాధితులకు అందరికి సాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ త్రిమూర్తిరాజు, పరుచూరి సురేష్, టీడీపీ మహిళా నేత పలగాని భాగ్యలక్ష్మీ, టీడీపీ 64వ డివిజన్ అధ్యక్షుడు పరసా అశోక్, సూరవరపు నాగరాజు, అంజిబాబు, పరుచూరి రాము, పందిరి వాసు, బుద్దరపు రాజలింగం, రాజేష్, డివిజన్ కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంచిన కార్మికశాఖ మంత్రి సుభాష్

భవానీపురం: తలలో పేనుకొరుకుడుగా రాష్ట్రానికి గుండుకొట్టించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి చెందుతుందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆరోపించారు. 43వ డివిజన్ ఊర్మిళానగర్‌లో వరద బాధిత ప్రాంతాల్లో బుధవారం ఆయన ఇంటింటికి తిరుగుతూ నిత్యావసరాలను ప్రజలకు అందజేశారు. చంద్రబాబు త్వరలోనే అన్ని వర్గాలను ఆదుకునే బాధ్యత తీసుకుంటారన్నారు. బురద రాజకీయాలు చేస్తున్న వైసీపీ నాయకులు, జగన్ తీరును ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొనికి కొండయ్య, పూజల శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

విజయవాడ వరద ప్రభావితం కావటం దురదృష్టం

గుంటూరు ఎమ్మెల్యే గల్లా మాధవి

విద్యాధరపురం: ఎన్నడూ లేనివిధంగా విజయవాడ వరద ప్రభావితం కావటం దురదృష్టకరమని గుంటూరు ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరితో కలిసి బుధవారం కామకోటినగర్‌లో వరద బాధితులకు ఆమె నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యావసర సరుకులతో పాటు వరద బాధితులకు మందులను కూడా అందచేస్తున్నామని తెలిపారు. తెలుగు మహిళా నాయకురాలు సత్యవాణి, శివలీల, రేపాటి పద్మ, 39వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు రేగళ్ల లక్ష్మణరావు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బాబుల్ ఉలూమ్ మసీదులో

వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గం 54వ డివిజన్ వించిపేట బాబుల్ ఉలూమ్ మసీదులో శాసన మండలి మాజీ చైర్మన్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఏ షరీఫ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్‌లు బుధవారం ఒంగోలు మర్కజ్ మసీదు సహకారంతో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. టీడీపీ జాతీయ కార్యాలయం రిసెప్షన్ ఇన్‌చార్జి హుస్సేన్ బాషా, జిల్లా కార్యాలయ కార్యదర్శి సారిపల్లి రాధాకృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి మీర్జా ముదఫర్ బేగ్‌లతో పాటు మసీదు కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అమృతహస్తం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో

విజయవాడ కల్చరల్: అమృతహస్తం చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ దారా కరుణశ్రీ ఆధ్వర్యంలో బుధవారం వాంబేకాలనీ సీ బ్లాక్ వద్ద 500 మంది వరద బాధితులకు కిట్లు పంపిణీ చేశారు. వరదలు వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతిరోజు అమృతహస్తం ఛారిటబుల్ ట్రస్టు రాణిగారితోట, స్వాతి థియేటర్ వైపు, లేబర్ కాలనీ, ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డు, వాంబేకాలనీ, సింగ్‌నగర్, ఇలా చాలా ప్రదేశాల్లో అవసరమైన వారికి పాలు, పెరుగు, బిస్కెట్లు, వాటర్ బాటిల్స్, బిర్యానీ, పుల్కాలు, ఆహారాన్ని అందించింది. ఈ కార్యక్రమంలో గుడివాడ కృష్ణకిషోర్, ప్రోగ్రాం కమిటీ, కొత్త ఆంజనేయులు, శ్రీజ, హెల్పింగ్ హ్యాండ్స్ హైదరాబాద్ ఆసిఫ్, ఎక్స్ ఆర్మీ, పూర్ణ ఈవెంట్స్ శ్రీనివాస్, యార్లగడ్డ బాబు, నాగబాబు, దుర్గ, సభ్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నిరుద్యోగ మహిళలకు శిక్షణ కార్యక్రమాలు

మొగల్రాజపురం: నగర పరిసర ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ మహిళలకు నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు జనశిక్షణాసంస్థాన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ నాగళ్ల విద్యా ఖన్నా ఒక ప్రకటనలో తెలిపారు. జ్యూట్ బ్యాగుల తయారీ (3నెలలు), మగ్గం (3నెలలు) వర్క్ శిక్షణలో చేరే వారు 15 నుంచి 45 ఏళ్ల లోపు వారై ఉండాలని, ఒక పాస్‌పోర్టు ఫొటో, ఆధార్ నకలుతో కూడిన దరఖాస్తును ఈనెల 30లోగా మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో ఉన్న జన శిక్షణా సంస్థాన్ కార్యాలయంలో ఇవ్వాలని తెలిపారు.

వరద బాధితులకు త్వరలోనే నష్టపరిహారం అందజేస్తాం

21వ డివిజన్‌లో వరద బాధితులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కృష్ణలంక, సెప్టెంబరు 11 : వరద బాధితులకు భోజనాలు అందించడం, శానిటేషన్ కార్యక్రమాలతో పాటుగా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, త్వరలోనే బాధితులకు ప్రభుత్వం తరపు నుంచి నష్టపరిహారం కూడా అందచేస్తామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. బుధవారం కృష్ణలంక 21వ డివిజన్‌లోని పొట్టి శ్రీరాములు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల ఆవరణలో వరద బాధితులకు దుస్తుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే గద్దె హాజరై బాధితులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ప్రాంతాల్లో అవసరమైన అన్ని సహాయ కార్యక్రమాలను తమ ప్రభుత్వం చేపట్టిందన్నారు. వరద తగ్గిన తర్వాత వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలను ప్రభుత్వ అధికారులు చేపట్టారని అన్నారు. అతి త్వరలోనే వరద బాధితులకు నష్ట పరిహారం కూడా అందజేస్తామని చెప్పారు. టీడీపీ రాష్ట్ర బీసీ నాయకులు గొరిపర్తి నామేశ్వరరావు, డివిజన్ జనసేన అధ్యక్షుడు కొవ్వూరి కిరణ్‌బాబులు మాట్లాడుతూ వరదలు వచ్చినపుడు ఎక్కడో వుండి మాటలు చెప్పడం కాకుండా వరద నీటిలో తిరుగుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే గద్దె బాధితులకు అండగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముమ్మనేని ప్రసాద్, వేములపల్లి రంగారావు, పల్లపురాజు, కేశనం భావన్నారాయణ, ఆర్.రమాదేవి, మోకా దేవ తదితరులు పాల్గొన్నారు.

4వ డివిజన్‌లో నిత్యావసరాల పంపిణీ

పటమట: తూర్పు పరిధి 4వ డివిజన్ గమేళా బజార్ వరద ముంపునకు గురైన వారికి అక్షయపాత్ర, తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు, పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అక్షయపాత్ర రీజనల్ ప్రెసిడెంట్ వంశీధర్, ఆపరేషన్ మేనేజర్ రఘునందన, దాస శ్రీహరి, చెన్నుపాటి గాంధీ, ముమ్మనేని ప్రసాద్, జాస్తి సాంబశివరావులు పాల్గొన్నారు.

వరద బాధితుల సేవల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



వన్‌టౌన్, సెప్టెంబరు 11: ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వరద బాధిత ప్రాంతాలలో 11వ రోజు బుధవారం కూడా సేవలందించారు. వివిధ వార్డులలో మొత్తంగా 200 మంది వలంటీర్లు సేవలలో పాల్గొన్నారు. వీరిలో కేబీఎన్ కళాశాలకు చెందిన 25 మంది వలంటీర్లు జక్కంపూడి కాలనీ, వైఎస్ఆర్ కాలనీల్లో తాగునీటిని పంపిణీ చేసి, వైద్య సేవల్లో పాల్గొన్నారు. కోఆర్డినేటర్ కొల్లేటి రమేష్ వారికి మార్గదర్శకం చేశారు. జక్కంపూడి కమ్యూనిటీ హాల్‌కు విచ్చేసిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలను అభినందించారు. కళాశాల విద్యా కార్యదర్శి డాక్టర్ కోలా భాస్కర్ నేతృత్వంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ పవన్, తదితరులు సేవల్లో పాల్గొంటున్నారు.

చవితి పందిళ్లలో అన్నదానం



పటమట, సెప్టెంబరు 11 : తూర్పులోని ఐదో డివిజన్ విజయనగర్ కాలనీలో వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు తాటిపత్తి శిరీష్‌కుమార్ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ కాలనీ అధ్యక్షుడు నల్లూరి సుబ్బారావు, బొబ్బిలి విజయ్, విజయనగర్ కాలనీ ఫ్రెండ్స్ సర్కిల్ భక్తులు పాల్గొన్నారు. ఆరో డివిజన్ చుట్టుగుంట మీ సేవ సమీపంలో వినాయక చవితి సందర్భంగా డివిజన్ జనసేన అధ్యక్షుడు తేజ, లంబోధర ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానం కార్యక్రమాన్ని బొప్పన భవకుమార్ ప్రారంభించారు. టీడీపీ మైనార్టీ నాయకుడు షేక్ కరీముల్లా, అప్పలనాయుడు, చినబాబు, లంబోధర ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

అందరికీ రిలేట్ అవుతుంది

'బెంచ్ లైఫ్' వెబ్ సిరీస్‌తో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు మానస శర్మ. తమిళ నటుడు వైభవ్, చరన్ పెరి, రాజేంద్ర ప్రసాద్, రితికా సింగ్, అకాంక్ష సింగ్ ప్రధాన పాత్రలు పోషించారు. నిహారిక కొణిదెల నిర్మించారు. ఈ శుక్రవారం ఓటీటీ సంస్థ 'సోనీ లైవ్'లో విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది.



నిర్మాత నిహారిక కొణిదెల మాట్లాడుతూ "ఇది కార్పొరేట్ ఉద్యోగుల కథ అయినా.. అందరికీ రిలేట్ అవుతుంది. వినోదంతో పాటు.. మంచి భావోద్వేగాలు ఇందులో ఉంటాయి. అద్భుతమైన కంటెంట్ ఉన్న ఈ వెబ్ సిరీస్ తప్పకుండా అందరికీ నచ్చుతుంది" అని చెప్పారు. దర్శకురాలు మానస శర్మ మాట్లాడుతూ "నేను జాబ్ చేస్తున్నప్పుడు ఎదురైన అనుభవాలు.. లైఫ్‌లో చూసిన అనేక సంఘటనలను స్ఫూర్తిగా తీసుకొని తెరకెక్కించిన వెబ్ సిరీస్ ఇది. ప్రతీ పాత్రకూ ఓ కథ ఉంటుంది. ఇందులోని నటీనటులు పంచే వినోదం చాలా కాలం గుర్తుంటుంది" అని చెప్పారు. నటుడు చరణ్ పెరి మాట్లాడుతూ "స్నేహ మాధుర్యాన్ని.. అభిరుచులను సరికొత్తగా ఆవిష్కరించే సిరీస్ ఇది" అని అన్నారు.

విడాకుల విషయం నాకు తెలియదు

ఆర్తి రవి



తనకు తెలియకుండా, తన సమ్మతి లేకుండా తన భర్త విడాకుల ప్రకటన చేశారంటూ ఆర్తి రవి బుధవారం ప్రకటన విడుదల చేయడంతో తమిళ హీరో జయం రవి విడాకుల వ్యవహారం సరికొత్త మలుపు తిరిగింది. ఈ విషయంపై ఆమె విడుదల చేసిన ప్రకటనలో.. 'మా వైవాహిక జీవితం గురించి మీడియా, సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు చూసి ఆందోళనకు గురయ్యాను. 18 ఏళ్ళుగా పరస్పర విశ్వాసం, గౌరవంతో కుటుంబ జీవితాన్ని గడుపుతున్నాం. ఈ విడాకుల ప్రకటన వల్ల మా గౌరవ మర్యాదలతో పాటు వ్యక్తిత్వాన్ని కోల్పోయినట్టుగా భావిస్తున్నాను. నా భర్తతో మాట్లాడాలని, కలవాలని ఎన్నో సార్లు ప్రయత్నం చేశాను. కానీ, నాకు అలాంటి అవకాశం దక్కలేదు. నేను, నా పిల్లలు ఇబ్బంది పడుతున్నాం. వైవాహిక బంధం నుంచి వైదొలగాలనే ఈ నిర్ణయం పూర్తిగా ఆయన సొంతంగా తీసుకున్నది. దీనిపై బహిరంగంగా వ్యాఖ్యానించదలచుకోలేదు. అయితే, నా వ్యక్తిత్వానికి కళంకం కలిగించేలా బహిరంగంగా జరుగుతున్న ప్రచార దాడులను సహించలేకపోతున్నాను. ఈ అసత్య ప్రచారాన్ని తిరస్కరించడం నా తొలి కర్తవ్యం' అని ఆర్తి రవి పేర్కొన్నారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)



భారీ వర్షాలు, వరదలతో ఇబ్బంది పడుతున్న ప్రజలను ఆదుకోవడానికి రెండు తెలుగు రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్‌కు కలిపి హీరో సాయిదుర్గ తేజ్ రూ. 20 లక్షలు విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. బుధవారం ఏపీ మంత్రి నారా లోకేశ్‌కు రూ. పది లక్షల చెక్కును విజయవాడలో అందించారు సాయి దుర్గ తేజ్. అలాగే అమ్మ అనాథాశ్రమానికి రూ. రెండు లక్షలు, ఇతర సేవా సంస్థలకు రూ. మూడు లక్షలు విరాళంగా అందించారు

సాహసనారి సంయుక్త



నిఖిల్ కథానాయకుడిగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'స్వయంభూ'. పీరియాడిక్ వార్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో నిఖిల్‌కు జోడీగా నభానటేష్, సంయుక్త నటిస్తున్నారు. బుధవారం సంయుక్త పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. యుద్ధ భూమిలో విల్లును ఎక్కుపెడుతున్న యోధురాలిగా ఆమె లుక్ అలరించింది. భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. అలాగే శర్వానంద్ సరసన సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం (శర్వా 37-వర్కింగ్ టైటిల్) నుంచి ఆమె పాత్రను పరిచయం చేస్తూ ప్రత్యేక లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రంలో దియా అనే పాత్రలో ఆమె కనిపించనున్నారు. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రంలోనూ సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్నారు. మహేశ్ చందు నిర్మాత. సమీరా అనే పాత్రలో సంయుక్త నటిస్తున్నారు. ఆమె పుట్టిన రోజు సందర్భంగా యూనిట్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది.

మలైకా ఇంట విషాదం



బాలీవుడ్ నటి మలైకా అరోరా ఇంట్లో విషాద ఘటన జరిగింది. మలైకా సవతి తండ్రి అనిల్ మెహతా ముంబైలో ఆరు అంతస్థుల భవంతి నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. ఆయనను ఆస్పత్రిలో చేర్పించారు. కానీ అప్పటికే ఆయన చనిపోయారని వైద్యులు తెలిపారు. అయితే అనిల్ మెహతాది ఆత్మహత్య కాదా అనే విషయం అధికారికంగా తెలియాల్సి ఉంది.

ఉన్నత విద్యలో ఇక ఒకే విధానం

- అన్ని యూనివర్సిటీలు, కాలేజీలకు వర్తింపు
- 2024-25 అకడమిక్ క్యాలెండర్ విడుదల

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో ఏకరూప విధానాన్ని అమలు చేసేందుకు ఉన్నత విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది. డిగ్రీ, బీటెక్, ఫార్మసీ కోర్సులకు ఉన్నత విద్యాశాఖ 2024-25 అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఏటా అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్నా యూనివర్సిటీలు దాన్ని అమలుచేయడం లేదు. ఒక్కో యూనివర్సిటీ ఒక్కోలా పరీక్షలు నిర్వహించుకుంటున్నాయి. ఇకపై అన్ని వర్సిటీలు ఒకే విధానాన్ని అమలుచేయాలని ప్రభుత్వం స్పష్టంచేసింది. అకడమిక్ క్యాలెండర్ ప్రకారమే బోధన, పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది.

డిగ్రీ కోర్సులకు ఇలా..

అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సాధారణ డిగ్రీ కోర్సుల సెమిస్టర్-1 తరగతులు ఆగస్టు 12న ప్రారంభమవుతాయి. డిసెంబరు 9 నుంచి 21 వరకు పరీక్షలు జరుగుతాయి. జనవరి 10న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-2 డిసెంబరు 23న ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 21 నుంచి మే 3 వరకు పరీక్షలు జరుగుతాయి. మే, జూన్ నెలల్లో ఎనిమిది వారాల కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు ఉంటుంది. మే 24న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-3 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 23 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 13న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-4 నవంబరు 25న ప్రారంభవుతుంది. ఏప్రిల్ 21 నుంచి జూన్ 14 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్, జూన్ నెలల్లో ఎనిమిది వారాల షార్ట్ టర్మ్ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. సెమిస్టర్-5 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 23 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 13న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-6 నవంబరు 25న ప్రారంభమవుతుంది. మార్చి 24 నుంచి ఏప్రిల్ 5 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 26న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-7 జూలై 1న ప్రారంభమవుతుంది. నవంబరు 4 నుంచి 16 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 7న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-8 నవంబరు 18న ప్రారంభమవుతుంది. మార్చి 24 నుంచి ఏప్రిల్ 5 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 26న ఫలితాలు విడుదల చేస్తారు.

బీటెక్‌కు ఇలా..

ఇంజనీరింగ్ సెమిస్టర్-1 తరగతులు ఆగస్టు 1న ప్రారంభమవుతాయి. డిసెంబరు 16 నుంచి జనవరి 4 వరకు పరీక్షలు జరుగుతాయి. జనవరి 25న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-2 జనవరి 6న ప్రారంభమవుతుంది. జూన్ 2 నుంచి 21 వరకు పరీక్షలు జరుగుతాయి. జూలై 11న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-3 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 30 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 21న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-4 డిసెంబరు 2న ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 7 నుంచి 26 వరకు పరీక్షలు జరుగుతాయి. మే 17న ఫలితాలు ప్రకటిస్తారు. ఏప్రిల్, జూన్ నెలల్లో 8 వారాల కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు ఉంటుంది. సెమిస్టర్-5 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 30 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 21న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-6 డిసెంబర్ 2న ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 7 నుంచి 26 వరకు పరీక్షలు జరుగుతాయి. 8వారాల షార్ట్ టర్మ్ ఇన్‌టర్న్‌షిప్ ఉంటుంది. మే 17న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-7 జూలై 29న ప్రారంభమై... నవంబరు 25 నుంచి డిసెంబరు 14 వరకు పరీక్షలుంటాయి. జనవరి 4న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-8 డిసెంబరు 16న ప్రారంభమై.. ఏప్రిల్ 15 నుంచి 19 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 26న ఫలితాలు ప్రకటిస్తారు.

డిగ్రీ అడ్మిషన్ల షెడ్యూల్ మార్పు

మూడో విడత డిగ్రీ అడ్మిషన్లకు ఇటీవల విడుదల చేసిన షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి సవరించింది. రిజిస్ట్రేషన్ గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడిగించింది. 11 నుంచి 18 వరకు విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చని, 19న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉంటుందని తెలిపింది. 22న సీట్ల కేటాయింపు జరుగుతుందని, 22 నుంచి 25లోగా విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాలని పేర్కొంది.

జెత్వానీ మొబైల్ ఫోన్ ఎక్కడ?

- వివరాలు తమ ముందుంచాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సినీనటి కాదంబరి జెత్వానీ నుంచి సీజ్ చేసిన మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయో చెప్పాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. వాటిని భద్రపరిచేందుకు తీసుకున్న చర్యలను తెలపాలని కోరింది. ఎలక్ట్రానిక్ పరికరాలను భద్రపరచాలని పోలీసులను ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. విద్యాసాగర్ దాఖలు చేసిన వ్యాజ్యంలో ప్రతివాదిగా చేర్చుకొని తన వాదనలు వినిపించేందుకు అనుమతించాలంటూ కాదంబరి దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. విచారణను ఈ నెల 17కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. జెత్వానీ నుంచి పోలీసులు సీజ్ చేసిన పరికరాలను నిందితురాలికి వెనక్కి ఇవ్వకుండా ఆదేశించాలని కోరుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా, కోసూరుకు చెందిన కేవీఆర్ విద్యాసాగర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది టి.నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. జెత్వానీ తరఫు న్యాయవాది నర్రా శ్రీనివాస్.. వ్యాజ్యంలో ఇంప్లీడ్ అయి వాదనలు వినిపించేందుకు అనమతించాలని కోరారు.

రహదారుల భద్రతపై హైకోర్టులో పిల్

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రహదారుల భద్రత, నిర్వహణ విషయంలో సుప్రీంకోర్టు కమిటీ ఇచ్చిన మార్గదర్శకాలను రాష్ట్రంలో అమలు చేయట్లేదంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం(పిల్)పై హైకోర్టు స్పందించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులుగా ఉన్న కేంద్ర రవాణాశాఖ కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ సీఎస్, రవాణాశాఖ కార్యదర్శి, పురపాలకశాఖ ప్రత్యేకప్రధాన కార్యదర్శి, రహదారుల అభివృద్ధి సంస్థ చీఫ్ ఇంజనీర్, రవాణాశాఖ కమిషనర్, డీజీపీ తదితరులకు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

వరద బాధితులకు ఆపన్నహస్తం

కోటి ఇచ్చిన డిక్సన్, జీవీపీఆర్ ఇంజనీర్స్, నెక్కంటి సీ ఫుడ్స్, సంధ్య ఆక్వా

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం దాతలు స్పందించి, ముఖ్యమంత్రి సహాయ నిధికి తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. బుధవారం సాయంత్రం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి పలువురు విరాళాల చెక్కులు అందజేశారు. సంధ్యా మెరైన్స్ కేవీ ప్రసాద్ రూ.కోటి, జీవీపీఆర్ ఇంజనీర్స్ లిమిటెడ్ చైర్మన్ జీఎస్‌పీ వీరారెడ్డి, ఎండీ శేఖర్‌రెడ్డి రూ.కోటి, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ సత్యప్రకాష్‌సింగ్ రూ.86 లక్షలు, వైశాఖి ఫౌండేషన్ ఎల్లంకి రవికుమార్ రూ.50 లక్షలు, దర్శి నియోజకవర్గ ప్రజల తరఫున రూ.37,16,200, మోడల్ డైరీ ఎండీ పీ ధనప్రకాష్ రూ.30 లక్షలు, నార్త్ అమెరికా కమ్మ సంఘం రూ.30 లక్షలు, దర్శి నియోజకవర్గ టీడీపీ మహిళా నేత గొట్టిపాటి లక్ష్మీ రూ.10 లక్షలు, మణిపాల్ హాస్పటల్స్ క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి, అసోసియేట్ డైరెక్టర్ జే రామాంజనేయరెడ్డి రూ.25 లక్షలు, ఆఫ్రికా, కెన్యా టీడీపీ తరఫున బొబ్బా శివప్రకాష్ రూ.20 లక్షలు, ది సిటిజన్ కోఆపరేటీవ్ సొసైటీ చైర్మన్ రాజు, ఎండీ కేవీ సుబ్బయ్య రూ.10 లక్షలు, గుంటూరు డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రూ.1,84,500 సీఎంకు అందజేశారు. కాగా, అమరావతి సచివాలయంలో.. డిక్సన్ గ్రూప్ కంపెనీ ప్రతినిధులు రూ.కోటి, నెక్కంటి సీ ఫుడ్స్ యాజమాన్యం రూ.కోటి, సంధ్య ఆక్వా రూ.కోటి చెక్కును మంత్రి లోకేశ్‌ని కలసి అందజేశారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ.25 లక్షలు, రేస్ పవర్ సంజయ్‌గుప్తా రూ.25 లక్షలు, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కర్నూలుకు చెందిన డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి రూ.11 లక్షలు, సినీ హీరో సాయి ధరమ్ తేజ్ రూ.10 లక్షలు అందజేశారు. కాగా, మంత్రి టీజీ భరత్ విజయవాడలోని ఊర్మిళా నగర్‌లో వరద బాధితులకు నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు.

భారత ప్రభుత్వం
రైల్వే మంత్రిత్వ శాఖ (దక్షిణ మధ్య రైల్వే)

నోటిఫికేషన్

సికింద్రాబాద్,4-09-2024

ఆర్.సి.నెం. 1381/2023 –సి తేదీ :11.09.2024

S.O.3815(E)- రైల్వే చట్టం, 1989 (24 యొక్క 1989)) (ఇకపై పేర్కొన్న చట్టంగా సూచిస్తారు) లోని సెక్షన్ 20-ఎ లోని సబ్-సెక్షన్ (1)ద్వారా సంక్రమించిన అధికారాలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం, సంతృప్తి చెందిన తర్వాత ప్రజా ప్రయోజనార్థం కోసం, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లాలో **"గుంటూరు-బీబీనగర్‌స్టేషన్ల మధ్య రెండవ రైల్వే లైన్"** అనే ప్రత్యేక రైల్వే ప్రాజెక్ట్ అమలు, నిర్వహణ, మేనేజ్ మెంట్ మరియు ఆపరేషన్ కోసం దిగువ షెడ్యూల్‌లో సంక్షిప్త వివరణ ఇవ్వబడిన భూమి అవసరం ఉన్నదని భావించినందున,అట్టి భూమిని భూసేకరణ చేసే ఉద్దేశాన్ని దీని ద్వారా ప్రకటిస్తున్నాము.

సదరు భూమిపై ఆసక్తి ఉన్న ఏ వ్యక్తి అయినా, అధికారిక గెజిట్‌లోని ఈ నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి ముప్పై రోజులలోగా, సదరు చట్టం లోని సెక్షన్ 20-డి లోని సబ్-సెక్షన్ (1) కింద పైన తెలుపబడిన ప్రయోజనార్థం కోసం భూమిని స్వాధీనం చేసుకోవడంపై అభ్యంతరాలు వ్యక్తం చేయవచ్చు.

అటువంటి ప్రతి అభ్యంతరాన్ని సమర్థప్రాధికారి (భూసేకరణ) & రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్, గురజాల గారికి వ్రాతపూర్వకంగా తెలియజేయాలి మరియు దాని కారణాలను నిర్దేశించాలి మరియు సమర్థప్రాధికారి (భూసేకరణ) & రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్, గురజాల,అభ్యంతరం వ్యక్తం చేసిన వ్యక్తికి వ్యక్తిగతంగా లేదా న్యాయవాదుల ద్వారా వినడానికి అవకాశం కల్పిస్తారు. మరియు, అటువంటి అభ్యంతరాలన్నింటినీ విన్న తర్వాత మరియు తదుపరి విచారణ చేసిన తర్వాత, ఏదైనా సమర్థ అధికారం అవసరమని భావిస్తే, ఉత్తర్వుల ద్వారా, అభ్యంతరాలను అనుమతించవచ్చు లేదా నిరాకరించవచ్చు.

సదరు చట్టంలోని సెక్షన్ 20-డిలోని సబ్-సెక్షన్ (2) ప్రకారం సమర్థప్రాధికారి చేసిన ఉత్తర్వులే తుది నిర్ణయం అవుతుంది.

ఈ నోటిఫికేషన్ కింద కవర్ చేయబడిన భూమికి సంబంధించిన ల్యాండ్ ప్లాన్‌లు మరియు ఇతర వివరాలు పైన తెలుపబడిన సంబంధిత సమర్థప్రాధికారి గారి కార్యాలయములో అందుబాటులో ఉంటాయి మరియు ఆసక్తిగల వ్యక్తి వాటిని తనిఖీ చేయవచ్చు.భూసేకరణలో సముచిత పరిహారం పొందే హక్కు మరియు పారదర్శకత, పునరావాసం మరియు పునర్ ఉపాధికల్పన చట్టం, 2013 (చట్టం నం.30 2013) ప్రకారం పరిహారం అందించబడుతుంది.

షెడ్యూల్ :

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లాలో "గుంటూరు మరియు బీబీనగర్‌స్టేషన్ల మధ్య రెండవ రైల్వే లైన్ "అనే ప్రత్యేక రైల్వే ప్రాజెక్ట్ కోసం నిర్మాణంతో లేదా నిర్మాణం లేకుండా సేకరించాల్సిన భూమి యొక్క సంక్షిప్త వివరణ

క్రమ సం.	జిల్లా పేరు	మండలం పేరు	గ్రామం పేరు	క్రమ సం.	సర్వే నెంబరు	విస్తీర్ణం ఎకరం సెంట్లలో	విస్తీర్ణం హెక్టార్లలో
1	2	3	4	5	6	7	8
1	పల్నాడు	పిడుగురాళ్ళ	కోనంకి	1	81	0.36	0.146
				2	376	1.07	0.433
				3	377	1.01	0.409
				4	378	0.89	0.360
				5	679	0.09	0.036
				6	670	1.03	0.417
				7	279/17/ఎ	0.02	0.008
				8	671	1.53	0.619
				9	279/16	0.04	0.016
				10	672	0.83	0.336
				11	673	0.70	0.283
				12	674	0.64	0.259
				13	280/34బి	0.01	0.004
				14	280/42బి	0.08	0.032
				15	675	0.55	0.223
				16	280/43బి	0.02	0.008
				17	676	0.83	0.336
				18	280/7బి	0.29	0.117
				19	677	0.41	0.166
				20	280/3బి	0.09	0.036
				21	678	0.69	0.279
				ఉప-మొత్తం		**11.18**	**4.526**
2	పల్నాడు	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	1	44/బి	0.41	0.166
				2	936	0.01	0.004
				3	130/10/బి	0.16	0.065
				4	937	0.02	0.008
				5	130/12/బి	0.06	0.024
				6	938	0.36	0.146
				7	939	0.50	0.202
				8	940	1.35	0.547
				9	130/37/బి	0.63	0.255
				10	941	1.15	0.466
				11	130/39	1.90	0.769
				12	130/35/బి	0.09	0.036
				13	942	0.13	0.053
				14	130/30/బి	0.53	0.215
				15	130/40	0.49	0.198
				16	130/41	0.95	0.385
				17	131/బి	0.42	0.170
				18	132/బి	0.16	0.065
				19	134	0.51	0.206
				20	133	0.93	0.377
				21	155	0.58	0.235
				22	945	0.73	0.296
				23	171	0.20	0.081
				24	170	0.37	0.150
				25	946	1.49	0.603
				26	166	0.65	0.263
				27	165/బి	0.08	0.032
				28	188-ఎ	1.23	0.498
				29	188/బి	0.47	0.190
				30	213	0.10	0.040
				31	214	0.29	0.117
				32	218/బి	0.32	0.130
				33	221	0.07	0.028
				34	222	0.12	0.049
				35	234/2/బి	0.13	0.053
				36	948	0.21	0.085
				37	949	0.51	0.206
				38	950	0.16	0.065
				39	233/బి	0.17	0.069
				40	231/బి	0.04	0.016
				41	247/బి	0.03	0.012
				42	246/బి	0.03	0.012
				43	259/బి	0.13	0.053
				44	953	0.42	0.170
				45	295/ఎ	0.06	0.024
				46	954	0.67	0.271
				47	955	0.54	0.219
				48	956	0.71	0.287
				49	301/ఎ	0.03	0.012
				50	404	0.01	0.004
				51	957	0.58	0.235
				52	958	1.23	0.498
				53	959	0.03	0.012
				54	892/31/ఎ	0.09	0.036
				55	1092	0.01	0.004
				56	892-31-బి	0.33	0.134
				57	1094	0.25	0.101
				58	1095	0.32	0.130
				59	892/49/ఎ2	0.02	0.008
				60	1096	0.08	0.032
				61	966	0.07	0.028
				62	1098	0.21	0.085
				63	967	0.08	0.032
				64	1099	0.24	0.097
				65	1001	0.80	0.324
				66	968	0.08	0.032
				67	1100	0.22	0.089
				68	969	0.12	0.049
				69	943	0.05	0.020
				70	892/6	0.10	0.040
				71	1064	1.06	0.429
				ఉప-మొత్తం		**27.28**	**11.044**
3	పల్నాడు	పిడుగురాళ్ళ	కామేపల్లి	1	182	1.17	0.474
				2	199	0.32	0.130
				3	187	0.33	0.134
				4	198	1.46	0.591
				5	197	0.33	0.134
				6	195	0.29	0.117
				7	204/1	0.11	0.045
				8	204/5	0.17	0.069
				9	205	1.23	0.498
				10	206	0.31	0.126
				11	209	0.59	0.239
				ఉప-మొత్తం		**6.31**	**2.555**
4	పల్నాడు	పిడుగురాళ్ళ	కరాలపాడు	1	243	0.14	0.057
				2	238	0.33	0.134
				3	237	1.19	0.482
				4	236	0.07	0.028
				5	207	0.07	0.028
				6	208	0.22	0.089
				ఉప-మొత్తం		**2.02**	**0.818**
5	పల్నాడు	పిడుగురాళ్ళ	తుమ్మల చెరువు	1	1051	0.42	0.170
				2	1052	1.03	0.416
				3	677/ఎ	0.08	0.032
				4	679/1ఎ	0.04	0.016
				5	679/2ఎ	0.25	0.101
				6	680/ఎ	0.48	0.194
				7	1053	0.89	0.359
				8	682/ఎ	0.93	0.375
				9	576/ఎ	0.16	0.065
				10	1054	0.50	0.202
				11	576/బి	0.53	0.214
				12	577/బి	0.71	0.287
				13	580/బి	1.06	0.428
				14	572	0.18	0.073
				15	581/బి	0.05	0.020
				16	571	0.05	0.020
				17	542/బి	1.37	0.553
				18	545/బి	0.69	0.279
				19	546/బి	1.25	0.505
				20	547/బి	0.10	0.040
				21	550	1.10	0.444
				22	499	0.01	0.004
				23	500/బి	1.26	0.509
				24	1061	0.04	0.016
				25	487/బి	0.10	0.040
				26	488	0.55	0.222
				27	1062	0.21	0.085
				28	485/బి	1.70	0.686
				29	490	0.01	0.004
				30	491	0.02	0.008
				31	470	0.09	0.036
				32	92	0.13	0.052
				33	471	0.70	0.283
				34	472/ఎ	0.06	0.024
				35	472/బి	0.97	0.392
				36	458/1బి	1.39	0.561
				37	419	2.40	0.969
				38	362	0.01	0.004
				39	363	0.22	0.089
				40	364	0.07	0.028
				41	365	0.02	0.008
				42	452	0.02	0.008
				43	418/బి	0.07	0.028
				44	420	2.49	1.005
				45	443	0.11	0.044
				46	421	0.08	0.032
				47	442/2	0.04	0.016
				48	422	0.13	0.052
				49	425	0.06	0.024
				50	426/బి	0.03	0.012
				51	427-బి	0.03	0.012
				52	438	0.03	0.012
				53	435	2.48	1.001
				54	437	0.02	0.008
				55	434	0.07	0.028
				ఉప-మొత్తం		**27.49**	**11.098**
6	పల్నాడు	దాచేపల్లి	పెదగార్లపాడు	1	2	0.06	0.024
				2	8	0.31	0.126
				3	7	0.02	0.008
				4	11	0.12	0.049
				5	12	0.06	0.024
				6	13	0.03	0.012
				ఉప-మొత్తం		0.60	0.243
7	పల్నాడు	దాచేపల్లి	నడికుడి	1	236/3	0.35	0.142
				2	224/1	3.34	1.352
				3	225/1	2.24	0.907
				4	220	0.51	0.206
				5	218/16	0.98	0.397
				6	218/17	0.20	0.081
				7	218/19	0.26	0.105
				8	218/18	3.16	1.279
				9	218/14	0.45	0.182
				10	218/20	0.34	0.138
				11	217/2	0.43	0.174
				12	215	0.09	0.036
				13	216/1	0.08	0.032
				14	216/2	0.02	0.008
				15	216/3	0.19	0.077
				16	213	0.87	0.352
				17	65/5ఎ	2.21	0.895
				18	65/6ఎ	0.80	0.324
				19	733	0.93	0.377
				20	65/7ఎ	0.18	0.073
				21	65/7బి	0.93	0.377
				22	732	1.14	0.462
				23	65/12	0.46	0.186
				24	731	0.92	0.372
				25	66/2బి	5.40	2.186
				26	730	0.80	0.324
				27	729	0.79	0.320
				28	728	0.69	0.279
				29	726	0.50	0.202
				30	707/బి	0.11	0.045
				31	725	1.87	0.757
				32	724	1.40	0.567
				33	637	0.45	0.182
				34	635	0.04	0.016
				35	256	0.05	0.020
				36	255	0.04	0.016
				37	251	0.06	0.024
				38	252	0.46	0.186
				39	247	1.55	0.628
				40	245	3.07	1.243
				41	233	2.26	0.915
				42	236/1	2.17	0.879
				43	237/3	0.28	0.113
				44	224/2	0.22	0.089
				45	236/2	0.95	0.385
				46	207	0.05	0.020
				47	208	0.05	0.020
				48	166	0.91	0.368
				49	165	0.03	0.012
				50	164	0.71	0.287
				51	163	0.63	0.255
				52	162	0.29	0.117
				53	152	0.06	0.024
				54	158	0.97	0.393
				55	155	0.24	0.097
				56	157	0.17	0.069
				57	122	0.17	0.069
				58	121-బి	0.10	0.040
				59	119	0.11	0.045
				60	118-బి	0.10	0.040
				ఉప-మొత్తం		**48.83**	**19.769**
8	పల్నాడు	దాచేపల్లి	గామాలపాడు	1	465	0.25	0.100
				2	464	0.31	0.123
				3	463	0.24	0.096
				4	195	0.13	0.053
				5	194	0.32	0.128
				6	197	0.76	0.306
				7	198-బి,సి	0.41	0.166
				8	199-ఎ,బి	0.40	0.164
				9	211	0.00	0.002
				10	210	0.95	0.386
				11	209	0.82	0.332
				12	196	0.31	0.124
				13	207	0.21	0.083
				14	208	0.10	0.040
				15	167	0.30	0.122
				16	166	0.21	0.083
				17	145-2	0.30	0.121
				18	165	0.56	0.227
				19	164	0.24	0.097
				20	163	0.25	0.101
				21	162	0.15	0.061
				22	152	0.20	0.082
				23	158	0.24	0.099
				24	157-2	0.12	0.049
				25	156-1	0.21	0.085
				26	155	0.20	0.081
				27	154	0.31	0.124
				28	151	0.11	0.043
				29	144	0.21	0.085
				30	123-3	0.28	0.113
				31	122	0.32	0.130
				32	121-బి	0.26	0.103
				33	120-2	0.42	0.171
				34	119-2	0.31	0.126
				35	118-బి	0.30	0.121
				ఉప-మొత్తం		**10.69**	**4.328**
9	పల్నాడు	దాచేపల్లి	రామాపురం	1	5	0.54	0.219
				2	4	0.32	0.130
				3	12	0.28	0.113
				4	13	0.47	0.191
				5	20	0.37	0.148
				6	19	0.55	0.223
				7	27	1.83	0.739
				ఉప-మొత్తం		**4.36**	**1.764**
10	పల్నాడు	దాచేపల్లి	పొందుగుల	1	571/2	5.98	2.422
				2	775/1	0.50	0.202
				3	776	0.63	0.253
				4	777	0.58	0.236
				5	778	0.43	0.174
				6	788	0.27	0.111
				7	787	0.48	0.195
				8	791	0.39	0.159
				9	811	0.02	0.007
				10	810	0.69	0.277
				11	806	0.45	0.182
				12	809	0.55	0.223
				13	808	0.11	0.043
				14	829	0.16	0.063
				15	828	0.03	0.011
				16	247	2.31	0.937
				17	753/5	2.99	1.209
				18	245	0.02	0.008
				19	242	1.40	0.565
				20	243	0.98	0.397
				21	210	0.28	0.114
				22	239	1.21	0.491
				23	211	0.57	0.229
				24	212	1.35	0.545
				25	213	0.21	0.085
				26	214	1.68	0.678
				27	218/ఎ	1.53	0.620
				28	218/బి	0.16	0.063
				29	179	0.26	0.104
				30	54	0.07	0.028
				31	71	0.02	0.007
				32	84	0.01	0.002
				33	70	0.31	0.123
				34	86	0.05	0.021
				35	87	0.03	0.011
				36	88	0.12	0.050
				37	89	0.36	0.145
				38	90	0.21	0.083
				ఉప-మొత్తం		**27.36**	**11.075**
			వెరసి మొత్తం			**166.12**	**67.220**

ప్రదేశం : గురజాల
తేది : 11.09.2024

సం/- జి.వి. రమణకాంత్ రెడ్డి,.
కాంపిటెంట్ అథారిటీ (ఎల్.ఎ) & రెవిన్యూ డివిజనల్ అధికారి
గురజాల, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం

రైళ్లలో ఆహారం సరఫరాకు క్లౌడ్ కిచెన్లు

ముంబై, సెప్టెంబరు 11: రైళ్లలో అందించే ఆహార నాణ్యతపై తరచూ ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో రైల్వే ప్రయాణికులకు క్లౌడ్ కిచెన్ల ద్వారా ఆహారాన్ని సరఫరా చేయాలని ఐఆర్‌సీటీసీ నిర్ణయించింది. ప్రస్తుతం రైళ్లలో ఆహార సరఫరా కోసం పెద్ద పెద్ద రైల్వే స్టేషన్ల దగ్గర బేస్ కిచెన్లు ఉన్నాయి. వీటిల్లో వేలాది మంది కోసం ఆహారాన్ని వండి, ప్యాకింగ్ చేసి రైళ్లలో అందజేస్తున్నారు. వీటిని ఐఆర్‌సీటీసీ నిర్వహిస్తోంది. అయితే, బేస్ స్టేషన్లలో పరిశుభ్రత పాటించడం లేదన్న ఆరోపణలున్నాయి. దీంతో, ఐఆర్‌సీటీసీ క్లౌడ్ కిచెన్లపై దృష్టి సారించింది. ఇవి ప్రైవేటు ఆపరేటర్ల నియంత్రణలో ఒప్పందం ప్రకారం నడుస్తాయి. సాధారణంగా ఈ ఒప్పందం ఏడేళ్ల పాటు ఉంటుంది. ప్రైవేటు క్యాటరింగ్ సంస్థలు ఆహారాన్ని వండి రైళ్లలో అందజేయాల్సి ఉంటుంది. క్లౌడ్ కిచెన్ల పరిమాణాలు వేర్వేరుగా ఉంటాయి. సైజును బట్టి కొన్నింటిలో వందల మందికి, మరికొన్నింటిలో మూడు నుంచి నాలుగు వేల మందికి ఆహార పదార్థాలను వండుతారు. క్లౌడ్ కిచెన్ వంటశాలల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి అధికారులు ఎప్పటికప్పుడు పరిశుభ్రతను పర్యవేక్షిస్తారు. పరిశుభ్రత పాటించకపోతే జరిమానా విధిస్తారు. కాంట్రాక్టును రద్దు చేసే అధికారం కూడా రైల్వే అధికారులకు ఉంటుంది. ముంబైలో ఇప్పటికే క్లౌడ్ కిచెన్ సేవలు ప్రారంభమైనట్లు ఐఆర్‌సీటీసీ తెలిపింది. "ముంబైలో 90 క్లౌడ్ కిచెన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఇప్పటికే 50 కిచెన్లను అందుబాటులోకి తెచ్చాం" అని ఐఆర్‌సీటీసీ అధికారి ఒకరు వివరించారు. ముంబైలో క్లౌడ్ కిచెన్ సేవలు అందుబాటులోకి వచ్చాక, ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు తగ్గాయని తెలిపారు. పశ్చిమ జోన్‌లోని మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో దాదాపు 200క్లౌడ్ కిచెన్ల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇవి రెండు, మూడు నెలల్లో అందుబాటులోకి రానున్నాయి.

ఎయిర్‌పోర్టు ఆధునీకరణకు అదానీతో ఒప్పందం వద్దు

▸▸ **కెన్యా వైమానికరంగ సిబ్బంది ఉద్యమం**

నైరోబీ, సెప్టెంబరు 11: కెన్యా రాజధాని నైరోబీలోని జోమో కెన్యెట్టా అంతర్జాతీయ విమానాశ్రయం ఆధునికీకరణ కాంట్రాక్టును అదానీ గ్రూపునకు అప్పగించటానికి వ్యతిరేకంగా ఆ దేశ వైమానిక రంగ ఉద్యోగులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నారు. బుధవారం జోమో కెన్యెట్టా ఎయిర్‌పోర్టులో వందలాదిమంది కార్మికులు, సిబ్బంది నిరసన ప్రదర్శన నిర్వహించారు. కెన్యా వ్యాప్తంగా పలు విమాన సర్వీసులు నిలిచిపోయాయి. జోమో కెన్యెట్టా విమానాశ్రయం ఆధునికీకరణతోపాటు అదనపు రన్‌వే, టెర్మినల్ నిర్మాణం పనులను అదానీ గ్రూపునకు అప్పగించాలని కెన్యా ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. దీనికి గాను విమానాశ్రయం నిర్వహణను 30 ఏళ్ల పాటు అదానీ కంపెనీ చూసుకుంటుంది. అంటే అన్ని సంవత్సరాలపాటు ఆ ఎయిర్‌పోర్టు నుంచి వచ్చే ఆదాయం అంతా అదానీ గ్రూపు సొంతమవుతుంది. ఈ ఒప్పందాన్ని కెన్యా ఎయిర్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ కాంట్రాక్టు వల్ల అనేక మంది కార్మికులు, సిబ్బంది ఉద్యోగాలు కోల్పోతారని బుధవారం సమ్మెకు పిలుపునిచ్చింది.

మళ్లీ పెరిగిన ఎండలు


విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరిగింది. బుధవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. నెల్లూరు, కావలిలో 38.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ తీవ్రతతో వాతావరణ అనిశ్చితి నెలకొని అక్కడక్కడా వర్షాలు కురిశాయి. కాగా మధ్యప్రదేశ్‌లోని ఈశాన్య ప్రాంతంలో ఉన్న తీవ్ర అల్పపీడనం బుధవారం ఉదయం బలపడి వాయుగుండంగా మారింది. ఇది ఉత్తర వాయువ్యంగా పయనిస్తోందని, దీంతో మధ్య, వాయువ్యభారతంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది.

రైలు పట్టాల వద్ద పరికరాలను తొలగించండి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11 : రైల్వే ట్రాక్‌ల వద్ద మిగిలిపోయిన ఇంజనీరింగ్ పరికరాలు, మెటీరియల్‌ను తక్షణమే తొలగించాలని రైల్వే బోర్డు అన్ని రైల్వే జోన్ల అధికారులను ఆదేశించింది. రైలు మార్గాలపై గ్యాస్ సిలిండర్లు, సిమెంటు బ్లాకుల వంటివి ఉంచి రైళ్లను పట్టాలు తప్పించడానికి దుండగులు చేసిన ప్రయత్నాలను దృష్టిలో ఉంచుకుని బోర్డు ఈ ఆదేశాలు ఇచ్చింది. వీటినే దుండగులు సులువుగా రైలు పట్టాలపై పెట్టి ఇబ్బందులు కలిగిస్తున్నారని ఓ రైల్వే అధికారి చెప్పారు. ఇటువంటి పరిస్థితి లేకుండా వాటిని తప్పనిసరిగా తొలగించాలన్నారు. ఇందుకు సెప్టెంబరు 9 నుంచి వారంపాటు సేఫ్టీ డ్రైవ్ నిర్వహించాలని సూచించింది. ఆగస్టు 17న కాన్పూరు వద్ద సబర్మతి ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడానికి ఒక మీటరు పొడవైన రైలు పట్టా ముక్కను ట్రాక్‌పై ఉంచడమే కారణమని ప్రాథమిక విచారణలో తేలిందని రైల్వే అధికారులు వెల్లడించారు.

రూ.1.5 లక్షల కోట్లతో 5 సెమీకండక్టర్ ప్రాజెక్టులు

నాలుగు నెలల్లో సెమీకాన్ 2.0 పాలసీ.. కేంద్ర మంత్రి వైష్ణవ్



సెమీకాన్‌ను సందర్శించిన ప్రధాని

న్యూఢిల్లీ: దేశంలో సెమీ కండక్టర్ల పరిశ్రమ అభివద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలిస్తున్నాయి. ఇందుకోసం ప్రకటించిన 'సెమీకాన్ 1.0' పాలసీ కింద ఇప్పటి వరకు రూ.1.5 లక్షల కోట్ల పెట్టుబడులతో ఐదు సెమీ కండక్టర్ ప్లాంట్ల ఏర్పాటును కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఇందులో రెండు ప్లాంట్ల ఏర్పాటు ఇప్పటికే ప్రారంభమైనట్టు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఢిల్లీలో జరుగుతున్న సెమీకాన్ ఇండియా, 2024 సదస్సులో ఆయన ఈ విషయం వెల్లడించారు. ఇప్పటికే 3-4 రాష్ట్రాలు సెమీ కండక్టర్ ప్లాంట్ల ఏర్పాటు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు తెలిపారు. త్వరలో ఉత్తరప్రదేశ్ కూడా ఈ జాబితాలో చేరనుందన్నారు.

నాలుగు నెలల్లో సెమీకాన్ 2.0 పాలసీ

దేశంలో సెమీకండక్టర్ల కంపెనీల ఏర్పాటు కోసం ప్రకటించిన సెమీకాన్ 1.0 పాలసీ గడువు ఇప్పటికే పూర్తయిందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. మూడు లేదా నాలుగు నెలల్లో కొత్త సెమీకాన్ 2.0 పాలసీ తీసుకువస్తామన్నారు. ఈ పాలసీ ద్వారా దేశంలో సెమీకండక్టర్ల తయారీకి దోహదం చేసే కీలక లోహాలు, రసాయనాలు, గ్యాస్‌ల ఉత్పత్తికి కూడా చర్యలు తీసుకుంటామన్నారు. సెమీకండక్టర్ల వినియోగ కంపెనీలు కూడా దేశంలోనే సెమీకండక్టర్ల సమగ్ర సదుపాయాలు ఏర్పాటు కావాలని కోరుతున్నట్టు చెప్పారు. సెమీకండక్టర్ల తయారీలో 250 ప్రత్యేక రసాయనాలు, గ్యాస్‌లు వినియోగిస్తారనే విషయాన్ని వైష్ణవ్ గుర్తు చేశారు. అత్యంత స్వచ్ఛంగా ఉండే ఈ కీలక రసాయనాలు, గ్యాస్‌ల ఉత్పత్తి ప్రక్రియ అత్యంత క్లిష్టమైందన్నారు.

2030 నాటికి 50,000 కోట్ల డాలర్ల మార్కెట్

అంతకు ముందు ఇదే సదస్సులో ప్రసంగించిన ప్రధాని మోదీ, ప్రస్తుతం 15,000 కోట్ల డాలర్లుగా (సుమారు రూ.12.60 లక్షల కోట్లు) ఉన్న భారత ఎలక్ట్రానిక్స్ మార్కెట్, 2030 నాటికి 50,000 కోట్ల డాలర్ల స్థాయికి ఎదగాలని లక్ష్యంగా పెట్టుకోవాలని కోరారు. అప్పటికి ఈ పరిశ్రమకు అవసరమైన సెమీకండక్టర్ల నుంచి సమస్త విడి భాగాలు భారత్‌లోనే తయారు కావాలన్నారు. యుద్ధాలు, కొవిడ్ వంటి ఉత్పాతాలు ఎదురైనపుడు కీలక ఎలక్ట్రానిక్స్ పరికరాల సరఫరాకు ఎలాంటి ఆటంకాలు ఏర్పడకూడదనుకుంటే, భారత సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ఆయన తైవాన్, అమెరికా, ఇజ్రాయెల్ కంపెనీలను కోరారు. స్మార్ట్‌ఫోన్ల మొదలుకుని విద్యుత్ కార్ల వరకు వినియోగించే సెమీకండక్టర్ల వ్యవస్థ మొత్తం భారత్‌లోనే తయారు కావాలని ప్రధాని కోరారు.

భారత్ బయోటెక్ నుంచి
'ఏవీ0328' వ్యాక్సిన్

హైదరాబాద్: భారత్ బయోటెక్ కంపెనీ మరో సరికొత్త వ్యాక్సిన్ తయారీకి సిద్ధమైంది. యాంటీ బ్యాక్టీరియల్ వ్యాక్సిన్ 'ఏవీ0328' అభివృద్ధి, వాణిజ్య స్థాయిలో ఉత్పత్తి కోసం అమెరికన్ కంపెనీ అలోపెక్స్‌ఇంక్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ వ్యాక్సిన్‌ను మన దేశంతో పాటు నిరుపేద, దిగువ మధ్యాదాయ దేశాల్లో మార్కెట్ చేస్తుంది. ఇందుకు అలోపెక్స్ కంపెనీకి కొంత మొత్తంలో ఏకకాల ఫీజు చెల్లిస్తుంది. దీంతో పాటు అమ్మకాలపై రాయల్టీ, అమ్మకాలు నిర్దిత స్థాయికి చేరినపుడల్లా ప్రత్యేక చెల్లింపులు చేస్తుంది. 'వ్యాక్సినేషన్ ద్వారా యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌ను తగ్గించే పరిష్కారాలను అభివృద్ధి చేయడం మా లక్ష్యం. ఇందుకోసమే 'ఏవీ0328' వ్యాక్సిన్ కోసం అలోపెక్స్ కంపెనీతో చేతులు కలిపాం. ఇందుకు చాలా గర్వంగా ఉంది' అని భారత్ బయోటెక్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ కృష్ణ ఎల్లా ఒక ప్రకటనలో తెలిపారు.

బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఇష్యూ
సూపర్ హిట్
ఇష్యూ సైజు రూ.6,560 కోట్లు, దాఖలైన బిడ్లు రూ.3 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓకు ఇన్వెస్టర్లు బ్రహ్మరథం పట్టారు. బుధవారంతో ముగిసిన ఈ రూ.6,560 కోట్ల ఐపీఓకు ఏకంగా రూ.3 లక్షల కోట్లకు పైగా విలువైన సబ్‌స్క్రిప్షన్ లభించింది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా కంపెనీ 72,75,75,756 షేర్లను అమ్మకానికి పెట్టగా.. అందుకు 63.60 రెట్లు (4,627 కోట్ల 48 లక్షల 43 వేల 832) షేర్ల కొనుగోలుకు బిడ్లు వచ్చాయని ఎన్ఎస్ఈ డేటా వెల్లడించింది. అర్హులైన సంస్థాగత కొనుగోలుదారుల (క్యూఐబీ) కోసం కేటాయించిన షేర్లకుగాను ఏకంగా 209.36 రెట్లు బిడ్లు దాఖలు కాగా.. సంస్థాగతేతర ఇన్వెస్టర్ల విభాగ షేర్లకు 41.50 రెట్లు సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. రిటైల్ ఇన్వెస్టర్ల కోసం కేటాయించిన షేర్లకు మాత్రం 7.02 రెట్లు బిడ్లు వచ్చాయి. కాగా వాహన విడిభాగాల తయారీ సంస్థ క్రాస్ లిమిటెడ్ ఐపీఓకు సైతం నాటికి 16.81 రెట్లు సబ్‌స్క్రిప్షన్ లభించింది. టోలిన్స్ టైర్స్ ఇష్యూకు కూడా 23.87 రెట్లు బిడ్లు వచ్చాయి.

లాభాల స్వీకారంతో మార్కెట్ డౌన్

చైనా ఆర్థిక మందగమన ఆందోళనలతోపాటు అమెరికా ధరల గణాంకాల విడుదల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో ట్రేడింగ్ ట్రెండ్ బలహీనంగా ఉండటంతో దేశీయ మార్కెట్లోనూ ఇన్వెస్టర్లు అమ్మకాలకు పాల్పడ్డారు. టాటా మోటార్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్ అండ్ టీ షేర్లలో భారీగా లాభాలు స్వీకరించడంతో ఈక్విటీ సూచీలు ఇంట్రాడే లాభాలను కోల్పోయి నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 398.13 పాయింట్లు క్షీణించి 81,523.16 వద్దకు జారుకుంది. నిఫ్టీ 122.65 పాయింట్ల నష్టంతో 24,918.45 వద్ద క్లోజైంది. దాంతో సూచీ మళ్లీ 25,000 కీలక స్థాయిని కోల్పోయింది. టాటా మోటార్స్ షేరు ఏకంగా 5.74 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,250 ▲	67,150 ▲	91,500 ▲
ముంబై	71,990 ▲	65,950 ▲	83,400 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	530
వరంగల్	497	గోదావరి	525
చిత్తూరు	553	విశాఖపట్నం	535
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	118
వరంగల్	107	గుంటూరు	120
కరీంనగర్	107	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	116
కర్నూలు	107	నెల్లూరు	116
విశాఖపట్నం	104	అనంతపురం	116
గోదావరి	118		

ఎంజీ కొత్త కారు విండ్సర్

ప్రారంభ ధర రూ.9.99 లక్షలు



న్యూఢిల్లీ: జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్.. 'విండ్సర్ ఈవీ' పేరుతో సరికొత్త ఎలక్ట్రిక్ కారును బుధవారం మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఇది హ్యాచ్‌బాక్, మల్టీ యుటిలిటీ వెహికిల్ (ఎంయూవీ) ఫీచర్లతో కూడిన తొలి ఎలక్ట్రిక్ 'క్రాసోవర్ యుటిలిటీ వెహికిల్' (ఈ-సీయూవీ) అని కంపెనీ తెలిపింది. మొత్తం మూడు వేరియంట్లలో (ఎక్సైట్, ఎక్స్‌క్లూజివ్, ఎస్సెన్స్) లభించనున్న ఈ కారు ప్రారంభ ధర రూ.9.99 లక్షలు. అయితే, ఇది బ్యాటరీ రహిత ధర. వాహన ఇండస్ట్రీలో తొలిసారిగా కంపెనీ ఈ కారు బ్యాటరీని అద్దెకు (బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్) ఇస్తోంది. ఈ బ్యాటరీ ప్యాక్‌కు కిలోమీటరుకు రూ.3.5 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఎంజీ యాప్ ఈ-హబ్ ద్వారా ఏడాదిపాటు పబ్లిక్ చార్జర్ల వద్ద ఉచితంగా చార్జింగ్ చేసుకునే సౌకర్యం కల్పిస్తోంది. అంతేకాదు, కారు మొదటి యజమానికి జీవితకాలం బ్యాటరీ వారంటీని అందిస్తున్నట్టు సంస్థ తెలిపింది. మూడేళ్లు లేదా 45,000 కి.మీ తర్వాత 60 శాతం బైబ్యాక్ సదుపాయం కూడా కల్పిస్తున్నట్టు కంపెనీ ప్రకటించింది. విండ్సర్ ప్రీ-బుకింగ్‌లు తక్షణమే ప్రారంభయ్యాయి. ఈనెల 25 నుంచి టెస్ట్ డ్రైవ్ కోసం ఈ వాహనాన్ని షోరూముల్లో అందుబాటులో ఉంచనున్నారు. వచ్చే నెల 3 నుంచి అధికారిక బుకింగ్ ప్రారంభం కానుంది. దసరా నుంచి డెలివరీని ప్రారంభించే అవకాశం ఉంది. 38 కిలోవాట్ లిథియం అయాన్ బ్యాటరీతో కూడిన ఈ కారు పూర్తి చార్జింగ్‌తో 331 కి.మీ వరకు ప్రయాణించగలదని కంపెనీ వెల్లడించింది. ఏదైనా డీసీ ఫాస్ట్ చార్జర్‌తో 40 నిమిషాల్లో బ్యాటరీని పూర్తిగా చార్జ్ చేయవచ్చు.

కారు ప్రధాన ఫీచర్లు

- 2,700 ఎంఎం వీల్‌బేస్, 1,850 ఎంఎం విడ్త్, 1,677 ఎంఎం ఎత్తు
- 15.6 అంగుళాల గ్రాండ్ వ్యూ టచ్‌స్ర్కీన్ విత్ వైర్‌లెస్ కనెక్టివిటీ
- 135 డిగ్రీస్ రిక్లైనింగ్ ఏరో లాంజ్ సీట్స్, ఆటోమెటిక్ క్లైమేట్ కంట్రోల్
- ఇన్ఫినిటీ వ్యూ పనోరమిక్ గ్లాస్ రూఫ్, 604 లీటర్ల బూట్ స్పేస్
- 360 డిగ్రీస్ కెమెరా, యాంబియెంట్ లైటింగ్, 4 ఎయిర్ బ్యాగ్‌లు
- ఫుల్లీ డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, ఫ్లష్ ఫిట్టింగ్ డోర్ హ్యాండిల్స్

నాణ్యతతోనే ఉత్పత్తులకు మనుగడ
పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సరైన నాణ్యతా ప్రమాణాలు ఉన్నపుడే ఏ ఉత్పత్తి అయినా మార్కెట్‌లో మనగలుగుతుందని తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి డీ శ్రీధర్ బాబు అన్నారు. క్వాలిటీ కౌన్సిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూఐసీ), హైదరాబాద్ చాప్టర్ 38వ వార్షిక కన్వెన్షన్‌ను ప్రారంభిస్తూ ఆయన ఈ విషయం చెప్పారు. ఉత్పత్తి దశ నుంచే సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించేందుకు వీలుగా కంపెనీలు ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని కోరారు. మహాత్మా గాంధీ చెప్పినట్టు కంపెనీలకు 'వినియోగదారుడే రాజు' అన్నారు. తాను కొనే ఉత్పత్తి సరైన నాణ్యతా ప్రమాణాలతో ఉన్నపుడే వినియోగదారుడు సంతృప్తి పడతాడనే విషయాన్ని కంపెనీలు గుర్తుంచుకోవాలన్నారు.

సంగం డెయిరీ లాభం రూ.12 కోట్లు




పొన్నూరుటౌన్ (చేబ్రోలు): సంగం డెయిరీ 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1877 కోట్ల టర్నోవర్ సాధించినట్లు కంపెనీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ తెలిపారు. బుధవారం సంగం డెయిరీ పాలకవర్గ సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రైతులకు బోనస్ చెల్లించిన తర్వాత డెయిరీ లాభం రూ.12 కోట్లని చెప్పారు. రానున్న రోజుల్లో అనంతపురం సహా ఐదు చోట్ల బల్క్ మిల్క్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇటీవలే తెలంగాణలో ప్లాంట్‌ను లాంఛనంగా ప్రారంభించామని త్వరలోనే తెలంగాణలో కార్యకలాపాలు ప్రారంభించనునట్లు చెప్పారు. వరద బాధితుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 లక్షలు విరాళంగా ఇవ్వాలని కూడా తీర్మానించినట్లు చెప్పారు. వరదలో నష్టపోయిన సంగం పాల ఉత్పత్తిదారులకు 70 మెట్రిక్ టన్నుల పశు దాణాని ఉచితంగా పంపిణీ చేసినట్లు చెప్పారు.



'పెట్ ఫుడ్స్'లోకి గ్రోవెల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అక్వా ఫీడ్, అక్వా హెల్త్‌కేర్, సీఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో ఉన్న గ్రోవెల్ గ్రూపు 'కార్నివెల్' పేరుతో పెంపుడు జంతువుల ఆహార (పెట్ ఫుడ్) రంగంలోకి ప్రవేశించింది. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్‌లోని సింగరాయపాలెం వద్ద ఉన్న తన అక్వా ఫీడ్ ప్లాంట్ దగ్గరే రూ.100 కోట్ల పెట్టుబడితో ప్రత్యేక ప్లాంటు ఏర్పాటు చేసింది. పెంపుడు కుక్కలు, పిల్లుల కోసం ప్రస్తుతం ఆరు రకాల పెట్ ఫుడ్స్‌ను మార్కెట్‌లో విడుదల చేసినట్టు గ్రోవెల్ పెట్ న్యూట్రిషన్ బిజినెస్ హెడ్ జేఎస్ రామకృష్ణ చెప్పారు. 2028 నాటికి ఈ మార్కెట్‌లో కనీసం ఎనిమిది శాతం వాటా సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ప్రధాన పెట్ ఫుడ్ బ్రాండ్లతో పోలిస్తే తమ పెట్ ఫుడ్స్ ధర 50 శాతం తక్కువగా ఉంటుందన్నారు. ప్రజల ఆహార అలవాట్లను దృష్టిలో ఉంచుకుని తమ కంపెనీ పెట్ ఫుడ్స్‌ని కూడా వెజ్, నాన్-వెజ్ వేరియంట్లలో మార్కెట్‌లో విడుదల చేసినట్టు రామకృష్ణ తెలిపారు.

కాసుల సునామీ
రూ.11,637 కోట్లు
వన్డే వరల్డ్ కప్‌తో ఆదాయం



న్యూఢిల్లీ: గత ఏడాది వన్డే వరల్డ్ కప్‌ను భారత్ విజయవంతంగా నిర్వహించింది. నిరుడు అక్టోబరు ఐదు నుంచి నవంబరు 19 వరకు దేశంలోని 10 కేంద్రాలలో జరిగిన ఈ మెగా టోర్నీకి రికార్డు స్థాయిలో 12.50 లక్షల మంది హాజరయ్యారు. టోర్నీ ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు దండిగా ఆదాయం లభించింది. ఏకంగా రూ. 11,637 కోట్లు భారత ఆర్థిక వ్యవస్థకు సమకూరినట్టు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బుధవారం వెల్లడించింది. ఈమేరకు మెగా టోర్నమెంట్‌కు సంబంధించిన సమగ్ర ఆర్థిక నివేదికను వెలువరించింది. టోర్నమెంట్ నిర్వహణకు బీసీసీఐ, ఐసీసీ పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించాయి. ముఖ్యంగా..మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన వేదికల క్రికెట్ సంఘాలు మైదానాలలో ఆధునిక వసతుల కల్పనకు భారీగా ఖర్చు చేశాయి. స్టేడియాల ఆధునికీకరణ వల్ల దేశంలోని ఎన్నో పరిశ్రమలకు నేరుగా లబ్ధి చేకూరింది. 'ఐసీసీ 2023 పురుషుల వన్డే ప్రపంచ కప్ క్రికెట్ ఆర్థిక సత్తా ఎలాంటిదో తెలియజేసింది. ఈ టోర్నీ వేలాది ఉద్యోగాలను సృష్టించింది. భారత్‌ను పర్యాటక స్వర్గధామంగా నిరూపించింది. ఐసీసీ ఈవెంట్లు క్రికెట్ ఫ్యాన్స్‌ను అలరించడమేకాదు ఆతిథ్య దేశాల ఆర్థిక వ్యవస్థలకు ఊతంగా నిలుస్తాయని స్పష్టమైంది' అని ఐసీసీ సీఈవో జెఫ్ అలర్డైస్ పేర్కొన్నారు. వన్డే వరల్డ్ కప్‌వల్ల ప్రధానంగా లాభపడింది పర్యాటక రంగం. ఈ ఒక్క రంగమే ఏకంగా రూ. 7200 కోట్లకుపైగా ఆర్జించింది. వసతి, రవాణా, ఆహార పానీయాల రంగాల ద్వారా రూ. 4,300 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. టోర్నీకి హాజరైన 12.50 లక్షల మందిలో 75 శాతం మంది తొలిసారి వన్డే ప్రపంచ కప్‌నకు తరలి రావడం గమనార్హం. ఇది 50 ఓవర్ల ఫార్మాట్‌కు పెరుగుతున్న ఆదరణగా ఐసీసీ పేర్కొంది. టోర్నమెంట్‌కు వీక్షణకు విచ్చేసిన అంతర్జాతీయ ప్రయాణికుల్లో అధికులు దేశంలోని పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. వీరివల్ల ఆర్థిక వ్యవస్థకు రూ. 2,300 కోట్ల అదనపు ఆదాయం లభించింది. ఇక.టోర్నమెంట్ 48 వేల మందికి ఫుల్, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు కల్పించింది.

మూడోరోజూ టాస్ పడలేదు
అఫ్ఘాన్, కివీస్ టెస్టు మ్యాచ్ రద్దయ్యే చాన్స్

గ్రేటర్ నొయిడా: అఫ్ఘానిస్థాన్-న్యూజిలాండ్ జట్ల మధ్య టెస్టు మ్యాచ్ రద్దయ్యే అవకాశముందా? అంటే.. పరిణామాలు చూస్తుంటే అవుననే అనిపిస్తోంది. మూడో రోజు కూడా ఆట మొదలవలేదు. మంగళవారం రాత్రి వర్షం పడడంతో మూడో రోజైన బుధవారం కూడా కనీసం టాస్ పడకుండానే ఆట రద్దయింది. బుధవారం వర్షం లేకున్నా, మ్యాచ్‌కు వేదికైన గ్రేటర్ నొయిడా పిచ్ ఇంకా తడిగానే ఉంది. వాస్తవానికి షెడ్యూల్ ప్రకారం సోమవారమే మ్యాచ్ ప్రారంభమవ్వాలి. అయితే, వారం రోజుల క్రితం ఇక్కడ కురిసిన భారీ వర్షాల కారణంగా అవుట్‌ఫీల్డ్ మొత్తం చిత్తడిగా మారింది. నీరు బయటకు వెళ్లేందుకు ఈ మైదానంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడమే ఇందుకు కారణం. దీంతో తొలి రెండు రోజులు కనీసం టాస్ కూడా వేయకుండానే ఆట రద్దయింది. వరుసగా మూడోరోజు కూడా అదే పరిస్థితి తలెత్తింది. మరో రెండురోజులు నొయిడాలో భారీ వర్షాలు పడే చాన్సుండడంతో టెస్టు మ్యాచ్ మొదలవడంపై సందేహాలు నెలకొన్నాయి. దాదాపు మ్యాచ్ రద్దయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.


రాజ్‌కుమార్

రాజ్‌కుమార్ హ్యాట్రిక్
సెమీస్‌లో భారత్
మలేసియాపై భారీ విజయం
ఆసియా చాంపియన్స్ ట్రోఫీ

హులున్‌బ్యూయిర్ (చైనా): డిఫెండింగ్ చాంపియన్ భారత్ ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో జోరు కొనసాగిస్తూ సెమీఫైనల్‌కు దూసుకుపోయింది. యువ స్ట్రయికర్ రాజ్‌కుమార్ హ్యాట్రిక్‌తో అదరగొట్టడంతో..బుధవారం జరిగిన మ్యాచ్‌లో మనోళ్లు 8-1తో మలేసియాను చిత్తు చేశారు. రాజ్‌కుమార్ (3, 25, 33 నిమిషాలు)తోపాటు అరైజీత్ సింగ్ (6, 39ని.), జుగ్‌రాజ్ సింగ్ (7వ), హర్మన్‌ప్రీత్ సింగ్ (22వ), ఉత్తమ్ సింగ్ (40వ) గోల్స్ సాధించారు. మలేసియా తరపున ఏకైక గోల్‌ను అఖీముల్లా (34వ) చేశాడు. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ విజయం అందుకున్న భారత్ తొమ్మిది పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. మొత్తం ఆరు జట్లు రౌండ్ రాబిన్ లీగ్‌లో తలపడుతున్నాయి. తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు ఈనెల 16న జరిగే సెమీస్‌లో ఢీకొంటాయి. 17న ఫైనల్ జరుగుతుంది. గత మ్యాచ్‌ల్లో చైనా, జపాన్‌పై గెలుపొందిన భారత్..గురువారం కొరియాతో, శనివారం పాకిస్థాన్‌తో ఆడుతుంది.

అదంతా ఫొటో షో!

- ఉష రాజకీయం
- ఐవోఏ 'చీఫ్' ట్రిక్స్
- దుయ్యబట్టిన ఫొగట్



న్యూఢిల్లీ: భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ) అధ్యక్షురాలు పీటీ ఉషపై రెజ్లర్ వినేశ్ ఫొగట్ మండిపడింది. పారిస్ ఒలింపిక్స్‌లో ఉష రాజకీయాలు చేసిందని ఆరోపణలు చేసింది. ఆమె తనకు అండగా నిలవలేదని.. కేవలం ఫొటోకు ఫోజులిచ్చిందని విమర్శించింది. ఇటీవలే జరిగిన ఒలింపిక్స్ రెజ్లింగ్ 50 కిలోల విభాగంలో ఫొగట్ ఫైనల్ చేరినా.. 100 గ్రాములు అధిక బరువు ఉందనే కారణంతో ఆమెపై అనర్హత వేటు పడిన సంగతి తెలిసిందే. తనకు కనీసం రజతమైనా ఇవ్వాలని వినేశ్ చేసిన అప్పీలును క్రీడా మధ్యవర్తిత్వ కోర్టు (కాస్) కొట్టేసింది. అయితే, బరువు తగ్గే ప్రక్రియలో ఆమె నీరసించడంతో క్రీడాగ్రామంలో ఆసుపత్రిలో చేర్చారు. ఫొగట్‌ను ఉష పరామర్శించగా.. ఆ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. అయితే, రాజకీయాల్లో భాగంగానే ఉష ఆ ఫొటోను పోస్టు చేసిందని ఓ ఇంటర్వ్యూలో వినేశ్ దుయ్యబట్టింది. 'ఆసుపత్రిలో బెడ్‌పై ఉన్నప్పుడు ఉష నన్ను పరామర్శించింది. అప్పుడు ఒక ఫొటో తీసుకొన్నారు. రాజకీయాల్లో మూసిన తలుపుల వెనుక ఎన్నో జరుగుతాయి. పారిస్‌లో కూడా జరిగింది అలాంటిదే. అందుకే నా హృదయం ముక్కలైంది. నా రిటైర్మెంట్ నిర్ణయాన్ని పునః సమీక్షించుకోవాలంటూ ఎంతో మంది కోరారు. కానీ, నేనెందుకు కొనసాగాలి? రాజకీయాలనేవి ప్రతిచోటా ఉన్నాయ'ని వినేశ్ ఆవేదన వ్యక్తం చేసింది. అసలు ఫొటో తీసుకున్నట్టే తనకు తెలియదని తెలిపింది. 'నాకు మద్దతుగా ఉన్నామనే విధంగా షో చేసేందుకు వచ్చి ఫొటో దిగారు. అందుకు నా అనుమతి కూడా తీసుకోలేదు. సోషల్ మీడియాలో మాత్రం ఎంతో ప్రచారం చేసుకొన్నారు. వాళ్లు చేసిందంతా షో తప్ప ఏమీలేద'ని ఆమె ఘాటుగా విమర్శించింది. హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో జులానా నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున వినేశ్ బుధవారం నామినేషన్ దాఖలు చేసింది.

దృష్టంతా రింకూ, అయ్యర్‌పైనే
- దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ నేటినుంచి



అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి): దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ మ్యాచ్‌లు గురువారం నుంచి పూర్తిగా అనంతపురంలో జరగనున్నాయి. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ స్టేడియంలో ఇండియా-ఎతో ఇండియా-డి తలపడనుండగా.. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ స్టేడియం-బిలో ఇండియా-బితో ఇండియా-సి ఆడనుంది. తొలి రౌండ్‌లో స్టార్ ఆటగాళ్లతో కళకళలాడినా.. బంగ్లాదేశ్‌తో టెస్ట్ సిరీస్ నేపథ్యంలో టీమిండియాకు ఎంపికైన వారిని ఆయా జట్లు రిలీజ్ చేశాయి. దీంతో జాతీయ జట్టులో చోటు దక్కించుకోలేక పోయిన రింకూ సింగ్ లాంటి ప్లేయర్లు టోర్నీకి ప్రత్యేక ఆకర్షణగా మారారు. బంగ్లాతో టెస్ట్‌కు ఎంపికైన వారిలో సర్ఫరాజ్ ఒక్కడే ఈ దేశవాళీ లీగ్‌లో ఆడనున్నాడు. గిల్ కూడా వెళ్లిపోవడంతో ఆ స్థానంలో మయాంక్ అగర్వాల్ ఇండియా-ఎ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. మళ్లీ భారత జట్టులోకి రావాలనుకొంటున్న ఇండియా-డి కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్, రజత్ పటీదార్, పేసర్ నవ్‌దీప్ సైనీ, కేఎస్ భరత్‌లు అదిరే ప్రదర్శనతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించడానికి ఇదో సువర్ణావకాశం.

అండర్-18కు ఉచిత ప్రవేశం!
- టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్ టికెట్ రూ. 114

దుబాయ్: యూఏఈలో జరగనున్న మహిళల టీ20 వరల్డ్ కప్ టిక్కెట్ల ధరలను భారీగా తగ్గించడంతోపాటు పద్దెనిమిదేళ్ల లోపు వారికి ఉచిత ప్రవేశం కల్పించనున్నారు. మ్యాచ్ టిక్కెట్ ధర కేవలం రూ. 114 (5 దినార్లు)గా నిర్ణయించినట్టు నిర్వాహకులు ప్రకటించారు.

ముంబైతో ప్రయాణం ముగిసినట్టే!



న్యూఢిల్లీ: ఐపీఎల్ మెగా వేలానికి సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో రోహిత్ శర్మ భవితవ్యం గురించిన చర్చే ఎక్కువగా జరుగుతోంది. గత సీజన్‌లో ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా హిట్‌మ్యాన్‌ను తప్పించి హార్దిక్ పాండ్యాకు జట్టు పగ్గాలప్పగించారు. అప్పటి నుంచి రోహిత్ ఫ్రాంచైజీ మారతాడనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో శర్మ జట్టు మారడం దాదాపుగా ఖాయమని భారత మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా ఓ యూట్యూబ్ చానెల్‌కు చెప్పాడు. 'ముంబై మాత్రం అతడిని అట్టిపెట్టుకోదని అనుకొంటున్నా. శర్మ కూడా వీడాలనే అభిప్రాయంతో ఉన్నాడు. అయితే, అతడు వేలానికి రాకుండా.. మరో ఫ్రాంచైజీకి ట్రేడ్ చేసే అవకాశం ఉంద'ని చోప్రా తెలిపాడు. ముంబైతో అతడి సుదీర్ఘ ప్రయాణం ముగిసిందనైతే చెప్పగలనన్నాడు. సూర్యకుమార్ కూడా ఎంఐను వీడతాడనే ఊహాగానాలు వినవస్తున్నాయి. కానీ, కెరీర్‌లో ఈ దశలో సూర్య ముంబైను వీడతాడని తానైతే భావించడం లేదని చోప్రా చెప్పాడు. ఫ్రాంచైజీ కూడా అలాంటి ఆలోచనతో ఉన్నట్టు తనకు సమాచారం లేదన్నాడు.

వ్రితికి స్వర్ణం, సంపత్‌కు కాంస్యం


వ్రితి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ సీనియర్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో తెలుగు రాష్ట్రాల స్విమ్మర్లు వ్రితి అగర్వాల్ స్వర్ణం, సంపత్‌కుమార్ యాదవ్ కాంస్య పతకాలు కొల్లగొట్టారు. మంగళూరులో బుధవారం జరిగిన మహిళల 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన వ్రితి 17 నిమిషాల 45.63 సెకన్లలో రేసు ముగించి విజేతగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సంపత్ 800 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో 8 నిమిషాల 28.35 సెకన్లలో రేసు ముగించి మూడో స్థానంలో నిలిచాడు.

అథ్లెటిక్స్‌లో వినోద్‌కు రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): దక్షిణ ఆసియా జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ (శాఫ్)లో వరంగల్ అథ్లెట్ బానోతు వినోద్ కుమార్ రజత పతకం సాధించాడు. చెన్నైలో బుధవారం ముగిసిన 800 మీటర్ల పరుగును వినోద్ 1 నిమిషం 50.07 సెకన్లలో పూర్తి చేసి రెండోస్థానంలో నిలిచాడు. వినోద్ స్వస్థలం వర్ధన్నపేట మండలంలోని ఏనుగల్లు.

పురుషుల జట్టు శుభారంభం
మొరాకోపై గెలుపు
చెస్ ఒలింపియాడ్

బుడాపెస్ట్: చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషుల జట్టు శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మొదటి రౌండ్‌లో మనోళ్లు 4-0తో మొరాకోను చిత్తు చేశారు. ఈ విజయంలో భారత్‌కు రెండు పాయింట్లు లభించాయి. నల్లపావులతో ఆడిన అర్జున్ ఇరిగేసి 40 ఎత్తుల్లో జాక్వెస్ ఎల్బిలాపై గెలుపొందాడు. నల్లపావులతోనే బరిలో దిగిన పెంటేల హరికృష్ణ 45 ఎత్తుల్లో అనాస్ మొయాద్‌ని ఓడించాడు. ఇక ప్రజ్ఞానంద-మహ్మద్ తిసిర్‌పై, విదిత్ గుజరాతీ-మెహ్దీపై నెగ్గడంతో భారత్ క్లీన్‌స్వీప్ చేసింది.



ప్రకాశం బ్యారేజీ వద్ద బోట్లను పరిశీలిస్తున్న నిపుణులు

బోట్ల తొలగింపునకు అండర్ వాటర్ ఆపరేషన్

» బ్యారేజీ వద్ద బోట్లకు అడుగు నుంచి కటింగ్

విజయవాడ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీ వద్ద ఇరుక్కుపోయిన బోట్ల తొలగింపునకు జలవనరుల శాఖ అధికారులు అండర్ వాటర్ ఆపరేషన్ మొదలుపెట్టారు. ఈ బోట్ల తొలగింపునకు ఇంజనీర్లు నాలుగు ప్లాన్లను రూపొందించుకున్నారు. అందులో మొదటి ప్లాన్‌గా.. క్రేన్ల సాయంతో పైకి తీసే ప్రయత్నం విఫలం కావడంతో తదుపరి చర్యలపై సమాలోచన చేశారు. చివరికి నాలుగో ప్లాన్‌గా ఉన్న అండర్ వాటర్ ఆపరేషన్ మేలు అనే నిర్ణయానికి వచ్చారు. దీనికోసం విశాఖపట్నం నుంచి సీ లయన్ ఆఫ్‌షోర్ డైవింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుంచి నిపుణులను రప్పించారు. కంపెనీ ప్రతినిధి సూర్య అక్షిత్ ఆధ్వర్యంలో ఎనిమిది మంది డైవర్లు బుధవారం ప్రకాశం బ్యారేజీ వద్దకు చేరుకున్నారు.

10-12 అడుగుల లోతులో..

అండర్ వాటర్ ఆపరేషన్‌ను బెకమ్ కంపెనీ, సీ లయన్ కంపెనీ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. బెకమ్ కంపెనీకి సంబంధించిన ప్రాజెక్టు వర్కులను సీ లయన్ చేస్తుంటుంది. ఈ సంస్థ నుంచి వచ్చిన నిపుణులు ముందుగా బోట్ల వద్ద సర్వే చేశారు. ఇద్దరు డైవర్లు ఆక్సిజన్ సిలిండర్లతో నీళ్లలోకి దిగారు. బోల్తాపడిన బోట్లపైభాగం స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ కింద భాగంలో పరిస్థితి ఏమిటన్న దానిపై ఓ అంచనాకు వచ్చారు. బ్యారేజీ 67వ నంబరు గేటు దగ్గర రెండు బోట్లు పైకి కనిపిస్తున్నాయి. ఈ రెండింటికీ అడుగు భాగాన మరో బోటు ఉందని సీ లయన్ డైవర్లు గుర్తించారు. నీళ్లలో 10 నుంచి 12 అడుగుల లోతులోకి వెళ్లి ఈ బోటును గుర్తించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నీళ్లలో సర్వే చేసిన డైవర్లు మధ్యాహ్నం నుంచి ఆపరేషన్ మొదలు పెట్టారు. ఒక్కో బోటు కటింగ్ పూర్తికావడానికి రెండు రోజుల సమయం పడుతుందని భావిస్తున్నారు. బుధవారం రాత్రికి కనీసం ఒక బోటునైనా ముక్కలు చేస్తామని సీ లయన్ కంపెనీ ప్రతినిధి సూర్యఅక్షిత్ తెలిపారు. బోట్లను ముక్కలు చేయడానికి ఆక్సిఆర్క్‌కటింగ్ విధానాన్ని అనుసరిస్తున్నారు.

భారీ పశు నష్టం

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వర్షాలు, వరదలు తగ్గుతున్న కొద్దీ ఆస్తి, ప్రాణ నష్టాలు బయటపడుతున్నాయి. ఇటీవలి వరదలతో పశు సంపద, పౌల్ట్రీకి భారీ నష్టం జరిగింది. తాజా సమాచారం ప్రకారం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 1,294 పశువులు, 94,438 కోళ్లు చనిపోయాయని పశుసంవర్థక శాఖ గుర్తించింది. 686 మత్స్యకారుల పడవలు, 2,478 వలలు, 3,325 హెక్టార్లలో చేపలు, రొయ్యల చెరువులకు నష్టం జరిగినట్లు అంచనా వేశారు. ఆర్‌అండ్‌బీ రోడ్లు 4,460 కిలోమీటర్లు, పంచాయతీరాజ్ రోడ్లు 1,812 కిలోమీటర్లు, మున్సిపల్ రోడ్లు 563 కిలోమీటర్లు దెబ్బతినగా... 143 మైనర్ ఇరిగేషన్ చెరువులు, 254 మేజర్ చెరువులు, కాలువలకు గండ్లు పడ్డాయని గుర్తించారని విపత్తుల నిర్వహణ సంస్థ బుధవారం ప్రకటించింది.



పిఠాపురం బైపాస్‌లో అగ్రహారం వద్ద ఏలేరు వరద ఉధృతి



వరి పొలాలను ముంచెత్తిన ఏలేరు వరద

ఉధృతంగానే ఏలేరు

ముంపులోనే 65 గ్రామాలు.. హైవేపై కొనసాగుతున్న నీరు.. పిఠాపురానికి పెరిగిన ముంపు

పిఠాపురం/ఏలేశ్వరం, సెప్టెంబరు 11: ఏలేరు రిజర్వాయర్ నుంచి వరద జలాల విడుదల గణనీయంగా తగ్గించినా కాకినాడ జిల్లాలో వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. 8 మండలాల పరిధిలోని 65 గ్రామాల్లో పంట పొలాలు ముంపులోనే కొనసాగుతున్నాయి. కాకినాడ-కత్తిపూడి మధ్య గల 216వ జాతీయ రహదారిపై పిఠాపురం, గొల్లప్రోలు వద్ద, ఇతర ప్రధాన రహదారులపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలపై ఆంక్షలు కొనసాగిస్తున్నారు. పిఠాపురం, గొల్లప్రోలు బైపాస్‌రోడ్డు, పట్టణాల పరిధిలోని పంటపొలాలు వరద నీటితో చెరువులను తలపిస్తున్నాయి. మరోవైపు ఏలేరు ప్రాజెక్టులో నీటినిల్వలు తగ్గుముఖం పట్టాయి. ఇన్‌ఫ్లో తగ్గడంతో ఏలేరు కాల్వలకు నీటి విడుదల కూడా తగ్గించారు. అయినప్పటికీ ముంపు తగ్గలేదు. ఏలేరు ఆయకట్టుకు శివారు ప్రాంతంగా ఉన్న పిఠాపురం నియోజకవర్గంలో ముంపు ప్రభావం పెరిగింది. దీంతోపాటు కొత్తపల్లి మండలాన్ని కూడా వరద ముంచెత్తుతోంది.

నేడు మరింత పెరిగే చాన్స్

పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలతోపాటు కిర్లంపూడి, ప్రత్తిపాడు, పెద్దాపురం, సామర్లకోట, ఏలేశ్వరం మండలాల్లో పంటపొలాలు, పలు గ్రామాల్లో గృహాలు వరద నీటిలోనే ఉన్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీరు పిఠాపురం, గొల్లప్రోలు మండలాల మీదుగా కొత్తపల్లి మండలానికి చేరుతోంది. ఈ మండలంలోని 4 గ్రామాల్లో 750 ఇళ్లు ముంపులో చిక్కుకున్నాయి. పంటపొలాలు కూడా ముంపునకు గురయ్యాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు వరద తీవ్రత పెరుగుతూనే ఉంది. ఈ మండలం మీదుగానే వరద జలాలు సముద్రంలో కలుస్తాయి. దీంతో గురువారం ఇక్కడ వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కాకినాడ-కత్తిపూడి మధ్య 216వ జాతీయరహదారిపై పిఠాపురం బైపాస్‌రోడ్డు అగ్రహారం, ఇల్లింద్రాడవద్ద, గొల్లప్రోలు టోల్‌గేటుకు ఇరువైపులా ఏలేరు వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. గురువారానికి జాతీయ రహదారిపై వరద పూర్తిగా తగ్గుతుందని భావిస్తున్నారు. పిఠాపురం పట్టణంలోని కోర్టుల నుంచి ఇల్లింద్రాడ వరకు అర కిలోమీటరు మేర వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిపివేశారు. కాకినాడ-కత్తిపూడి మధ్య సాయంత్రం నుంచి ఆర్టీసీ బస్సులను పాక్షికంగా పునరుద్ధరించారు. పిఠాపురం పట్టణంలోని రాపర్తిరోడ్డు, అగ్రహారం మెట్ట శివారు ప్రాంతాల్లోని ఇళ్లు కూడా ముంపునకు గురయ్యాయి.

నీటి నిల్వలు తగ్గుముఖం

ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గడంతో ఏలేరు ప్రాజెక్టులో నీటినిల్వలు తగ్గుముఖం పడుతున్నాయి. ఇన్‌ఫ్లో తగ్గడంతో ఔట్‌ఫ్లో కూడా తగ్గాయి. బుధవారం రాత్రి 7 గంటల సమయంలో ఏలేరు రిజర్వాయర్‌లోకి 2,275 క్యూసెక్కుల వరద వస్తుండగా దిగువకు 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నీటి నిల్వ 24.11 టీఎంసీలకు గాను 21.80 టీఎంసీలుగా ఉంది. విశాఖ అవసరాల నిమిత్తం 275 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

అంత్యక్రియలకు యాతన

గొల్లప్రోలు పట్టణ శివారు సూరంపేట ప్రాంతానికి చెందిన ఇసరపు సూరిబాబు(62) బుధవారం మరణించారు. అయితే, ఏలేరు, సుద్దగడ్డ వరద నీటి కారణంగా అంతిమ సంస్కారాలకు ఇబ్బంది ఎదురైంది. దీంతో గొల్లప్రోలు తహసీల్దారు ఓ బోటును ఏర్పాటు చేసి మృతదేహాన్ని పట్టణంలోకి తీసుకువచ్చి శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలావుంటే, కిర్లంపూడి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన గొంతిన సుబ్బారావు(35) వరద నీటిలో గల్లంతయ్యారు. మంగళవారం రాత్రి వరద బాధితులకు భోజనం పంపిణీకి వెళ్లి తిరిగి వస్తుండగా ఏలేరు వరద నీటి ప్రవాహంలో కొట్టుకుపోయినట్టు అధికారులు నిర్ధారించారు. బుధవారం ఉదయం ముంపు కాలనీలో ఓ చోట సుబ్బారావు మృతదేహం తేలియాడింది.

ఉగ్రంగా.. గోదావరి

» ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న రెండో హెచ్చరిక

» బ్యారేజీ వద్ద 15 అడుగుల నీటి మట్టం

» 14,82,519 క్యూసెక్కులు సముద్రంలోకి

» భద్రాచలం వద్ద తగ్గుముఖం

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి). పోలవరం,సెప్టెంబరు 11: గోదావరి ఉగ్రరూపం దాల్చింది. పోలవరం స్పిల్‌వే నుంచి సుమారు 12 లక్షల క్యూసెక్కుల వరద రాజమహేంద్రవరం అఖండ గోదావరిలోకి వస్తోంది. దీంతో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద బుధవారం ఉదయం 5 గంటలకు నీటిమట్టం 13.75 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీచేశారు. మంగళవారం రాత్రి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన సంగతి తెలిసిందే. బుధవారం సాయంత్రం 5 గంటలకు బ్యారేజీ నీటిమట్టం 15 అడుగులకు చేరింది. బ్యారేజీ నుంచి దిగువకు 14,82,519 క్యూసెక్కుల వరద ప్రవాహాన్ని సముద్రంలోకి వదిలేస్తున్నారు. అటు భద్రాచలం వద్ద వరద బుధవారం మధ్యాహ్నం నుంచి తగ్గుముఖం పట్టింది. అప్పటి వరకూ 50.60 అడుగులకు చేరిన వరద సాయంత్రం 5 గంటలకు 49 అడుగులకు తగ్గింది. కానీ భద్రాచలం నుంచి పాపికొండల మీదుగా పోలవరం స్పిల్‌వే వరకూ భారీగా వరద చేరడంతోపాటు, రాజమహేంద్రవరం అఖండ గోదావరి పోటెత్తడంతో బ్యారేజీ వద్ద వరద ఉగ్రంగానే ఉంది. ఇది బాగా తగ్గాలంటే కనీసం రెండు రోజులు పడుతుంది. ఈ పరిస్థితుల్లో లంకల్లోని జనాలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ఘాట్లలో స్నానాలకు ప్రజలు దిగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

వినాయక నిమజ్జనాలకు నిబంధనలు

వరద పోటెత్తడంతో వినాయక విగ్రహాల నిమజ్జనాలకు అధికారులు నిబంధనలు విధించారు. ప్రజలెవరూ నేరుగా నిమజ్జనం చేయడానికి వీలులేదని, విగ్రహాలను రేవుల వద్ద అధికార్లకు అప్పగిస్తే వారే నిమజ్జనం చేస్తారని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.

పోలవరం ప్రాజెక్టుకు రాకపోకలు బంద్

ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు బుధవారం ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిమట్టం పెరిగింది. దీంతో దదపోలవరం ప్రాజెక్టుకి వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో కడెమ్మ వంతెన పూర్తిగా నీట మునిగింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి.



ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద సముద్రంలోకి వెళుతున్న నీరు

శ్రీశైలం గేట్లు మూసివేత

» కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

శ్రీశైలం, సెప్టెంబరు 11, విజయవాడ (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయానికి బుధవారం వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో డ్యాం క్రస్టుగేట్లను అధికారులు మూసివేశారు. అయితే జలాశయం ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. బుధవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి జలాశయానికి 1,47,688 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 884.10 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుతం 210.5133 టీఎంసీలుగా నమోదైంది. ఏపీ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 31,094 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,116 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

ప్రకాశం బ్యారేజ్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో

ప్రకాశం బ్యారేజ్‌కి మళ్లీ ఇన్‌ఫ్లో పెరిగింది. ఎగువ నుంచి 2.32 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. 2.32 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. కాల్వలకు 1709 క్యూసెక్కులు ఇస్తున్నారు. 30 గేట్లను ఏడు అడుగులు, 34 గేట్లను ఆరు అడుగులు మేరకు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. ఆరు గేట్లను పూర్తిగా కిందికి దించేశారు. పులిచింతల నుంచి ఇన్‌ఫ్లో ఆగిపోయింది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 1,600 క్యూసెక్కుల నీరు బ్యారేజ్‌కి వస్తోంది.



గుంటూరులో మీడియాతో మాట్లాడుతున్న మాజీ సీఎం జగన్

నేనొస్తే.. అందర్నీ లోపలేస్తా

» టీడీపీ ప్రభుత్వం ఎల్లకాలం ఉండదు.. ఆ పార్టీ నేతలందరికీ ఇదేగతి

» బాబు నిర్లక్ష్యం వల్లే బెజవాడ మునక.. వరదల్లో 60 మంది మృతి

» బ్యారేజీకి కొట్టుకొచ్చిన బోట్ల యజమానులు టీడీపీ వారే: జగన్

గుంటూరు, సెప్టెంబరు 11: మూడేళ్ల క్రితం జరిగిన టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో సంబంధం లేనివారిని అరెస్టు చేస్తున్నారని, టీడీపీ తప్పుడు సంప్రదాయానికి బీజం వేస్తోందని వైసీపీ అధ్యక్షుడు జగన్ ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వం ఎల్లకాలం ఉండదని, రేపు తాము అధికారంలోకి వస్తే ఈ నాయకులందరికీ కూడా ఇదే గతి పడుతుందని, జైల్లో ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు. కొంతమంది పోలీసులు కూడా ఈ కేసులో సాక్షాలు, ఆధారాలు సృష్టించి సంబంధం లేని వారిని నిందితులుగా చేర్చారని ఆరోపించారు. గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్న వైసీపీ నేతలు మాజీ ఎంపీ నందిగం సురేశ్, అవుతు శ్రీనివాస్ రెడ్డిని జగన్ పరామర్శించారు. మీడియాతో మాట్లాడుతూ.. విజయవాడ ముంపునకు గురై 60 మంది మృతి చెందారని, దీనికి సీఎం చంద్రబాబు నిర్లక్ష్యం కారణం కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబుపై ఎందుకు కేసు పెట్టకూడదన్నారు. ప్రభుత్వ తప్పుల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు మూడేళ్ల క్రితం జరిగిన టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనను ఇప్పుడు బయటకు తీశారని ఆరోపించారు. "పైనుంచి కృష్ణా నదికి వరద వస్తుందని బుధవారమే హెచ్చరికలు వచ్చినా శుక్రవారం వరకు చంద్రబాబు జాగ్రత్తలు తీసుకోలేదు. చంద్రబాబు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే విజయవాడ నీట మునిగి 60 మంది మృతిచెందారు. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. చంద్రబాబు తన ఇంటిని కాపాడుకోవడం కోసం కృష్ణాలోకి వస్తున్న బుడమేరు గేట్లను అర్ధరాత్రి ఎత్తేశారు. ఇంతకంటే దారుణమైన పరిపాలన ఏమైనా ఉంటుందా?" అన్నారు.

ఎవరైనా చెబితే దాడి చేస్తారా?

"నాడు టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో అప్పటి సీఎం(జగన్)ను భోషడీకే అని తిట్టాడు. భోషడీకే అంటే లంజాకొడకా అని అర్థం. ముఖ్యమంత్రిని ప్రేమించేవారికి, వైసీపీని అభిమానించే వారికి ఈ విధంగా తిడితే కడుపు మండదా? కడుపు మండినవారు, ఈ అన్యాయాన్ని చూడకూడదు అనుకునేవారు కొంతమంది టీడీపీ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. అంతేకానీ ఎవరైనా చెబితే వచ్చి దాడి చేస్తారా? టీడీపీ కార్యాలయం వద్ద ధర్నా చేసేందుకు వెళ్లిన వారిపై టీడీపీ వారే దాడికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా తొక్కిసలాటలో కొద్దో, గొప్పో పార్టీ కార్యాలయంపై రాళ్లు పడి ఉండవచ్చు. అయినప్పటికీ విచారణ జరిపించి, సీసీ కెమెరాలను పరిశీలించి సెల్‌ఫోన్ లోకేషన్ల ఆధారాలను పరిశీలించి టీడీపీ కార్యాలయం వద్ద ధర్నాకు వెళ్లిన వారందరిని గుర్తించారు. వారికి 41ఏ నోటీసు ఇచ్చి కోర్టులో హాజరు పరిచాం. దాడి ఘటనలో మాజీ ఎంపీ సురేశ్, విజయవాడ డిప్యూటీ మేయర్ భర్త శ్రీనివాస్ రెడ్డి ఉన్నారా?" అని జగన్ అన్నారు.

ఆ బోట్లు మా వారివి కావు

"ప్రకాశం బ్యారేజీ గేట్లను ఢీ కొట్టిన బోట్లకు బాబు ప్రభుత్వంలోనే అనుమతులు ఇచ్చారు. మూడున్నర నెలల క్రితం టీడీపీ ప్రభుత్వం వచ్చిన సమయంలో విజయోత్సవాలు చేసుకున్న వారిలో ఆయా పడవల యజమానులు లేరా? ఈ బోట్లతో విజయోత్సవాలు చేసుకోలేదా? 4 నెలలుగా చంద్రబాబుతో కలసి ఇసుక దోపిడీలో ఆ పడవల యజమానులు భాగస్వాములు కాదా? ఓ బోటు యజమాని ఉషాద్రి ఎవరు? చంద్రబాబు, లోకేశ్‌లతో ఫొటోలు దిగిన పరిస్థితి ఉంది. ఆయన టీడీపీలో క్రియాశీలకంగా కూడా పని చేశారు. మరో బోటు యజమాని రామ్మోహన్ ఎన్నారై టీడీపీ నేత జయరాం సోదరుడి కుమారుడు. ఆలూరి చిన్నాకు టీడీపీతో ఉన్న సంబంధం ఏమిటి? ఆయా వ్యక్తులు, బోట్ల యజమానులు టీడీపీ వారే. ఆ పడవలు వరదకు ప్రకాశం బ్యారేజీ వద్దకు కొట్టుకొస్తే రాజకీయం చేయాలని, వాస్తవాలను వక్రీకరించి మాట్లాడుతున్నారు" అని జగన్ అన్నారు.

అదే జగన్.. అవే అబద్ధాలు!



మాట్లాడుతున్న మంత్రులు నిమ్మల, నారాయణ, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కొలికపూడి

అమరావతి/విజయవాడ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ గుంటూరు జైలు వద్ద చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. జైల్లో ఉన్న మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను పరామర్శించిన జగన్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వంపైన, సీఎం చంద్రబాబుపైనా విమర్శలు చేశారు. అయితే, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది రోజులకే ఢిల్లీ వెళ్లిన జగన్ అక్కడ మాట్లాడుతూ.. రాష్ట్రంలో తమ పార్టీకి చెందిన వారిని వేటాడుతున్నారని, ఈ కొద్ది రోజుల్లో 36 రాజకీయ హత్యలు జరిగాయని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వ పక్షం స్పందించింది. జగన్ నిజాయితీపరుడైతే ఆయన చెబుతున్న 36 మంది పేర్లు, చిరునామాలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. అయినప్పటికీ జగన్ స్పందించలేదు. సరిగ్గా అదే పద్ధతిలో బుధవారం కూడా మాట్లాడారు. విజయవాడ వరదల్లో 60 మంది మరణించారని, దీనికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై కూడా ప్రభుత్వ పక్షం సూటి ప్రశ్నలు సంధించింది. జగన్ చెప్పింది నిజమే అయితే ఆ 60 మంది పేర్లు ఇవ్వాలని డిమాండ్ చేసింది. జగన్ అబద్ధంతో జన్మించాడని, ఫేక్‌తో పెరిగాడని మంత్రి అనగాని సత్య ప్రసాద్ ధ్వజమెత్తారు. 'జనం కష్టాల్లో ఉంటే వారిని పట్టించుకోకుండా జైలుకు వెళ్లి ఒక క్రిమినల్‌ను పరామర్శించారు విజయవాడలో 6 లక్షల మంది ప్రజలు వరదలో చిక్కుకోవడానికి జగన్ చేసిన పాపాలే కారణం' అన్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు కడపలో అన్నమయ్య డ్యాం కొట్టుకుపోతే కిక్కురుమనలేదని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దుయ్యబట్టారు. 'పింఛా నదికి వరదలు వస్తున్నట్టు తెలిసినా అన్నమయ్య డ్యాం గేట్లు ఎత్తలేదు. ఇసుక తవ్వుతున్న తమ పార్టీ మాఫియాకు ఇబ్బందని గేట్లు తెరవనీయకుండా ఆపారు. డ్యాం కొట్టుకుపోవడంతో 7 ఊళ్లు సర్వనాశనం అయ్యాయి. 38 మంది మరణించారు. జనం ఇంకా గుడారాల్లోనే ఉంటున్నారు' అన్నారు. నేరస్తుడు జగన్‌కు ప్రజల కష్టాలు పట్టించుకునే తీరికలేదు కానీ, జైలులో ఉన్న నేరస్తులను మాత్రం పరామర్శించే తీరిక ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. బుడమేరు విస్తరణకు టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి 70 శాతం పనులు పూర్తిచేసిందని, ఆ తరువాత తట్ట మట్టి కూడా వేయని జగన్ ఏముఖం పెట్టుకుని మాట్లాడతారని విమర్శించారు. ఏ కుట్రా లేకపోతే గుంటూరు జిల్లా వైపు ఉన్న బోట్లు ప్రకాశం బ్యారేజీకి ఎందుకు వచ్చాయని నిలదీశారు. జగన్ రాజకీయ జీవితానికి ఫుల్‌స్టాప్ పడిందని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. బ్యారేజీని బోట్లు ఢీకొనటం వెనుక రాజకీయ కుట్ర ఉందన్న అనుమానం మొదట జగన్ చెల్లెలు షర్మిలకే వచ్చిందన్నారు. జగన్ రాజకీయ జీవితానికి ఫుల్‌స్టాప్ పడుతుందన్నారు. 'జగన్‌కు నిజంగా కూటమి ప్రభుత్వం విశ్వాసం కోల్పోయిందని నమ్మకం ఉంటే ఆయన పులివెందులకు రాజీనామా చేయాలి. నేను తిరువూరుకు రాజీనామా చేస్తా. ప్రజలు ఏం తీర్పు ఇస్తారో చూద్దాం. దమ్ముంటే ఆయన రావాలి' అని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సవాల్ విసిరారు. కాగా, టీడీపీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడిని తానే ప్రోత్సహించానని జగన్ ఒప్పుకొన్నారని, ఆ కేసులో అసలు నేరస్తుడు జగనేనని అర్థమవుతోందని మంత్రి నారాయణ అన్నారు. జగన్‌ను ప్రధాన నిందితుడిగా ఎందుకు చేర్చకూడదని ప్రశ్నించారు.

"ఏలేరు ఆధునికీకరణకు గతంలో నేను శ్రీకారం చుట్టా. జగన్ వచ్చి పనులు ఆపేశారు. అప్పట్లో పనులు పూర్తి చేస్తే ఇప్పుడు ఇన్ని ఇబ్బందులు వచ్చేవి కావు. వీళ్లే బుడమేరుకు గండి పడేలా చేశారు. ప్రకాశం బ్యారేజీ నుంచి 11.40 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్న సమయంలో ఏకంగా ఐదు టన్నులు బరువు ఉండే మూడు బోటులను ఒకదానికి ఒకటి తాడు కట్టి వదిలారు. దానివల్ల ఒకవేళ బ్యారేజీ దెబ్బతిని ఉంటే లంక గ్రామాల ప్రజల పరిస్థితి ఏమై ఉండేది? నేనే గనుక రాజకీయాలను పక్కనపెడితే అందరి తాట తీసేవాడిని"

\- సీఎం చంద్రబాబు

ఆదుకుంటా!

(మొదటి పేజీ తరువాయి)

అందిస్తామని ప్రకటించారు. బుధవారం ఆయన ఏలూరు జిల్లాలోని కొల్లేరు పరిధిలోని వరద ప్రాంతంలోను, కాకినాడ జిల్లాలో ఏలేరు వరద ప్రభావిత ప్రాంతంలోను పర్యటించారు. పంట నష్టాన్ని హెలికాప్టర్ ద్వారా పరిశీలించారు. తీవ్రంగా పంటనష్టం వాటిల్లిన రైతుల్లో ధైర్యం నింపుతూ, వరదలకు ఇళ్లు దెబ్బతిన్నవారిని, తోపుడు బండ్ల వారిని పరామర్శిస్తూ ఈ రెండు జిల్లాల్లో చంద్రబాబు పర్యటన సాగింది. మధ్యాహ్నం సామర్లకోటలో హెలికాప్టర్ దిగి అక్కడి నుంచి కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం వడ్లమూరుకు చంద్రబాబు చేరుకున్నారు. ఓ రైతు ఆయనకు కొబ్బరి బొండం ఇవ్వగా, అది తీసుకుని తాగారు. వడ్లమూరు గ్రామంలో వంతెన వద్ద ఏలేరు కాల్వ వరద పరిస్థితిని అధికారులతో కలిసి పరిశీలించారు.

జేసీబీ యంత్రం ఎక్కి...

వరద ముంపునకు గురైన జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామానికి సీఎం వెళ్లారు. ఏలేరు కాలువకు గండిపడి ఈ గ్రామంలో ఛాతీలోతు వరకు వరద నీరు ప్రవహిస్తోంది. ఇక్కడ బాధితులను పరామర్శించడానికి వచ్చిన సీఎం ఎక్స్‌కవేటర్ ఎక్కి.. గ్రామంలో తిరిగారు. ఇళ్లను పరిశీలించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వరదతో దెబ్బతిన్న కాకాడ వసంత్‌కుమార్‌కు చెందిన పెంకుటిల్లు లోపలకు వరద నీటిలో నడుచుకుంటూ వెళ్లారు. వరద తమ ఇంటిని ఎలా చుట్టుముట్టేసిందో ఓ బాధిత మహిళ.. బాబుకు వివరించారు. తమను ఆదుకోవాలని కోరారు. పక్కనే ఉన్న కలెక్టర్‌ను పిలిచి బాధిత కుటుంబానికి అన్నివిధాలా సాయం చేయాలని సీఎం ఆదేశించారు. అనంతరం మరో మహిళ...చంద్రబాబుకు తన కష్టాన్ని వివరించారు. వరద ఇంట్లోకి వచ్చేయడంతో ఇళ్లు దెబ్బతిందని తెలిపారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తానని ఆమెకు హామీ ఇచ్చారు. రాజుపాలెం గ్రామం ప్రారంభంలో కొందరు రైతులు చంద్రబాబును కలిశారు. వరదలతో కుళ్లిపోయిన కంకులను చూపించి ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో పంట నష్టం వేగంగా పూర్తి చేసి పరిహారం ఇస్తామని వారికి ధైర్యం చెప్పారు. ఆ తర్వాత రాజుపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడారు.

ప్రత్యేక యాప్ తయారుచేస్తున్నాం..

ప్రజల ఆశలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని చంద్రబాబు అన్నారు. "ఎన్నిక ల్లో ఓట్లేశాం.. ఇక మా బాధ్యత అయిపోయిందని ప్రజలు అనుకుంటే జగన్ లాంటి దుర్మార్గులు వచ్చి నాశనం చేస్తారు. ఏమైనా ఇబ్బందులుంటే ప్రజలు చెబితే, సరిదిద్దుకుంటాం. దీనికోసమే త్వరలో యాప్ అభివృద్ధి చేస్తున్నాం. దీనిద్వారా ప్రజల ఫోన్‌కు సం దేశం వస్తుంది. సమాధానం ఇచ్చినవారి అభిప్రా యం నేరుగా నాకు చేరుతుంది. ప్రజలకు, సీఎంకి మధ్య మధ్యవర్తులు ఉండబోరు" అని తెలిపారు.

ఏలేరు వద్ద ఆధునికీకరణ పనులు

గురువారం నుంచి బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తామని, వరదకు దెబ్బతిన్న ప్రతి కుటుంబానికి పది వేల సాయం చేస్తామని రాజుపాలెం పంచాయతీ వద్ద ప్రకటించారు. దెబ్బతిన్న ఇళ్ల స్థానంలో కొత్త ఇళ్లు కట్టించి ఇస్తామని, తోపుడు బండ్లు దెబ్బతిన్న వారికి కొత్తవి ఇస్తామన్నారు. ఆటోరిక్షాలు, సైకిల్ రిక్షాలు పాడైతే పది వేలు సాయం చేస్తామని తెలిపారు. పంటలు దెబ్బతిన్న రైతులకు హెక్టారుకు రూ.25వేల సాయం అందిస్తామని వివరించారు. ఏలేరుకు వరద రాకుండా ఆధునికీకరణ పనులు చేపడతామని చెప్పారు. గతంలో తితలీ తుఫానుకు టీడీపీ ప్రభుత్వం హెక్టారుకు రూ.20వేలు సాయం చేసిన విషయం గుర్తుచేశారు. కానీ జగన్ వచ్చి రూ.20 వేలను రూ.16 వేలకు తగ్గించారని, తర్వాత వెయ్యి పెంచారన్నారు.

త్వరలో పోలవరం పనులు

వరదల కారణంగా జరిగిన నష్టాన్ని పారదర్శకతతో, జవాబుదారీతనంతో లెక్కిస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. ఏలూరు నగరంలో తమ్మిలేరు ప్రవాహాన్ని పరిశీలించారు. ఏరియల్ సర్వే ద్వారా కొల్లేరు ప్రాంతంలోని వరద ప్రాంతాలను సీఎం చూశారు. అనంతరం సీఆర్ఆర్ కళాశాల ప్రాంగణం లో ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించి, బాధితులతో ముఖాముఖి మాట్లాడారు. త్వరలో పోలవరం పనులు తిరిగి ప్రారంభిస్తామని ప్రకటించారు. అదే సమయంలో చింతలపూడి లిఫ్ట్ పనులు పూర్తి చేయడమే కాకుండా ఉమ్మడి పశ్చిమ, కృష్ణా జిల్లాలు రెండింటికీ నీరందించే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. తాను, తన మిత్రుడు పవన్ కల్యాణ్ కలిసి రాష్ట్రానికి సుపరిపాలన అందిస్తామని ముఖాముఖిలో పేర్కొన్నారు.



ఏలూరు జిల్లాలో వరద నష్టాన్ని ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించిన అనంతరం, కొల్లేరు, ఉప్పుటేరు, తమ్మిలేరు వరదలపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, వరద పరిస్థితిని సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



రాజుపాలెంలో వరద ముంపునకు గురైన పెంకుటింటిలోకి వెళుతున్న సీఎం చంద్రబాబు

'ఏలేరు'ను ముంచింది జగనే

» ఏలేరు ఆధునీకీకరణ పనులు ఆపేశారు

» నేనే గనుక రాజకీయాలను పక్కనపెడితే అందరినీ తాట తీసేవాడిని: చంద్రబాబు

జగన్ ఓ పనికిమాలిన వ్యక్తి అని సీఎం చంద్రబాబు ఆక్షేపించారు. "ఏలేరు ఆధునికీకరణకు గతంలో నేను శ్రీకారం చుట్టా. జగన్ వచ్చి పనులు ఆపేశారు. అప్పట్లో పనులు పూర్తి చేస్తే ఇప్పుడు ఇన్ని ఇబ్బందులు వచ్చేవి కావు" అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తాను రాజకీయాలను పక్కనపెడితే అందరి తాట తీసేవాడినని ఆగ్రహించారు. వరద ప్రభావిత కాకినాడ, ఏలూరు జిల్లాల పర్యటన సందర్భంగా గత ఐదేళ్లలో జగన్ వ్యవహరించిన తీరును గర్హించారు. "ఇటీవల ఎన్నికల్లో శ్రీకాకుళం నుంచి గుంటూరు వరకు వైసీపీకి రెండే రెండు సీట్లు వచ్చాయి. జగన్ వద్దని జనం ఛీకొట్టారు. జగన్ దిగిపోయినా ఆయన చేసిన పాపాలు వెంటాడుతున్నాయి" అని తెలిపారు. ప్రకాశం బ్యారేజీకి మూడు పడవలు పంపి బ్యారేజీని డ్యామేజీ చేయడానికి జగన్ ప్రయత్నించారని మండిపడ్డారు. "గతంలో బాబాయిని చంపి ఏవిధంగా ఆ నెపం టీడీపీపై జగన్ నెట్టారో, ఇప్పుడు బ్యారేజీని దెబ్బతీసి జనాలను చంపేసి ప్రభుత్వంపై నెట్టే ప్రయత్నం చేశారు. బ్యారేజీ నుంచి 11. 40 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్న సమయంలో ఏకంగా ఐదు టన్నులు బరువు ఉండే 3 బోటులను ఒకదానికి ఒకటి తాడు కట్టి వదిలారు. దానివల్ల ఒకవేళ బ్యారేజీ దెబ్బతిని ఉంటే లంక గ్రామాల ప్రజల పరిస్థితి ఏమై ఉండేది? ఒక నేరస్థుడితో రాజకీయాలు చేయడం తప్పడం లేదు. ప్రజాహితం కోసం ఉద్యమం తప్పడం లేదు.మమ్మల్ని గెలిపించిన ప్రజలను నాశనం చేయాలని ఇలాంటివి చేస్తున్నారు. ఇలాంటి పార్టీ(వైసీపీని ఉద్దేశించి) దేశంలో ఎక్కడా ఉండదు. బుడమేరకు కూడా గండి కొట్టారు" అని చంద్రబాబు అన్నారు.

1 నుంచి కొత్త మద్యం పాలసీ

ఆదాయం కంటే జనం ఆరోగ్యమే ముఖ్యం: మంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీని అక్టోబరు 1 నుంచి అమల్లోకి తీసుకొస్తామని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆరు రాష్ట్రాల్లో అధికారులు బృందాలు పర్యటించాయని, వాటిని పరిశీలించి ప్రభుత్వానికి తుది నివేదిక సమర్పిస్తామని తెలిపారు. ప్రభుత్వానికి ఆదాయం కంటే ప్రజల ఆరోగ్యం ముఖ్యమన్నారు. కొత్త పాలసీపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం మొదటిభేటీ బుధవారం మంగళగిరిలోని సెబ్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో ఉన్న మద్యం పాలసీలను అధికారులు... మంత్రులకు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమల్లో ఉన్న ప్రభుత్వ షాపుల పాలసీ, ప్రైవేటు షాపుల పాలసీకి ఉన్న వ్యత్యాసాలపై చర్చించారు. రిటైల్ ట్రేడ్, మద్యం ధరలు, పన్నులపైనా ఆరా తీశారు. మరోసారి సమావేశమై లోతుగా అధ్యయనం చేయాలని ఉపసంఘం నిర్ణయించింది. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న బ్రాండ్లతో మెరుగైన పాలసీని తీసుకొస్తామన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన పిచ్చి బ్రాండ్ల వల్ల యువత గంజాయి, డ్రగ్స్‌వైపు వెళ్లారన్నారు. గంజాయి, డ్రగ్స్‌ను సమూలంగా నిర్మూలిస్తామన్నారు. పది రోజులుగా ప్రజలు వరదలతో ఇబ్బందిపడుతుంటే పట్టించుకోకుండా నేరస్థుల కోసం జైలుకు వెళ్లడానికి వైసీపీ అధినేత జగన్‌కు సిగ్గుండాలని మంత్రి మండిపడ్డారు. జైలు పక్షికి ప్రజల సమస్యలు కనిపించవని మరోసారి రుజువైందన్నారు.

సెబ్ రద్దు.. పాత స్వరూపంలోకి ఎక్సైజ్ శాఖ

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలోని పెద్దల కోసం సృష్టించిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) రద్దయిపోయింది. వారి అక్రమాలకు అనుకూలంగా వ్యవహరించిన ఈ ప్రత్యేక వ్యవస్థను కూటమి ప్రభుత్వం తుడిచిపెట్టింది. మద్యం సంబంధిత నేరాలకు పరిమితం కావాల్సిన ఎక్సైజ్ శాఖను వైసీపీ ప్రభుత్వం రెండు ముక్కలు చేసి సెబ్‌ను ఏర్పాటుచేసింది. ఎర్రచందనం, ఇసుక, గుట్కా, గ్యాంబ్లింగ్ లాంటి అదనపు బాధ్యతలను ఆ శాఖకు అప్పగించి ఏ పనీ చేయకుండా నిర్వీర్యం చేసింది. దీంతో ఇటు మద్యం అటు ఇసుక అక్రమ రవాణా నేరాలు భారీగా పెరిగాయి. మద్యం ద్వారా రావాల్సిన ఆదాయానికి గండి పడింది. సెబ్ వద్దంటూ ఆ శాఖ ఉద్యోగులు గగ్గోలు పెట్టినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రభుత్వం మారిన వెంటనే దీనిపై దృష్టి సారించిన ప్రభుత్వం అక్రమాలకు కేంద్రంగా మారిన సెబ్‌ను రద్దుచేయాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగా బుధవారం సెబ్ ఏర్పాటుతో సహా సంబంధిత 12 జీవోలను రద్దుచేస్తూ సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఎక్సైజ్‌ను విభజించినప్పుడు 70శాతం అధికారులు, ఉద్యోగులను సెబ్‌కు కేటాయించారు. వారందరినీ తిరిగి ఎక్సైజ్ శాఖలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే సెబ్ కోసం పోలీసు, గనుల శాఖల నుంచి అధికారులను కేటాయించగా, వారిని మాతృశాఖల్లో రిపోర్టు చేయాలని స్పష్టంచేసింది. సెబ్ కార్యాలయాలు, స్టేషన్లను ఎక్సైజ్‌కు అప్పగించాలని తెలిపింది. చరాస్తులు, మౌలిక సదుపాయాలు, పెండింగ్ బిల్లులు, కంప్యూటర్లు, అద్దె వాహనాలు ఎక్సైజ్‌కు బదిలీ చేయాలని స్పష్టంచేసింది. సెబ్ సీజ్ చేసిన వాహనాలు, వస్తువులు కూడా ఎక్సైజ్‌కు బదిలీ చేయాలని ఆదేశించింది.సెబ్ రద్దు కావడంతో ఎక్సైజ్ శాఖ పూర్తిగా పాత స్వరూపంలోకి రానుంది. ఇందుకోసం శాఖ పునర్నిర్మాణంపై ఎక్సైజ్ ఉత్తర్వులు జారీచేయనుంది. గతంలో ప్రతి జిల్లాకు ఒక డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ ఉండగా, ఇప్పుడు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన వారిని నియమించనుంది. అలాగే జిల్లాకో ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను కేటాయిస్తుంది. నేరాల నియంత్రణకు పాత విధానంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఉంటారు. ఆయన పరిధిలో టాస్క్‌ఫోర్స్ విభాగాలు పనిచేస్తాయి.

భారీగా పెరిగిన నేరాలు

సెబ్ ఏర్పాటుచేశాక నేరాలన్నీ తగ్గిపోతాయని గత ప్రభుత్వం ప్రచారం చేయగా అందుకు విరుద్ధంగా మద్యం సంబంధిత నేరాలు భారీగా పెరిగాయి. ఎన్‌డీపీఎల్ పెద్దఎత్తున వచ్చింది. గతంలో నాటుసారా రహిత జిల్లాలుగా ప్రకటించిన జిల్లాల్లో తిరిగి నాటుసారా ప్రారంభమైంది. గంజాయి వినియోగం ఎప్పుడూలేని విధంగా గ్రామస్థాయికి విస్తరించింది. ప్రభుత్వ మద్యం షాపుల్లో ఎమ్మార్పీ ఉల్లంఘనలు, బ్రాండ్లలో గోల్‌మాల్‌ను ఎవరూ పట్టించుకోలేదు. ఫలితంగా ప్రభుత్వానికి మద్యంపై రావాల్సిన ఆదాయంలో భారీగా తగ్గింది. దాదాపు రూ.18వేల కోట్ల ఆదాయం కోల్పోయినట్లు ఈ ప్రభుత్వం అంచనా వేసింది. ఇసుక, ఎర్రచందనం, గుట్కా, గ్యాంబ్లింగ్ అక్రమాలపై సెబ్ ఏమాత్రం ప్రభావం చూపలేకపోయింది.



కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం రొయ్యూరులో వరదలకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు



వరద నష్టాలపై రాష్ట్ర అధికారులతో చర్చిస్తున్న కేంద్ర బృందం, వరద నష్టంపై శాఖల వారీగా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

పెద్ద మనసుతో ఆదుకోండి

- **కేంద్ర బృందాలకు రాష్ట్ర ప్రభుత్వం వినతి**
- **నష్టం ప్రాథమిక అంచనాలే 6,800 కోట్లు**
- **ఎన్యుమరేషన్ తర్వాత మరింత పెరిగే చాన్స్**
- **సిసోడియా పవర్ పాయింట్ ప్రజెంటేషన్**
- **తొలిరోజు రెండు జిల్లాల్లో బృందాల పర్యటన**
- **కనీసం 10 వేల కోట్లు మంజూరు చేయండి**
- **కేంద్ర బృందానికి రైతు సంఘాల వినతి**

అమరావతి/మచిలీపట్నం/బాపట్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): 'ఇది ఊహించని విపత్తు. సాధారణం నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. ఎగువ రాష్ట్రాల నుంచి వరద వెల్లువెత్తడంతో ఏరులు, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఊళ్లు, పట్టణాలు, నగరాలను వరద ముంచెత్తింది. తేరుకునేలోపే నిండా ముంచేసింది. ప్రజల ప్రాణాలు కాపాడాలన్న ఏకైక లక్ష్యంతో ప్రభుత్వ యంత్రాంగం అహర్నిశలు పనిచేసింది. ప్రాథమిక అంచనాల ప్రకారం నష్టం రూ.6,880కోట్లు పైమాటే. ఎన్యుమరేషన్ పూర్తయితే నష్టం విలువ అపారంగా ఉంటుంది. మీరూ పరిశీలన చేసి, నష్టాన్ని అంచనా వేయండి. పెద్ద మనుసుతో రాష్ట్రాన్ని ఆదుకునేందుకు సాయం చేయండి' అని కేంద్ర బృందాలను రాష్ట్ర ప్రభుత్వం కోరింది. బుధవారం తాడేపల్లిలోని విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయంలో కీలక భేటీ జరిగింది. నాలుగు జిల్లాల్లో వరద నష్టం అంచనా వేసేందుకు వచ్చిన కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి అనిల్ సుబ్రహ్మణ్యం నేతృత్వంలోని అధికారుల బృందంతో రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల కీలక అధికారులు సమావేశమయ్యారు. రెవెన్యూ, విపత్తు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా వరద నష్టంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ముంపు సమయంలో, ప్రస్తుత పరిస్థితులను తెలియజేసేలా ఏర్పాటుచేసిన వీడియో, ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర అధికారులు పరిశీలించారు. వరద పీడిత ప్రాంతాల్లో ప్రాథమిక అంచనాల ప్రకారం రూ. 6,880 కోట్ల నష్టం వాటిల్లిందని కేంద్ర బృందానికి సిసోడియా నివేదించారు. సమగ్ర నష్టాన్ని అంచనా వేసేందుకు సర్వే జరుగుతోందని, అది పూర్తయ్యాక మొత్తం నష్టం విలువ అపారంగా ఉండే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్క విజయవాడ నగరంలోనే 32 వార్డులు, దాని పక్కనే 2గ్రామాలతో పాటు 10.63లక్షల మంది తీవ్రంగా ప్రభావితమయ్యాయని తెలిపారు. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని 108 మండలాలు, 337 గ్రామాలపై ప్రభావం పడిందని చెప్పారు. 246 పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి 50వేల మందిని తరలించామని, లక్షన్నర మందికి అత్యవసర వైద్యసేవలు అందించామని వివరించారు. వరదల వల్ల 3లక్షల మంది రైతులకు చెందిన 2.06 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని అధికారులు నివేదించారు. 19,686 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. 4వేల కి.మీ. పరిధిలో రహదారులు దెబ్బతిన్నాయని, దీనివల్ల రూ.వేల కోట్ల నష్టం వాటిల్లిందని ఆర్అండ్‌బీ ప్రజెంటేషన్ ఇచ్చింది.

కేంద్ర బృందానికి రైతు సంఘాల వినతిపత్రం

బుడమేరు, కృష్ణా వరద ప్రభావిత ప్రాంతాలను ఆదుకోవడానికి కనీసం రూ.10వేల కోట్లు మంజూరు చేయాలని కేంద్ర బృందానికి ఏపీ రైతుసంఘాల సమన్వయ సమితి విజ్ఞప్తి చేసింది. మద్దూరులో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, రైతుసంఘాల నాయకులు కేంద్రబృందానికి వినతిపత్రం అందజేశారు. పామర్రు, గుడివాడ, పెనమలూరు నియోజకవర్గాల్లో బుధవారం కేంద్ర బృందం అనిల్ సుబ్రహ్మణ్యం, రాకేశ్ కుమార్, ఎస్‌వీఎస్‌పీ శర్మ పర్యటించారు. కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ వారికి పవర్‌పాయింట్ ప్రజంటేషన్, ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా జిల్లాలో జరిగిన నష్టాన్ని వివరించారు. కాగా, బాపట్ల జిల్లాలోని లంక గ్రామాలతో పాటు ముంపు ప్రాంతాల్లో మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్‌కు చెందిన డైరెక్టర్ వాఘ్‌మెర్, ఆర్థికశాఖ కన్సల్టెంట్ కౌల్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కార్యదర్శి ప్రదీప్ కుమార్ పర్యటించారు. కేంద్ర బృందం కాన్వాయ్ చింతల్లంక, పెసర్లంక గ్రామాల్లోకి రాగానే మహిళలు అడ్డుగా నిలబడి డ్వాక్రా రుణాలతో పాటు పంట రుణాల విషయంలో వెసులుబాటు కల్పించాలని అభ్యర్థించారు. ఇప్పటికే ఈ అంశంపై సీఎం స్పష్టమై ఆదేశాలు ఇచ్చారని, బ్యాంకర్లతో మాట్లాడి మరింత న్యాయం జరిగేలా చూస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో కాన్వాయ్‌కి దారివదిలారు.

వరద నష్టంపై అమిత్ షాకు నివేదిక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో భారీవర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టంపై రూపొందించిన ప్రాథమిక నివేదికను కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అందజేశారు. వర్షాలు, వరదలతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ముంపునకు గురైనత ప్రాంతాల్లో శివరాజ్‌సింగ్ ఇటీవల పర్యటించి, పరిశీలించారు. నష్టంపై రూపొందించిన ఆ నివేదికను హోంమంత్రి అమిత్ షాకు అందజేసినట్లు ఆయన బుధవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు.

బుడమేరు ముంచింది

ఎన్టీఆర్ జిల్లా, కృష్ణా డెల్టాడమీదుగా కొల్లేరు సరస్సులో కలిసే బుడమేరు ఉప్పొంగిన కారణంగానే విజయవాడ నగరంలోని అనేక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని సిసోడియా ప్రజెంటేషన్ ఇచ్చారు. బుడమేరకు సామర్థ్యానికి మించి వరద రావడం, గండ్లు పడటం, వరద ప్రవాహానికి ఆటంకాలు కలగడం, ప్రకాశం బ్యారేజీకి రికార్డు స్థాయిలో 11.43 లక్షల క్యూసెక్కుల వరద రావడం వంటి కారణాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని వివరించారు. ప్రజల ఆస్తులు, పంటలు, రోడ్లు, విద్యుత్, ఇరిగేషన్ వ్యవస్థలు దారుణంగా దెబ్బతిన్నాయని ఫొటోలు, వీడియోలను ప్రదర్శించారు. సీఎం చంద్రబాబుతో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం పది రోజులుగా అహర్నిశలూ పనిచేసిందని తెలిపారు. 26 ఎన్‌డీఆర్‌ఎఫ్, 22 ఎస్‌డీఆర్‌ఎఫ్, 2 నేవీ బృందాలు, 6హెలికాప్టర్‌లు, 212 బోట్లు, 488మంది గజ ఈతగాళ్లు, 606 ట్రాక్టర్లు, 330 బస్సులు, 92 ఆటో రిక్షాలు, 162 చిన్న, పెద్ద వాహనాలు, 32 జేసీబీలు, 188 టిప్పర్లు, ట్యాంకర్లు, 59 డ్రోన్ల సహాయంతో సహాయక చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. వరద బాధితులకు హెలికాప్టర్, డ్రోన్ల సాయంతో మూడు పూటలా ఆహారం అందించామని చెప్పారు. 2.06లక్షల కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేశామని, విద్యుత్తు, తాగునీటి సరఫరాను పునరుద్ధరించామని చెప్పారు.



చత్రాపల్లి గ్రామంలోకి కొట్టుకువచ్చిన కొండ రాళ్లను పరిశీలిస్తున్న అభిషేక్

శభాష్.. అభిషేక్

అడవిలో 12 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి వరద బాధితులకు పాడేరు ఐటీడీఏ పీవో పరామర్శ

చింతపల్లి, సెప్టెంబరు 11: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం చత్రాపల్లి గ్రామంలో వరద బాధితుల పరిస్థితిని తెలుసుకునేందుకు యువ ఐఏఎస్ అధికారి, పాడేరు ఐటీడీఏ పీవో వీ.అభిషేక్ అటవీ ప్రాంతంలో ఏకంగా 12 కిలోమీటర్లకుపైగా కాలినడకన వెళ్లారు. ఆదివారం రాత్రి కురిసిన భారీవర్షాలకు చత్రాపల్లి గ్రామంపై వరద విరుచుకుపడింది. కొండచరియలు విరిగిపడ్డాయి. ఒక ఇంట్లో నిద్రిస్తున్న నలుగురు ఆదివాసీలు వరదలో కొట్టుకుపోయారు. అందులో ఒక మహిళ మృతిచెందగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పదుల సంఖ్యలో ఇళ్లు దెబ్బతిన్నాయి. చత్రాపల్లికి వెళ్లే మార్గంలో మూడుచోట్ల బ్రిడ్జిలు కొట్టుకుపోవడం, ఏడుచోట్ల కొండచరియలు విరిగిపడడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం చత్రాపల్లి గ్రామానికి వెళ్లాలని పాడేరు నుంచి జీకే వీధి చేరుకున్న పీవో సంపంగిగొంది వరకూ వాహనంలో వెళ్లారు. అక్కడ నుంచి సుమారు 12 కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించి సప్పర్ల చేరుకున్నారు. అక్కడి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు పండన్న, సుమిత్ర, సుబ్బారావును పరామర్శించారు. గిరిజనులతో కలిసి పునరావాస కేంద్రంలో పీవో భోజనం చేశారు. అక్కడనుంచి ద్విచక్ర వాహనంపై 2కిలోమీటర్ల దూరంలో

పరారీలో విశ్రాంత ఐపీఎస్ విజయ్‌పాల్

సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఐపీఎస్ అధికారి విజయ్‌పాల్ పరారీలో ఉన్నారని, దర్యాప్తు అధికారులకు అందుబాటులో లేరని పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ హైకోర్టుకు నివేదించారు. నోటీసులు ఇచ్చేందుకు అధికారులు పలుసార్లు పిటిషనర్ ఇంటికి వెళ్లినా, ఆ ఇంటికి తాళం వేసి ఉంటోందని తెలిపారు. దర్యాప్తుకు సహకరించనివారు ముందస్తు బెయిల్ పొందేందుకు అనర్హులని పేర్కొన్నారు. ఈ దశలో రఘురామకృష్ణరాజు తరఫు న్యాయవాది స్పందిస్తూ... బాధితుడిగా వ్యాజ్యంలో ఇంప్లీడ్ అయ్యి వాదనలు వినిపించేందుకు అనుమతించాలని కోరారు. అనారోగ్య కారణాలతో సీనియర్ న్యాయవాది విచారణకు హాజరు కాలేకపోయారని, విచారణను వాయిదా వేయాలని కోరారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం రఘురామ వేసిన ఇంప్లీడ్ పిటిషన్‌ను అనుమతిస్తూ విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. అంతకుముందు పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది వీరారెడ్డి స్పందిస్తూ వాదనలు వినిపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆసియా-పసిఫిక్ కాన్ఫరెన్స్ చైర్మన్‌గా రామ్మోహన్‌నాయుడు

▸ ఏకగ్రీవంగా ఎన్నుకున్న 40 సభ్య దేశాల ప్రతినిధులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 2వ ఆసియా-పసిఫిక్ మినిస్టీరియల్ కాన్ఫరెన్స్(ఏపీఎంసీ) చైర్మన్‌గా కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఎన్నికయ్యారు. బుధవారం ఇక్కడ భారతమండపంలో ప్రారంభమైన ఆసియా-పసిఫిక్ మినిస్టీరియల్ కాన్ఫరెన్స్‌కు చైర్మన్‌గా ఆయనను సింగపూర్ దేశం ప్రతిపాదించగా 40 సభ్యదేశాల ప్రతినిధులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేశం తరఫున దక్కిన ఈ గౌరవాన్ని బాధ్యతగా స్వీకరిస్తానని ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు చెప్పారు.

ఆన్‌లైన్ నేరాల నిరోధంలో ఏపీ పోలీస్ భేష్

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మహిళలు, పిల్లలపై ఆన్‌లైన్ నేరాలను నిరోధించడంలో అద్భుతమైన ప్రతిభ కనబర్చినందుకు గుర్తింపుగా ఏపీ పోలీసులకు జాతీయస్థాయిలో ప్రత్యేక గౌరవం దక్కింది. భారత సైబర్ క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్ మొదటి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ అడిషనల్ డీజీపీ ఎ.రవిశంకర్, మహిళా రక్షణ విభాగం ఎస్పీ కె.జి.వి.సరితను కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఘనంగా సత్కరించారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు శ్లాఘనీయం

▸ మరిన్ని సంస్థలు ముందుకురావాలి: బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వరద బాధితులను ఆదుకోడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత కొనియాడారు. విజయవాడ రౌండ్‌టేబుల్, అమరావతి రౌండ్‌టేబుల్ స్వచ్ఛంద సేవా సంస్థలు వరద బాధితులకు అందజేయనున్న బట్టల కిట్‌ను బుధవారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధితులకు సాయమందించడానికి మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అమరావతి రౌండ్‌టేబుల్ స్వచ్ఛందసేవా సంస్థ చైర్మన్ అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి 'స్వచ్ఛతా హి సేవ'

▸ రాష్ట్ర, జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీల ఏర్పాటు

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా ఈ నెల 14వ తేదీ నుంచి అక్టోబరు 1 వరకు నిర్వహించనున్న స్వచ్ఛతా హి సేవ కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీలను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు తాజా ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర స్థాయిలో ఈ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా, మున్సిపల్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కన్వీనర్‌గా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి కోకన్వీనర్‌గా, పలుశాఖల అధికారులతో కలిపి మొత్తం 29 మంది సభ్యులతో కమిటీని నియమిస్తూ మున్సిపల్‌శాఖ ఉత్తర్వులు జారీచేసింది. అదే విధంగా జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, 20 మందితో జిల్లాస్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు.

తాగునీటి కార్పొరేషన్ ఎండీగా ఈఎన్‌సీ

ఆంధ్రప్రదేశ్ తాగునీటి సరఫరా కార్పొరేషన్ ఎండీగా ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ పి.సంజీవరెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ బాధ్యతలు నిర్వహించిన ఈఎన్‌సీ ఆర్‌వీ కృష్ణారెడ్డి రిటైరవడంతో సంజీవరెడ్డికి ఈ బాధ్యతలు అప్పగించారు.

అటవీ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

▸ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నివాళి

అటవీ సంపదను కాపాడటంలో సిబ్బంది త్యాగాలు సదా స్మరణీయమని డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా అటవీ వనరుల రక్షణలో ప్రాణాలర్పించిన సిబ్బందికి హృదయపూర్వకంగా నివాళులర్పిస్తున్నట్లు ఆయన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'అడవులు, వన్యప్రాణులను సంరక్షించే కీలకమైన కర్తవ్యాన్ని కొనసాగించడానికి వారి ధైర్యం, నిబద్ధత మనందరికీ ఎల్లప్పుడూ ప్రేరణగా ఉపయోగపడతాయి' అని పేర్కొన్నారు.



పచ్చటి కొండకు నీటి 'బొట్టు'

ప్రవాహం పరవళ్లు తొక్కుతోంది. కొండలు కోనలు దాటుతూ పచ్చని శిఖరాగ్రంపై నుంచి ఉరకలేస్తూ దూకుతోంది. ఆ వడికి నీటి తుంపరల మేఘం ఆవిష్కృతమయింది. పక్కనే పిల్ల జలపాత మొకటి తెల్లగా నురగలు కక్కుతోంది. సుమారు రెండు కిలోమీటర్లు కొండ దిగువకు వెళితే కనిపించే అత్యద్భుత డుడుమ జలపాతాల సౌందర్య దృశ్యమిది. 'ఆంధ్రజ్యోతి' కెమెరా కంటికి ఇలా చిక్కింది.

- ముంచంగిపుట్టు (అల్లూరి జిల్లా)

బయటకు రా.. ప్రైవేట్‌గా కలుద్దాం

▸ ఎస్కేయూ విద్యార్థినికి వైసీపీ విద్యార్థి విభాగం నేత లైంగిక వేధింపులు

▸ కేసు నమోదు చేసిన పోలీసులు



మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో వసి కిరణ్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 11: 'బయటకు రా.. ప్రైవేట్‌గా రూమ్‌లో కలుద్దాం' అంటూ వైసీపీ అనంతపురం జిల్లా విద్యార్థి విభాగం నాయకుడు వసి కిరణ్ అలియాస్ వాసు ఓ ఎస్కేయూ పీజీ విద్యార్థినికి తరచూ ఫోన్ చేసి లైంగికంగా వేధిస్తున్నాడు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో ఇటుకలపల్లి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. గతంలో ఉన్న పరిచయాన్ని ఆసరాగా చేసుకొని వాసు గత మూడు నెలలుగా తనను వేధిస్తున్నాడని, ఫొటోల పేరుతో బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని బాధిత యువతి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేశామని, నిందితుడి ఆచూకీ కోసం గాలిస్తున్నామని సీఐ హేమంత్ కుమార్ తెలిపారు. కేసు విషయం తెలియగానే వాసు తన సెల్‌ఫోన్‌ను స్విచ్చాఫ్ చేసుకొని అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అనంతపురం నగరానికి చెందిన వాసు.. వైసీపీ విద్యార్థి విభాగం నాయకుడిగా ఉన్నాడు. గతంలో ఎస్కేయూలోనే చదివాడు. ఇప్పటికీ ఎస్కేయూ హాస్టల్‌లోనే ఉంటున్నాడు. గత ఏడాది పీజీలో చేరిన ఓ విద్యార్థినిని కలిసిన సందర్భంలో ఫొటోలు తీసుకున్నట్లు సమాచారం. ఆ ఫొటోల పేరుతో వాసు తనను వేధిస్తున్నాడని, ఫొటోలను తన తండ్రికి చూపిస్తానని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంట్లో చెప్పలేక తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నానని ఆమె పోలీసుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.

బుడమేరులో కొనసాగుతున్న సీపేజీ నియంత్రణ పనులు

▸ గండి పూడ్చిన చోట జియోమెంబ్రేన్ షీట్లతో సమాంతర బండ్ ఏర్పాటు



బుడమేరు రెండో గండి వద్ద సీపేజ్ నియంత్రణ పనులు

జి.కొండూరు, సెప్టెంబరు 11: బుడమేరు మళ్లింపు కాలువ (బీడీసీ) ఎడమ కట్టకు గండ్లను పూడ్చిన చోట నీరు లీక్ కాకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. సీఎం చంద్రబాబు మంగళవారం గండ్ల పూడ్చివేత పనులను పరిశీలించి పలు ఆదేశాలు ఇచ్చారు. దీంతో అధికారులు గండ్లు పడిన చోట భవిష్యత్‌లో మళ్లీ గండ్లు పడకుండా అన్నివిధాలుగా కట్టను బలోపేతం చేస్తున్నారు. ముఖ్యంగా లీకేజీ కట్టడిపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద నుంచి ఎడమ కట్టకు 3.9 కిలోమీటర్ వద్ద పడిన గండి నుంచి భారీగా లీకవుతున్న వరద నీటిని జియోమెంబ్రేన్ షీట్ల (పట్టాలు)తో కట్టకు సమాంతరంగా మరో బండ్‌ను ఏర్పాటు చేసి మంగళవారం నాటికి పూర్తిగా అడ్డుకోగలిగారు. ఇది సత్ఫలితం ఇవ్వడంతో 4,4.1 కిలోమీటర్ల వద్ద పూడ్చిన గండ్లకు కూడా సదరు షీట్లతో సమాంతరంగా మరో బండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్ఎంసీ ఎస్ఈ శ్యామ్ ప్రసాద్ తెలిపారు.

సంపూర్ణంగా విద్యుత్ పునరుద్ధరణ: గొట్టిపాటి

వరద ప్రాంతాల్లో సంపూర్ణంగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. బుధవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. సీపీడీసీఎల్ పరిధిలో దెబ్బతిన్న 23 సబ్‌స్టేషన్లను, 120 ఫీడర్లను, 10,610 డీటీఆర్‌లను, 2,49,825 సర్వీసులను పునరుద్ధరించామని తెలిపారు. వీటీపీఎస్‌లో 210 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఆరు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని పునఃప్రారంభించామన్నారు. వినియోగదారులకు అంతరాయం లేకుండా సరఫరా అందిస్తున్నామని తెలిపారు.

2.25లక్షల హెక్టార్లలో పంటనష్టం: అచ్చెన్న

విపత్తులతో పంటలు నష్టపోయిన రైతులకు పెట్టుబడి సాయాన్ని పారదర్శకంగా అందించేందుకు డిజిటల్ అప్లికేషన్ విధానంలో నూతన యాప్ అందుబాటులోకి తెచ్చినట్లు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. బుధవారం వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి రాజశేఖర్, డైరెక్టర్ ఢిల్లీరావు, ఉద్యానశాఖ కమిషనర్ శ్రీనివాసులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన పంట నష్టం వివరాలను రియల్ టైమ్‌లో నమోదు చేసే యాప్‌ను రూపొందించినట్లు చెప్పారు. ఇటీవలి విపత్తుకు 2.25లక్షల హెక్టార్ల వ్యవసాయ, ఉద్యాన పంటలు ముంపుబారిన పడగా, 2.8లక్షల మంది రైతులు నష్టపోయినట్లు గుర్తించామన్నారు.



పోర్టులో లంగరు వేసిన ఎంవీ యాన్ లీ నౌక

కృష్ణపట్నం పోర్టుకు భారీ నౌక

ముత్తుకూరు, సెప్టెంబరు 11: నెల్లూరు జిల్లా అదాని కృష్ణపట్నం పోర్టులో బుధవారం భారీ నౌక (కేప్ సైజ్ వెస్సల్) లంగరు వేసింది. పోర్టులో డ్రెడ్జింగ్ పనులు జరిగిన తరువాత ఇంత భారీ నౌక రావడం ఇదే మొదటిసారి. ఎంవీ యాన్ లీ అనే ఈ నౌక మూడో నంబరు బెర్తుకు చేరుకుంది. 288.88 మీటర్ల పొడవు, 17.48 మీటర్లు లోతు కలిగిన ఈ నౌక సౌతాఫ్రికా నుంచి 1.5 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గుతో వచ్చింది.

నా భార్యకు 8 మందితో పెళ్లి!

▸ దర్యాప్తు కోరుతూ కర్ణాటక హైకోర్టుకు భర్త

▸ కాదు.. నలుగురినే చేసుకుంది

▸ మహిళ తరఫు న్యాయవాది వాదన

బెంగళూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): 'నా భార్యకు ఎనిమిది మందితో పెళ్లి జరిగింది. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేయించండి' అంటూ ఓ వ్యక్తి కర్ణాటక హైకోర్టును ఆశ్రయించడం ఆసక్తికరంగా మారింది. ఈ కేసు బుధవారం విచారణకు రాగా, మహిళ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, తన క్లయింట్‌కు ఎనిమిది మందితో పెళ్లి అబద్ధమని, నాలుగు పెళ్లిళ్లు మాత్రమే అయ్యాయని పేర్కొనడం మరింత ఆసక్తికరంగా మారింది. హొసపేటకు చెందిన రాజా హుసేన్ అనే వ్యక్తి తన భార్యకు అయిన వివాహాలపై సీసీబీ ద్వారా దర్యాప్తు జరిపించాలని హైకోర్టులో పిటిషన్ వేశాడు. తలాక్ తీసుకోకుండానే ఆమె వివాహం చేసుకుందని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. దీనికి మహిళ తరఫు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. పిటిషన్‌దారు కోర్టుకు అబద్ధాలు చెబుతున్నారని, తన క్లయింట్ నలుగురిని మాత్రమే పెళ్లి చేసుకుందని తెలిపారు. మొదటి భర్త మృతి చెందాక రెండో పెళ్లి చేసుకుందని, ఆ తర్వాత రెండు పెళ్లిళ్లు చేసుకుందన్నారు. రాజా హుసేన్‌పై పరువునష్టం దావా వేస్తామన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ ఆమె వివాహం చేసుకొన్న ఎనిమిది మందిలో ఇటీవల కోర్టు వాయిదాకు కూడా ఐదుగురు హాజరయ్యారని, అయితే ఆ రోజు విచారణ జరగలేదని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. మరో ముగ్గురు ధ్రువీకరణపత్రాలు సమర్పించారని తెలిపారు. వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్న విచారణను ఈనెల 27కు వాయిదా వేశారు.

దేవర సినిమా చూసి చచ్చిపోతా

▸ అప్పటిదాకా బతికించండి.. ప్లీజ్

▸ బ్లడ్ కేన్సర్‌తో పోరాడుతున్న యువకుడి వేడుకోలు

▸ బోన్‌మారో చేయాలన్న వైద్యులు.. ఖర్చు 60 లక్షలు.. దాతలు ఆదుకోవాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి

తిరుపతి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పందొమ్మిదేళ్ల వయసులోనే ఆ యువకుడు మృత్యువుతో పోరాడుతున్నాడు. బ్లడ్ కేన్సర్ రోజురోజుకీ మరణానికి దగ్గరవుతున్నాడు. తల్లిదండ్రులు బిడ్డను ఎలాగైనా బతికించుకోవాలని ఆరాటపడుతున్నారు. "నా బిడ్డ జూనియర్ ఎన్టీయార్‌కు వీరాభిమాని. దేవర సినిమా చూసి చచ్చిపోతా.. 27వ తేదీ దాకా బతికించండని వేడుకుంటున్నాడు. నా బిడ్డను బతికించండయ్యా" అంటూ ఆ యువకుడి తల్లి.. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియా సమావేశంలో వేడుకున్నారు. టీటీడీలో కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు, సరస్వతి దంపతుల పెద్ద కుమారుడు కౌశిక్ (19)కు 2022 నుంచీ బ్లడ్ కేన్సర్ కు చికిత్స తీసుకుంటున్నాడు. ప్రస్తుతం బెంగళూరులోని కిడ్‌వై హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు. బోన్ మారో చికిత్సకు రూ.60 లక్షలకు పైగానే ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. 'అమ్మా.... నేను బతకనని తెలుసు. నా కోసం బాధపడకండి. దేవర సినిమా విడుదల వరకూ బతికించండి చాలు.. నా చివరి కోరిక తీర్చండి' అని కౌశిక్ కోరుతున్నాడు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కౌశిక్

సాయం చేయదలచిన వారు 9490829381 ఫోన్ నంబర్‌కు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా గానీ, లేదా కె.సరస్వతి, యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 103310100044506 (IFSC.UBIN0801313)కు సాయం అందించవచ్చు. 79956 65169 ఫోన్ నంబరులో కౌశిక్ తల్లిదండ్రులను సంప్రదించవచ్చు.

ఇన్స్యూరెన్సు క్లెయిమ్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని

సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్



ఇన్స్యూరెన్స్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

విజయవాడ లీగల్, సెప్టెంబరు 11: భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన, దెబ్బతిన్న వాహనాలు, ఇళ్లు, దుకాణాలతో పాటు చిన్న, మధ్యతరహా వ్యాపార సముదాయాలు వంటి ఆస్తులకు సంబంధించి క్లయిమ్స్‌ను త్వరగా పరిష్కరించేందుకు సీఎం చంద్రబాబు మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రత్యేక ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జి.సృజన తెలిపారు. ఈనెల 9న సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాన్ని కలెక్టర్ సృజన బుధవారం సందర్శించారు. క్లయిమ్‌ల స్వీకరణ, సెటిల్‌మెంట్‌కు అందిస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎవరూ బీమా కంపెనీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 5వేల క్లయిమ్‌లు రాగా 4వేల క్లయిమ్‌లను అక్కడికక్కడే సెటిల్‌మెంట్ చేశారన్నారు. డాక్యుమెంటేషన్ విషయాల్లో ఇబ్బందులు లేకుండా సేవలందించడం జరుగుతోందని కలెక్టర్ వివరించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో బీహెచ్.భవానీశంకర్ ఉన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో నీటిని బయటికి పంపాలి..

కృష్ణలంక: లోతట్టు ప్రాంతాల్లో ఇంకా ఎక్కడైనా నీరుంటే త్వరగా బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. బుధవారం పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ కె.కన్నబాబు, కలెక్టర్ డాక్టర్ సృజనతో కలిసి అంబాపురంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పల్లపు ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపేలా కల్వర్టుల్లో డీ సిల్టింగ్ చేసి నీరు వేగవంతంగా పారేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సందర్శనలో డీపీవో ఎన్‌వీ శివప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

కబేళా ప్రాంత పరిశ్రమలకు తీవ్ర నష్టం

● ఆదుకోవాలని యజమానుల వేడుకోలు



మాట్లాడుతున్న ముక్కా వెంకటేశ్వరరావు

భవానీపురం, సెప్టెంబరు 11: బుడమేరు వరదలతో కబేళా ప్రాంతంలోని చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రూ.50 నుంచి రూ.100 కోట్ల వరకు మిషనరీ, మెటీరియల్‌కు తీవ్ర నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకొని విద్యుత్ చార్జీల రాయితీ, జీఎస్టీ చెల్లింపుల్లో 2 నెలలు సడలింపు ఇవ్వాలని రామరాజ్యనగర్ (కబేళా) ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కా వెంకటేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇండస్ట్రియల్ ఏరియాలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లలో కనీవినీ ఎరుగని రీతిలో వరదనీరు అన్ని వ్యాపార సంస్థల్లోకి పోటెత్తడంతో ఇప్పట్లో కోలుకునే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక పరిశ్రమల యజమానులు లక్ష్మీకాంతారావు, రాజేశ్వరరావు మాట్లాడుతూ ఇక్కడ పన్నులు వసూలు చేస్తున్నా సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక తీవ్రంగా నష్టపోయామన్నారు. అమరావతి పాలిప్యాక్ యజమాని ముక్కా నీలిమ, వివిధ పరిశ్రమలకు చెందిన మంగారావు, కే రవికిరణ్, అప్పారావు, ఏవీ ప్రకాష్, రిషికేష్, ఇస్మాయిల్ ఖాన్, మాధవీలత మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం చొరవ తీసుకుని పెద్ద మనసుతో రాయితీలతో పాటు, జీఎస్టీ చెల్లింపుల్లో సడలింపులివ్వాలని కోరారు.

రైతులకు గణపతి ఆశీస్సులుండాలి: ఢిల్లీరావు

వన్‌టౌన్, సెప్టెంబరు 11: రాష్ట్రంలో రైతులకు సుఖ సంతోషాలతో పాడి పంటలతో జీవించేందుకు ఎలాంటి విఘ్నాలు రాకుండా బొజ్జ గణపతి ఆశీస్సులుండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. తాడేపల్లిలోని ఆర్‌ఎల్ గౌతమి రివర్ బ్రిజ్ అపార్టుమెంట్ వాసులు 5 రోజులుగా నిర్వహిస్తున్న వినాయకచవితి వేడుకలు బుధవారం వైభవంగా నిమజ్జనంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఢిల్లీరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. అపార్టుమెంట్ వాసులు గొట్టుముక్కల వెంకట రామారావు, అడుసుమిల్లి కృష్ణప్రసాద్, మలినీడి మధుబాబు, ఉయ్యాల శేఖర్, వేమూరి ప్రసాద్, చలసాని సతీష్, యార్లగడ్డ ఉపేంద్ర, నాగిరెడ్డి నరేంద్ర బాబు, కంటే రామ్మోహన్ పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లోనూ అదే కష్టం!

● పాడైన ఫర్నిచర్.. రోడ్లపై పేరుకున్న గుట్టలు ● ఎలక్ట్రానిక్స్ రిపేర్లతో అదనపు ఖర్చు
● కిచెన్‌లో సరుకులన్నీ డ్యామేజ్ ● కుటుంబానికి గరిష్ఠంగా రూ.50 వేల వరకు నష్టం



రోడ్డుపై పేర్చిన పాడైన వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: బుడమేరు వరద వేలాది మంది ప్రజలకు కనిపించే కష్టంతోపాటు కనిపించని నష్టాన్ని కూడా తెచ్చి పెట్టింది. వరద నీటిలో నాలుగైదు రోజులపాటు ఇళ్లు నాని పోవటంతో ఇంట్లో ఉపయోగించే ఫర్నిచర్స్ పనికిరాకుండా పోయాయి. కేన్ కుర్చీలు, సోఫాలు, నవ్వారు, సాధారణ, డబుల్‌కాట్ మంచాలు, పరుపులు, దిండ్లు, దుప్పట్లు, బట్టలు, తట్టా, బుట్టలు వంటి వాటికి భారీ డ్యామేజీ జరిగింది. ఫోమ్ సోఫాలు, కుర్చీలు, పరుపులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇవన్నీ పనికిరాకుండా పోవటం గమనార్హం. ఇళ్లను శుభ్రం చేసుకుంటుండగా చీకిపోయిన ఫర్నిచర్, పరుపులు, దుప్పట్లు, సోఫాలు రోడ్డుపై చెత్త మాదిరిగా పోగు చేస్తున్నారు. ప్రతి ఇంటిలోనూ ఇదే నష్టం వాటిల్లింది. ఇలా ప్రతి కుటుంబంలోనూ రూ.10 నుంచి రూ.20 వేల వరకు నష్టం జరిగినట్టుగా తెలుస్తోంది. రెండవది కిచెన్ రూపంలో జరిగింది. ఇంట్లోని ఉల్లిపాయలు, ఎండు మిర్చి, పోపుల డబ్బాలు, సరుకులు వరదార్పణమయ్యాయి. బియ్యం బస్తాలు నానిపోయాయి. పాడైన వాటిని బుధవారం పెద్ద సంఖ్యలో ప్రజలు బయట రోడ్లపై పోగు పోశారు. ప్రాథమిక నష్టంతో పాటు రిపేర్ల పరంగా మరికొంత అదనపు నష్టం జరిగింది. ఇళ్ల ముందు నిలిపి ఉంచిన కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వరద నీటిలో మునిగిపోవటంతో వాటి రిపేర్లు ఖర్చుతో కూడుకుని ఉంది. ద్విచక్ర వాహనానికి రూ.500 నుంచి రూ.2వేల వరకు ఖర్చవుతోంది. అలాగే ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, ఏసీల రిపేర్లకు చేతిచమురు వదిలించుకోవాల్సి వస్తోంది. రెండు రోజులుగా పనికిరాని బట్టల ఏరివేత నడుస్తోంది. బట్టలు కోల్పోవటం ఒక నష్టమైతే.. మళ్లీ కొనుక్కోవటం ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే. ఈ వరదల కారణంగా ప్రతి ఇంట్లో కనిష్ఠంగా రూ.10 నుంచి గరిష్ఠంగా రూ.50వేల వరకు నష్టం జరిగినట్టు తెలుస్తోంది. వరద తగ్గినా రోడ్లపై ఇంకా మురుగు ఉండటంతో వాటిలోనే నడవాల్సి వస్తోంది. ఫ్లడ్ ఎన్యూమరేషన్‌లో భాగంగా రెవెన్యూ అధికారులు పెద్ద ఎత్తున సర్వే చేపడుతున్నారు. ఇంటికి వాటిల్లిన నష్టం నుంచి వ్యక్తిగతంగా అన్ని రకాల నష్టాన్ని అంచనా వేస్తున్నారు. వ్యక్తిగత గృహాలు, కమర్షియల్ భవనాలు, దుకాణాలకు సర్వే జరుగుతోంది. ఎన్నో కుటుంబాలు సర్వం పోగొట్టుకున్నాయి. ఫైనల్ ఎన్యూమరేషన్‌తోనే వాస్తవిక నష్టం తెలుస్తుంది.

చంద్రబాబు కార్యదక్షతతోనే విపత్తు నుంచి బయటకు..!



ఎమ్మెల్యే బొండా ఉమతో కలిసి ట్రాక్టర్లకు జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని

● ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

వన్‌టౌన్, సెప్టెంబరు 11: సీఎం చంద్రబాబు కార్యదక్షత వల్లే వరద బాధితులు విపత్తు నుంచి బయటపడ్డారని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. సత్యసాయి సేవా సెంటర్ ట్రస్ట్ బుధవారం వరద బాధితులకు పంపిణీ చేసేందుకు నిత్యావసర వస్తువులున్న ట్రాక్టర్లకు సీతారామపురంలోని సత్యసాయి మందిరం వద్ద ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, సత్యసాయి ట్రస్ట్ ఎండీ ఆర్.జె. రత్నాకర్‌తో కలిసి ఎంపీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ చంద్రబాబును ప్రజలు దేవుడిలా కొలుస్తున్నారన్నారు. సత్యసాయి ట్రస్ట్ 7వేల మందికి నిత్యావసరాలు పంపిణీ చేయటం ఆనందంగా ఉందన్నారు. వారి సేవలను గుర్తుంచుకుంటామన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సత్యసాయి ట్రస్ట్ మానవసేవే మాధవ సేవ అని భావించి రూ.2.5 కోట్ల విలువైన సరుకులు పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. ట్రస్ట్ నిర్వాహకుడు రత్నాకర్ మాట్లాడుతూ వరద బాధితులకు తమ వంతు సాయం అందించే క్రమంలో 600 మంది సభ్యులు పాల్గొన్నారన్నారు. నేషనల్ సేవాదళ్ కో-ఆర్డినేటర్ ఎస్. కోటేశ్వరరావు, గ్లోబల్ కౌన్సిల్ మెంబర్ ఎస్.జి.చలం, సత్యసాయిసేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ రావు, వైస్ ప్రెసిడెంట్ సి.హెచ్.సురేంద్ర, స్టేట్ సేవాదళ్ కో-ఆర్డినేటర్ కె. శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

హీరో సాయితేజ్‌తో కలిసి..

వన్‌టౌన్: సెంట్రల్‌లోని 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరిపేటలో చిరంజీవి యూత్ ఆధ్వర్యంలో బుధవారం వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ జరిగింది. ఎంపీ కేశినేని శివనాథ్, హీరో సాయి తేజ్ పాల్గొని బాధితులకు సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఆపద వచ్చినా సాయం చేసేందుకు మెగా ఫ్యామిలీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. మాజీ టీడీపీ ఫ్లోర్ లీడర్ యర్రబోతు రమణరావు, 57వ డివిజన్ అధ్యక్షుడు బోడి సన్యాసిరావు (నాని), నేతలు యర్రబోతు కనకారావు, మచ్చా ఇమ్మానియేల్, జనసేన నేతలు, చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

40వ డివిజన్‌లో..

పశ్చిమలోని 40వ డివిజన్ పరిధి భవానీపురం, కోళ్లఫారం రోడ్డు, 40 గజాల ప్లాట్లలో వరద బాధితులకు బుజ్జన్న వాలీబాల్ టీమ్ ఫ్రెండ్స్ సర్కిల్ అండ్ ఖాజా (వక్ఫ్‌బోర్డు డైరెక్టర్) ఆధ్వర్యంలో బాధితులకు 40వ డివిజన్ అధ్యక్షుడు చిన సుబ్బయ్య పాల్గొని చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. డివిజన్ నేతలు ఆర్.రామిరెడ్డి, రాజారెడ్డి, కృష్ణారెడ్డి, భాస్కర్ రెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

కేఎల్‌రావు నగర్‌లో..

చిట్టినగర్: వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. బుధవారం కె.ఎల్.రావునగర్‌లో వరద బాధితులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నగరంతోపాటు నగర ప్రజల్ని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు కావాల్సిన చర్యలు తీసుకుంటున్నారన్నారు. అనంతరం బాధితులకు టీడీపీ నేతలు కె.నాగుల్‌మీరా, ఎం.ఎస్ బేగ్, గుర్రం కొండతో కలిసి నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. టీడీపీ 46వ డివిజన్ అధ్యక్షుడు ప్రభుదాస్, లోకేష్ పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న చుక్కపల్లి

పాపులర్ షూమార్ట్ రూ.15 లక్షల విరాళం

వన్‌టౌన్: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి పాపులర్ షూమార్ట్ సంస్థ రూ.15లక్షల డీడీని అందించింది. సంస్థ అధినేతలు చుక్కపల్లి అరుణకుమార్, విజయకుమార్, మేనేజింగ్ పార్టనర్లు సందీప్, అభిలాష్ సీఎం చంద్రబాబును కలిసి బుధవారం ఈమేరకు డీడీని అందజేశారు. వరద బాధితుల సహాయార్థం ఈ నిధిని అందజేసినట్టు అరుణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

వహీద్ విరాళం రూ.3లక్షలు

విజయవాడ: వరద బాధితులకు కర్నూలు వాసి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వహీద్ హుస్సేన్ రూ.3 లక్షల విరాళాన్ని అందజేశారు. మహీంద్రా ట్రాక్టర్ షోరూం తరఫున ఆయన ఈ చెక్కును సీఎం చంద్రబాబుకు బుధవారం అందజేశారు. చంద్రబాబు అభినందించారు.



దుర్గమ్మ సన్నిధిలో హీరో సాయితేజ్

వన్‌టౌన్: సినీ హీరో సాయితేజ్ బుధవారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అధికారులు, సిబ్బంది ఆయనకు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం చేసుకున్న అనంతరం సాయితేజ్‌కు ఈవో కేఎస్ రామారావు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. వేద పండితులు ఆశీస్సులందజేశారు.

నేడు దుర్గగుడిలో హుండీ లెక్కింపు

వన్‌టౌన్: దుర్గమ్మకు భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను గురువారం మహామండపం 6వ అంతస్తులో లెక్కించనున్నట్టు ఈవో కేఎస్ రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు.

కాంట్రాక్టు కార్మికుల విధుల బహిష్కరణ

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ 4వ యూనిట్‌లో ఈఈ బాలకృష్ణ కొందరు కాంట్రాక్టు కార్మికులను, కొందరు అధికారులను దుర్భాషలాడినందుకు నిరసనగా కార్మికులు బుధవారం విధులను బహిష్కరించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా ఈఈ తీరుపై కాంట్రాక్టు కార్మికులు అభ్యంతరం తెలుపుతున్నా పట్టించుకోని అధికారి ఇష్టానుసారంగా దుర్భాషలాడుతూ వస్తున్నాడు. ఈ క్రమంలో కార్మికులు విధులు బహిష్కరించారు. ఈ విషయంపై ఒకటి రెండ్రోజుల్లో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీ జెన్కో ఎండీ దృష్టికి సమస్యను తీసుకెళ్లనున్నట్టు కార్మికులు తెలిపారు.

చాంబర్ ప్రతినిధులకు వినతి పత్రాలు

వన్‌టౌన్: వరద బాధిత ప్రాంతాల్లో నష్టపోయిన వ్యాపారస్తులు తమకు సహాయం అందజేయాలని కోరుతూ బుధవారం గాంధీనగర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ హాల్‌లో వినతి పత్రాలు అందజేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గడ్డం రవికుమార్, ప్రతినిధులు వీవీకే నరసింహారావు వ్యాపారుల వినతి పత్రాలు స్వీకరించారు.

ధనుజ కుమారి... చదివింది తొమ్మిదో తరగతే.
కానీ డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఆమె జీవితం ఇప్పుడు పాఠ్యగ్రంథం.
ఈ పారిశుధ్య కార్మికురాలు... ఒక మురికివాడతో పెనవేసుకున్న
తన జీవితాన్ని అక్షరబద్ధం చేశారు.
పేదరికం, వివక్షల మధ్య నలిగిపోతున్న జనం వేదనను
తన గొంతుతో చాటిచెబుతున్నారు.

ఆమె జీవితం పాఠమైంది

"తిరువనంతపురం రాజ్‌భవన్. రోజూ నా వృత్తిలో భాగంగా ఆ పక్కనుంచే వెళ్తాను. కానీ ఈ ఏడాది ఆగస్టు పదిహేనో తేదీన... మొదటిసారిగా ఆ భవనంలోకి... ప్రత్యేక అతిథిగా, కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ఆహ్వానంతో అడుగుపెట్టాను. నేను, నా కుటుంబ సభ్యులు లోపలికి వెళ్ళగానే... గవర్నర్ నవ్వుతూ పలకరించారు. మా యోగక్షేమాలు తెలుసుకున్నారు. "మీరు శక్తిమంతమైన మహిళ" అంటూ నన్ను ప్రశంసించారు. సమాజంలో చాలామంది తోటి మనిషిగానైనా పరిగణించని నాకు... ఇంతకన్నా గొప్ప గౌరవం ఏముంటుంది? గవర్నర్ ఎదుట నా భావోద్వేగాన్ని ఆపుకోలేకపోయాను. ఒక్కసారిగా నా జీవితమంతా కళ్ళముందు కదిలింది.



చేసే అవకాశాలు చాలా తక్కువ. అయితే అలాంటి ఒక అవకాశం నాకు ఊహించని విధంగా దొరికింది.

చర్చ కోసం, మార్పు కోసం...

ఎప్పుడూ వార్తల్లో ఉండే చెంగల్‌చూలాలో కొన్నేళ్ళ క్రితం రైటర్స్ మీట్ జరిగింది. స్థానికులను కూడా మాట్లాడాలని ఆహ్వానించారు. నేను కూడా మా పరిస్థితుల గురించి చెప్పాను. సమావేశం పూర్తయ్యాక... రచయిత సత్యన్ నన్ను పిలిచారు. "మీ మాటల్లో కోపం ఉంది. దాన్ని అక్షరాల్లో పెడితే బాగుంటుంది. ఇక్కడి మీ జీవితానుభవాల గురించి ఒక పుస్తకం రాయండి. మిగిలిన ప్రాంతాలవారు ఈ కాలనీ గురించి చదివినప్పుడు... అది సామాజికమైన చర్చకు, తద్వారా మార్పునకు దోహదం చేస్తుంది" అని అన్నారు. "మీరు తప్పకుండా రాయాలి. ఏవైనా సలహాలు కావాలంటే ఫోన్ చెయ్యండి" అంటూ తన వివరాలు ఇచ్చారు. కొన్నాళ్ళు ఆలోచించాక... నా అనుభవాల్ని రాయడం ప్రారంభించాను. ఆ సంగతే సత్యన్ గారికి చెప్పాను. "ఒక ఎడిటర్ ఉన్నారు. మీరు ఎలా రాసినా... దాన్ని చక్కటి భాషలో మార్చి రాస్తారు" అని ఆయన సూచించారు. "వద్దు సార్! నేను చదివింది తొమ్మిదో తరగతే. నా పుస్తకంలో భాష ఆ స్థాయిలోనే ఉండాలి" అని చెప్పాను. ఆయన కూడా సరేనన్నారు. కొన్ని నెలల్లో నా పుస్తకాన్ని పూర్తి చేశాను. దానికి 'చెంగల్‌చూలయిల్ ఎంతె జీవితమ్' (చెంగల్‌చూలాలో నా జీవితం) అని పేరు పెట్టాను. నేను ఊహాశక్తి, సృజనాత్మకత ఉన్న రచయితను కాదు. సాహిత్య భాషలో రాయడం నాకు చేతకాదు. నాకు ఎదురైన సంఘటనలు, నేను ఎదుర్కొన్న కష్టాలు, పడిన వేదనలు, సంతోషకరమైన రోజులు, నేను ధరించిన దుస్తులు, తిన్న తిండి, తిరిగిన ప్రదేశాలు... ఇలా ప్రతిదీ నాకు వచ్చిన భాషలో రాశాను. ఇది సాహిత్యం కాదు. నా జీవితం... ఒక విధంగా నా చుట్టూ ఉన్న సమాజం జీవితం

> "అక్కడ జీవితం ప్రతిరోజూ పోరాటమే. కులం, రంగు, మతం... ఇలా ప్రతి విషయంలోనూ మేము వివక్ష ఎదుర్కొంటూనే ఉంటాం. ఇప్పుడు నాకు 48 ఏళ్ళు. నా కళ్ళముందు తిరువనంతపురం ఎంతో మారింది. కానీ చెంగల్‌చూలా మాత్రం అలాగే ఉంది. రీసెర్చ్ పేరుతో, ప్రాజెక్టుల పేరుతో మా ప్రాంతానికి ఎందరో వస్తూ పోతూ ఉంటారు. కానీ ఎలాంటి ప్రగతీ ఉండదు."

అటు గుర్తింపు, ఇటు ఈసడింపులు...


2014లో సింధా పబ్లికేషన్స్ నా రచనను పుస్తక రూపంలోకి తెచ్చింది. దానికి వచ్చిన స్పందన నేను ఎన్నడూ ఊహించనిది. తద్వారా ఎందరో ప్రముఖులు నాకు పరిచయం అయ్యారు. "మీ రచన సహజంగా ఉంది. మీకు ఎదురైన సంఘటనలను నిక్కచ్చిగా వెల్లడించారు" అనే అభినందనలు... "మా గొంతు వినిపించావు" అంటూ స్థానికుల ఆత్మీయ వచనాలు... అన్నిటికన్నా సంతోషం కలిగించిన విషయమేమిటంటే "ఈ పుస్తకంలో భిన్నమైన అనుభవాలు ఉన్నాయి. ఈ తరానికి ఇది ఒక స్ఫూర్తిమంతమైన కథ..." అంటూ దాన్ని ఇటీవలే కేరళలో అతి పెద్ద విశ్వవిద్యాలయమైన 'కాలికట్ యూనివర్సిటీ' ఎంఏ సిలబస్‌లో, 'కన్నూర్ యూనివర్సిటీ' బీఏ సిలబస్‌లో చేర్చారు. సామాజిక వివక్ష గురించి విశ్వవిద్యాలయాల్లో బోధించడం చాలా మంచి విషయం. దీనివల్ల

ప్రతిరోజూ పోరాటమే...

మాది తిరువనంతపురంలోని చెంగల్‌చూలా (ప్రస్తుతం రాజాజీనగర్) మురికివాడ. నిమ్నకులానికి చెందిన కుటుంబంలో పుట్టాను. తీవ్రమైన పేదరికంలో నా బాల్యం సాగింది. రెసిడెన్షియల్ స్కూళ్ళలో తొమ్మిదో తరగతి వరకూ చదివాను. ఒకసారి డైరీ గురించి క్లాసులో మా టీచర్ చెప్పారు. 'నేను కూడా రాస్తే బాగుంటుంది కదా?' అనుకున్నాను. కొన్నాళ్ళపాటు నా దినచర్యను అందుబాటులో ఉన్న కాగితాల మీద రాసుకొనేదాన్ని. వాటిని ఏం చెయ్యాలో నాకు తెలీదు. అందుకే కొన్నాళ్ళకు చింపి పారేసేదాన్ని. అయితే భావాలను కాగితం మీద పెట్టడం మాత్రం అలవాటయింది. ఇంట్లో పరిస్థితుల వల్ల చదువు ఆపేశాను. పద్నాలుగేళ్ళ వయసులో పెళ్ళయింది. నా భర్త సతీశ్ వాద్య కళాకారుడు. చెంగల్‌చూలాలోనే మా కాపురం. నా భర్తకు వచ్చే ఆదాయం చాలేది కాదు. నేను కూడా చిన్న చిన్న పనులు చేస్తూ ఉండేదాన్ని. తరువాత మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికురాలుగా చేరాను. కూలీ నాలీ చేసుకొనేవారు ఎక్కువగా ఉండే మా మురికివాడ ఒకప్పుడు నేర కార్యకలాపాలకు పేరు పడింది. అక్కడ జీవితం ప్రతిరోజూ పోరాటమే. కులం, రంగు, మతం... ఇలా ప్రతి విషయంలోనూ మేము వివక్ష ఎదుర్కొంటూనే ఉంటాం. ఇప్పుడు నాకు 48 ఏళ్ళు. నా కళ్ళముందు తిరువనంతపురం ఎంతో మారింది. ఎన్నో ఆధునిక సౌకర్యాలు వచ్చాయి. కానీ చెంగల్‌చూలా మాత్రం అలాగే ఉంది. రీసెర్చ్ పేరుతో, ప్రాజెక్టుల పేరుతో మా ప్రాంతానికి ఎందరో వస్తూ పోతూ ఉంటారు. కానీ ఎలాంటి ప్రగతీ ఉండదు. ఇది సహజంగానే మాకు ఆగ్రహం కలిగిస్తుంది. కానీ మా ఆవేదననైనా, ఆగ్రహాన్నైనా వ్యక్తం



రాబోయే తరంలోనైనా మంచి మార్పు వస్తుందని నా ఆశ. ఇప్పుడు మరో పుస్తకం రాసే పనిలో ఉన్నాను. అది కూడా చెంగల్‌చూలా గురించే. ఇక, నా వ్యక్తిగత విషయాలకు వస్తే... ప్రస్తుతం ఘన వ్యర్థాల నిర్వహణ కోసం 'హరిత కేరళం' ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటు చేసిన 'హరిత కర్మ సేన'లో శానిటరీ వర్కర్‌గా ఉంటున్నాను. రోజూ ఇంటింటికీ వెళ్ళి చెత్త సేకరించే ఆ వృత్తే అప్పుడూ ఇప్పుడూ నా జీవనాధారం. మా ఇద్దరు అబ్బాయిలు నిధీశ్, సుధీశ్ కూడా వాద్య కళాకారులే. స్థానిక మహిళల కోసం 'వింగ్స్ ఆఫ్ విమెన్' అనే సంస్థను, దానికి అనుబంధంగా ఒక గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నాను. సామాజిక కార్యక్రమాల్లో మహిళలను భాగస్వాముల్ని చేస్తున్నాను. మన సమాజంలో వివక్ష ఇంకా పాతుకొనే ఉంది. మా అబ్బాయిలు కూడా చేదు అనుభవాలు ఎన్నో ఎదుర్కొన్నారు. రచయిత్రిగా గుర్తింపు ఒకవైపు, అట్టడుగు కులానికి చెందినదానిగా ఈసడింపులు మరొకవైపు నాకు ఎదురవుతూనే ఉన్నాయి. అవి లేని సమాజం రావాలి. అందరూ హుందాగా, గౌరవంతో, తమ శ్రమకు తగిన గుర్తింపుతో బతకాలి. అదే నా కల."



ధైర్య సాహసాలు, ధిక్కార స్వభావం, గొప్ప వ్యక్తిత్వం, సడలని ఆత్మస్థైర్యం, సమసమాజం రావాలన్న బలమైన ఆకాంక్ష... ఈ గుణాలన్నిటికీ ప్రతీక చాకలి ఐలమ్మ. ఆమె జీవితం యువతరానికి స్ఫూర్తి పాఠం. ఎన్నడూ బెడిముఖం కూడా ఎరుగని ఆ మహనీయురాలి పేరు... కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి అలంకారం కాబోతోంది. ఈ సందర్భంగా ఆమె మునిమనుమరాలు చిట్యాల శ్వేతా ఐలమ్మను 'నవ్య' పలకరించింది.

మాకు ఆ గుర్తింపు చాలు

"చాకలి ఐలమ్మ రక్తం పంచుకొని పుట్టినవారు మాత్రమే కాదు, అన్యాయాన్ని ధిక్కరించే వారంతా ఆ అమ్మకు వారసులే. చిట్యాల ఐలమ్మకు ఐదుగురు కొడుకులు, ఒక కూతురు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఒక కొడుకును రజాకార్లు పొట్టనపెట్టుకొన్నారు. మిగిలిన వారందరిలో.. ఆమె పెద్దకుమారుడు సోమయ్యకు చిన్న కొడుకైన రామచంద్రం ఒక్కరే తన నాయనమ్మ నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకొన్నారు. అతను ఐలమ్మ దగ్గరే పెరిగి పెద్దయ్యారు. ఆమె ఆదర్శాలను అనుసరించారు. సీపీఎం స్థానిక నాయకుడిగా, 20 ఏళ్ళు పాలకుర్తి సర్పంచ్‌గా పుట్టినగడ్డకు మంచి పనులెన్నో చేశారు. గ్రంథాలయం కట్టించారు. పేదలకు ఇళ్ళు మంజూరు చేయించడం, ఊరుకు రోడ్లు, తాగునీరు లాంటి మౌలిక సదుపాయాలు సమకూర్చడం కోసం ఎంతో కష్టపడ్డారు. నేను ఆ రామచంద్రం గారి చిన్నకొడుకు సంపత్‌కుమార్ భార్యను. చిట్యాల

> **ఐలమ్మపై సమగ్ర గ్రంథం**
>
> చాకలి ఐలమ్మ పోరాట పటిమను పుచ్చలపల్లి సుందరయ్య గారు 'తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం - నా అనుభవాలు' పుస్తకంలో ప్రముఖంగా ప్రస్తావించారు. భీంరెడ్డి నర్సింహారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు తదితర పెద్దలంతా వారి ఆత్మకథల్లో ఆమె వీరత్వాన్ని ఘనంగా పరిచయం చేశారు. ఇప్పటివరకు ఐలమ్మ జీవితం మీద కొన్ని రచనలు వచ్చాయి. అయితే, అవన్నీ సమగ్రంగా లేవన్నది మా మామయ్య రామచంద్రం అభిప్రాయం. ఐలమ్మ ఉద్యమ జీవితంపై సమగ్ర గ్రంథాన్ని అతి త్వరలోనే తీసుకురాబోతున్నాం.

వారింట 2007లో అడుగుపెట్టాను. గొప్ప చరిత్ర కలిగిన కుటుంబానికి కోడలిగా వచ్చానని అంతవరకూ నాకు తెలీదు. ఒకసారి ఐలమ్మ విగ్రహావిష్కరణకు మామయ్య వెంట నేనూ వెళ్లాను. అప్పుడు ఆ వీరనారి సాగించిన ఆత్మగౌరవ పోరాటాన్ని ప్రజలంతా వేనోళ్లా కీర్తించడం విని పులకించిపోయాను. "ఈ భూమి నాది. పండించిన పంట నాది. తీసుకెళ్ళడానికి దొరెవ్వడు?" అని సివంగిలా గర్జించిన ఐలమ్మ జీవితం నన్ను కదిలించింది. ఆ స్ఫూర్తితోనే నా పేరును 'శ్వేత ఐలమ్మ'గా మార్చుకున్నాను. నా వంతు సేవ చేయాలనే సంకల్పంతో ప్రజాజీవితంలోకి వచ్చాను. ప్రతి సంవత్సరం ఐలమ్మ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడంలో నా వంతు పాత్ర పోషిస్తున్నాను.

ఇన్నాళ్ళకు గుర్తింపు దక్కింది...

కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు ప్రకటించడం... ఆ పోరాటయోధురాలికి దక్కిన ఘనమైన నివాళి. ఆమె చరిత్ర తరతరాలకు తెలిసేలా ఇలాంటిదేదైనా మంచి నిర్ణయం ప్రభుత్వం తీసుకుంటే బావుంటుందని కుటుంబ సభ్యులమంతా చాలారోజులుగా అనుకొంటున్నాం. నిజానికి ఐలమ్మకు వారసులు ఉన్నారని సమాజానికి తెలిసిందీ, ఐలమ్మ వారసులుగా మాకు ప్రత్యేక గుర్తింపు, గౌరవం లభించిందీ కూడా ఇప్పుడే. ఇంతకు ముందు కొందరు తమ రాజకీయ లబ్ధి కోసం ఐలమ్మ పేరును బాగా ఉపయోగించుకొన్నారు. ఆమె వారసులమైన మమ్మల్ని కావాలని విస్మరించారు. నాలుగేళ్ళ కిందట మంత్రిగా ఉన్న ఒక పెద్దమనిషి అయితే విగ్రహావిష్కరణ సభకు వచ్చి, మా ఊసే ఎత్తకుండా ఉపన్యాసాలిచ్చారు. మాకు కీర్తికిరీటాలు అక్కర్లేదు, కేవలం ఐలమ్మ వారసులుగా గుర్తింపు మాత్రమే ఆశించాం. అది ఇన్నాళ్ళకు దక్కినందుకు చాలా ఆనందంగా ఉంది. నన్ను తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమిస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనడం సంతోషం. దాన్ని పదవి లేదా హోదా అనుకోకుండా.. బాధ్యతగా భావించి నిర్వర్తించేందుకు ప్రయత్నిస్తాను.

ఆమెకు భయమనేది తెలియదు

ఐలమ్మ తరతరాలుగా వస్తున్న వృత్తిచేయడం ఇష్టంలేకనే నాగలి పట్టింది. కౌలు రైతుగా మారింది. ఇది మా మామయ్య చెప్పగా విన్నాను. వందకుపైగా గొర్రెలు, యాభై పశువులు, ఐదు ఎడ్ల జతలతో చాలా పెద్ద వ్యవసాయమట. స్వాభిమానానికి ప్రతీకగా తలెత్తుకు బతుకుతున్న ఐలమ్మను చూసి విస్నూరు దొరకు కడుపు మండింది. దొరలకు వ్యతిరేకంగా గొంతెత్తిందని తెలిసి, 200మంది గూండాలను పంపాడు. వారంతా ఇంటి మీద పడి గొర్రెలు, మేకలు, పశువులు.. అన్నిటినీ తోలుకెళ్లారు. అన్నం కుండలు, నీటి తొట్టెలతో సహా వస్తువులన్నిటినీ ధ్వంసం చేశారు. పచ్చిబాలింతగా ఉన్న ఆమె కూతురిపై అఘాయిత్యానికి తెగబడ్డారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భర్తను, కొడుకును ఐలమ్మ కోల్పోయింది. అయినా, ఆ యోధురాలు అడుగు వెనక్కివేయలేదు. తన పోరాటాన్ని మరింత ఉధృతం చేసింది. రోకలి బండ చేతపట్టి దొరలు, దేశ్‌ముఖ్‌ల మోచేతినీళ్ళు తాగే గూండాలను పరుగులు తీయించింది. ఆమెకు భయమనేది తెలియదు. కోర్టు విచారణకు పాలకుర్తి నుంచి హైదరాబాద్ కాలినడకన వెళ్లి వచ్చేదని తెలిసి ఆశ్చర్యం కలిగింది. పోరాట పటిమ, తెగువ, ఆత్మస్థైర్యం, ధైర్యసాహసాల్లో మనమంతా ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి.

> **అక్కడా ఐలమ్మ విగ్రహాలు...**
>
> వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాలు తెలంగాణలోనే కాదు... ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్ల, కర్నూలు, విజయవాడ తదితర ప్రాంతాల్లో కూడా నెలకొల్పారు. ఆమెకు దేశమంతటా అభిమానులున్నారు.
>
> ఇప్పటివరకు 290కుపైగా విగ్రహాలున్నాయి. పాలకుర్తిలో స్మారక స్థూపం, స్మారక భవనంతో పాటు 550 కిలోల కంచుతో చేసిన కాంస్య ప్రతిమ... ఇవన్నీ ఐలమ్మ వీరత్వానికి చిహ్నాలుగా మా ప్రాంత యువతను ఉత్తేజితులను చేస్తున్నాయి. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎర్రకోట ముందు చాకలి ఐలమ్మ శకటం ఊరేగించడం... అది సబ్బండ వర్గాలకు దక్కిన గౌరవం.

సాదాసీదా జీవితం...


తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ముగిసిన తర్వాత ఐలమ్మ అత్యంత సాదాసీదా జీవితమే గడిపింది. ఒంట్లో ఓపిక ఉన్నంత కాలం వరినాట్లు లాంటి వ్యవసాయ పనులు చేసింది. నాట్ల పాటలు, బతుకమ్మ పాటలు చాలా బాగా పాడేదని మా మామయ్య చెబుతుంటారు. స్వాతంత్ర్య సమరయోధుల పింఛను కూడా ఆమెకు రాలేదు.

భీంరెడ్డి నర్సింహారెడ్డి, ఆరుట్ల లక్ష్మీనరసయ్య, కమలాదేవి, మల్లు స్వరాజ్యం లాంటి వాళ్ళు అప్పుడప్పుడు వస్తుండేవారట. వారిని ఆమె సొంత కొడుకులు, కూతుళ్ళలా అనుకొన్నది. వారందరూ ఆరుబయట నులకమంచం మీద కూర్చొని... పోరాటం తాలూకు జ్ఞాపకాలను గుర్తుచేసుకొనేవారు. ఐలమ్మ సాహసగాథను ఆమె ముందే 'శారదకాండ్రు' (జానపద గాయకులు) కథగా చెబుతుంటే, విని మురిసిపోయేది. దేవులపల్లి వెంకటేశ్వరరావు గారు అజ్ఞాతంలో ఉన్నసమయంలో 'జనవాణి' పత్రికను ఆమె చేతుల మీదుగా ఆవిష్కరించజేశారట. ఆనాటి కమ్యూనిస్టు యోధులందరికి ఆమె అంటే చాలా గౌరవమట. ఇవన్నీ మా రామచంద్రం మామయ్య ద్వారా విన్నాను. ఇంత గొప్ప ఇంటికి కోడలిగా వచ్చినందుకు, ఐలమ్మకు వరుసకు మునిమనుమరాలిని అయినందుకు గర్వపడుతున్నాను. సమాజం కోసం నిస్వార్థంగా పోరాడిన ఐలమ్మ కుటుంబ సభ్యురాలుగా నాకు ఈ గుర్తింపు, గౌరవం దక్కడం నా అదృష్టం. దీన్ని నిలబెట్టుకోవడమే నా ముందున్న బాధ్యత.

● కేవీ

యోగాతో మధుమేహానికి చెక్!

యోగా చేస్తే మధుమేహం వచ్చే అవకాశాలు తగ్గుతాయా? ఈ రెండింటికీ సంబంధం ఉందా? ఈ ప్రశ్నలకు ఢిల్లీలోని జీటీబీ ఆసుపత్రికి చెందిన పరిశోధకులు చేసిన అధ్యయనంలో సమాధానాలు లభించాయి. క్రమం తప్పకుండా ప్రతి రోజూ 40 నిమిషాలు యోగా చేస్తే - మధుమేహం వచ్చే అవకాశాలు 40 శాతం తగ్గుతాయని అధ్యయనంలో తేలింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అంచనాల ప్రకారం- మన దేశంలో 10 కోట్ల మంది మధుమేహ వ్యాధితో (టైప్ 2) బాధపడుతున్నారు. సుమారు 13 కోట్ల మంది మధుమేహ వ్యాధికి చేరువ (ప్రీ డయాబిటిస్)లో ఉన్నారు. ఇప్పటిదాకా కేవలం జీవన శైలిని మార్చుకోవటం ద్వారా మధుమేహానికి అడ్డుకట్ట వేయవచ్చని భావించేవారు. కానీ ఈ మధ్య కాలంలో కొన్ని అధ్యయనాలలో ఇది నిజం కాదని తేలింది. "మేము చేసిన అధ్యయనంలో సుమారు 500 మంది పాల్గొన్నారు. వీరిని రెండు గ్రూపులుగా విభజించాము. ఒక గ్రూపులో వారు జీవన శైలిని మాత్రమే మార్చుకొన్నారు. మరొక గ్రూపు వారు జీవన శైలిని మార్చుకోవటంతో పాటుగా ప్రతి రోజూ 40 నిమిషాలు యోగా కూడా చేశారు. యోగా చేసిన వారిలో బ్లడ్ సుగర్ విలువలు నియంత్రణలోకి వచ్చాయి" అని ఈ అధ్యయనంలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ మధు వెల్లడించారు.



కౌన్సెలింగ్

రక్తహీనతకు సిద్ధ వైద్యం

డాక్టర్! మా అమ్మాయికి పదిహేనేళ్లు. రక్తహీనతతో బాధపడుతోంది. వైద్యులు సూచించిన మందులు కూడా అంతగా ఫలితాన్నివ్వలేదు. బలహీనత, నిస్సత్తువలతో బాధపడుతున్న మా అమ్మాయికి సమర్థమైన సిద్ధ మందులను సూచిస్తారా?

- ఓ సోదరి, హైదరాబాద్.



అనీమియాకు సిద్ధ వైద్యంలో అద్భుతమైన మందులున్నాయి. ఇటీవలే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిద్ధ (ఎన్ఐఎస్), ఆయుష్ మంత్రిత్వ శాఖ, తమిళనాడులోని వెలుమైలు సిద్ధ మెడికల్ కాలేజీలకు చెందిన పరిశోధకులు, నిపుణులు అన్నపెటి సెంటురమ్, భావన కటుక్కాయ, మతులై మనప్పాకు, ఉసిరి లేహ్యాలను తీసుకోవడం ద్వారా హిమోగ్లోబిన్ మోతాదు పెరుగుతుందని ప్రయోగాల ద్వారా కనిపెట్టారు. ఈ సిద్ధ మందులతో ప్యాక్డ్ సెల్ వాల్యూమ్, మీన్ కార్పస్క్యులర్ హిమోగ్లోబిన్‌లు కూడా పెరుగుతాయని, తద్వారా కౌమార బాలికల్లో రక్తహీనతను నివారించవచ్చని కనిపెట్టారు.

45 రోజుల వైద్యం

సాధారణంగా రక్తహీనతలో అలసట, నిస్సత్తువ, తల తిరుగుడు, తలనొప్పి, ఆనోరెక్సియా మొదలైన లక్షణాలు కనిపిస్తూ ఉంటాయి. ఆకలి కూడా తగ్గిపోతుంది. ఈ లక్షణాలు కనిపించిన ఆడపిల్లలు నెలసరి సమయంలో మరింత బలహీనపడిపోతూ ఉంటారు. ఇదే పరిస్థితి మరింత తీవ్రమైతే ఎదుగుదల, పునరుత్పత్తి వ్యవస్థల మీద ప్రభావం పడుతుంది. కాబట్టి రక్తహీనతను గుర్తించిన వెంటనే సమర్థమైన జాగ్రత్తలతో సమస్యను సరిదిద్దే ప్రయత్నం చేయాలి. పైన పేర్కొన్న సిద్ధ మందులను క్రమం తప్పకుండా 45 రోజుల పాటు అందించగలిగితే కచ్చితంగా మార్పు కనిపిస్తుంది. రక్తంలో హిమోగ్లోబిన్ 11.9 మిల్లీగ్రామ్స్ పర్ డెసిలీటరు ఉండాలి. హిమోగ్లోబిన్ మోతాదు 8.0 ఎమ్‌జి/డిఎల్‌కు పడిపోతే తీవ్రమైన అనీమియాగా పరిగణించాలనీ, 8.0 నుంచి 10.9 ఎమ్‌జి/డిఎల్‌ను మధ్యస్థ అనీమియాగా పరిగణించాలనీ, 11.0 నుంచి 11.9 ఎమ్‌జి/డిఎల్‌ను స్వల్ప అనీమియాగా పరిగణించాలనీ, తాజాగా ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించింది. కాబట్టి రక్తపరీక్షల్లో అనీమియాగా తేలితే, పౌష్టికాహారంతో పాటు సిద్ధ వైద్యం సూచించే మందులను వాడుకోవడం మొదలుపెట్టాలి. 45 రోజుల్లో కచ్చితమైన ఫలితం కనిపిస్తుంది.

- డాక్టర్ మోహన్
సిద్ధ వైద్యులు, హైదరాబాద్



బాద్‌షా ఫిదా

కళాశాలలో ఉత్సవం. వందల్లో ఆహూతులు. వేదిక మీద ఆట పాట.

బ్యాక్‌గ్రౌండ్‌లో హిట్ నంబర్ 'కాలా చష్మా..' వినిపిస్తుంటే... మాస్ స్టెప్పులతో కుర్రకారు తమను తాము మరిచిపోయారు.

ఇంతలో ఓ అధ్యాపకురాలు... ఉన్నట్టుండి వేదిక ఎక్కి... మెరుపులా మెరిశారు. మరో ముగ్గురు ప్రొఫెసర్లు ఆమెకు తోడయ్యారు. విద్యార్థినులతో కలిసి కాలు కదిపి... వారిలో ఒకరయ్యారు.

ఇక చెప్పేదేముంది... ఒక్కసారిగా అక్కడున్నవారిలో ఉత్సాహం ఉరకలు వేసింది. ఆనందం అంచులకు వెళ్లింది. ఆ వీడియో ఇప్పుడు నెట్టింటిని ఊపేస్తోంది.

ఇంతకీ ఈ వేడుక ఎక్కడనేగా! కేరళ రాష్ట్రం కొచ్చిలోని 'సెయింట్ థెరెసా కాలేజీ'లో ఇటీవల ఓ ఉత్సవం జరిగింది. విద్యార్థుల్లోని కళాకారుల్ని ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన ఈ షోకు రూపకర్త... భరత నాట్యం అసిస్టెంట్ ప్రొఫెసర్ అరుణిమా దేవశీష్. ఈ వీడియోలో చీర కట్టుతో కనిపించిన ఆమె... సంప్రదాయ నృత్యానికి పాశ్చాత్య హంగులు అద్ది... అదరహో అనిపించారు. దాన్ని ఎవరో వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. గంటల వ్యవధిలోనే లక్షల మంది వీక్షించారు.

విశేషమేమంటే... 'కాలా చష్మా' పాట పాడిన స్టార్ ర్యాపర్ బాద్‌షా కూడా అరుణిమా డ్యాన్స్‌కు ఫిదా అయ్యాడు. ఆమె వీడియోకు ఒక లైక్ వేసుకున్నాడు. దాంతో వీక్షకుల సంఖ్య అమాంతం పెరిగిపోయింది. ఇప్పటికి దాదాపు 1.2 కోట్లమంది వీక్షించారు. ఇన్‌స్టాలోనే కాకుండా ఫేస్‌బుక్, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాలన్నిటిలో అరుణిమా నాట్యం హాట్ ఫేవరెట్ అయింది.

'బాద్‌షా కూడా మా వీడియోను మెచ్చుకున్నాడు' అంటూ సంతోషం వ్యక్తం చేసిన ఈ ప్రొఫెసర్‌కు అసలు వీడియో సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ అయిన విషయమే తెలియదట. "నా శిష్యుల్లో ఎవరో దాన్ని పోస్ట్ చేశారు. ఒక్కసారిగా వ్యూస్ పెరిగిపోవడంతో 'నీ డ్యాన్స్ అద్భుతం' అంటూ సన్నిహితులు, బంధువుల నుంచి నాకు ఫోన్లు రావడం మొదలయ్యాయి. మంచి బీట్ ఉన్న పాట... దానికి మా కాలేజీ అమ్మాయిల స్టెప్పులు చూసి... నాకు కూడా ఉత్సాహం వచ్చేసింది. అలా స్టేజీ మీదకు వెళ్లి, వారితో కలిసి ఆడేశాను. ఇంతలా నచ్చుతుందని అస్సలు ఊహించలేదు' అంటారు అరుణిమా. ప్రొఫెషనల్ డ్యాన్సర్ కావాలన్నది ఆమె చిన్ననాటి కల. దాని కోసమే భరత నాట్యం నేర్చుకున్నారు. చివరకు ఇలా అధ్యాపకురాలిగా స్థిర పడ్డారు.

'మా విద్యార్థినుల్లోని కళాత్మక కోణాన్ని వెలికి తీయడానికి ఏటా టాలెంట్ షోలు నిర్వహిస్తాం. గత ఏడాది కూడా ఇలానే వాళ్లతో కలిసి నేను చేసిన డ్యాన్స్‌కు మంచి స్పందన వచ్చింది. ఇన్‌స్టాలో ఆ వీడియోను ముప్ఫై లక్షల మందికి పైగా చూశారు. బహుశా దాన్ని దృష్టిలో పెట్టుకొనే మళ్లీ నా వీడియోను నాకు తెలియకుండా పోస్ట్ చేసివుంటారు'



అంటూ తన సంతోషాన్ని పంచుకున్నారు అరుణిమా. అయితే షోకి ముందు రిహార్సల్స్ లాంటివి ఏవీ ఉండవట. వేదిక ఎక్కిన తరువాత సంగీతానికి అనుగుణంగా ఎవరికి వారు లయబద్ధంగా నర్తిస్తారని, అదే సహజసిద్ధంగా, చూడముచ్చటగా ఉంటుందని అంటారు ఆమె.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● గురువారం 12 సెప్టెంబరు 2024



ఎన్‌జీ రంగా వర్సిటీలో
ఎన్‌ఆర్‌ఐ కోటా

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ఎన్‌ఆర్‌ఐ/ఎన్‌ఆర్‌ఐ స్పాన్సర్డ్ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తు గడువు పొడిగించింది. అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. పీజీ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. పీహెచ్‌డీ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తిచేసే వీలుంది.

విభాగాలు

- అగ్రికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కమ్యూనిటీ సైన్స్(హోమ్ సైన్స్)

స్పెషలైజేషన్‌లు

అగ్రికల్చర్: జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, ప్లాంట్ పాథాలజీ, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రో బయాలజీ, సాయిల్ సైన్స్, మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, ఎంటమాలజీ, ఆగ్రోనమీ, అగ్రికల్చరల్ ఎకనామిక్స్, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్.

అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ: సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేషన్ ఇంజనీరింగ్, ప్రాసెస్ అండ్ ఫుడ్ ఇంజనీరింగ్, ఫామ్ మెషినరీ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ.

కమ్యూనిటీ సైన్స్(హోమ్ సైన్స్): ఫుడ్ అండ్ న్యూట్రిషన్, హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ ఫ్యామిలీ స్టడీస్, రిసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ కన్జ్యూమర్ సైన్స్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్.

క్యాంపస్‌లు

- బాపట్ల, తిరుపతి, నైరా, మహానంది అగ్రికల్చరల్ కాలేజీలు
- గుంటూరులోని ఏపీజీసీ
- బాపట్లలోని డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్
- బాపట్లలోని డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ
- లామ్‌లోని అడ్వాన్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్

సీట్ల వివరాలు

- పీజీ ప్రోగ్రామ్‌లో 53 సీట్లు ఉన్నాయి. కమ్యూనిటీ సైన్స్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగాలకు ఒక్కోదానిలో రొటేషనల్ బేసిస్ మీద 6 సీట్లు నిర్దేశించారు. అగ్రికల్చర్ విభాగానికి 41 సీట్లు కేటాయించారు.
- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో 14 సీట్లు ఉన్నాయి. కమ్యూనిటీ సైన్స్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగాలకు ఒక్కో దానిలో రొటేషనల్ బేసిస్ మీద ఒక సీటు నిర్దేశించారు. అగ్రికల్చర్ విభాగానికి 12 సీట్లు కేటాయించారు.

అర్హత

- పీజీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఐకార్ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి.
- పీహెచ్‌డీలో ప్రవేశానికి ఐకార్ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్ విభాగాల్లో కనీసం 60 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసి ఉండాలి.
- అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 40 ఏళ్లు మించకూడదు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **దరఖాస్తు:** వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి పీజీ, డిగ్రీ, ఇంటర్, పదోతరగతి మార్కుల పత్రాలు, స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్‌ఆర్‌ఐ వీసా-పాస్‌పోర్ట్- ఆదాయం ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. ఎన్‌ఆర్‌ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లామ్, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

మౌలానా ఆజాద్ వర్సిటీలో
స్పాట్ అడ్మిషన్స్

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ- సెంట్రల్ యూనివర్సిటీ)- పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో సీట్లు ఉన్నాయి. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా అడ్మిషన్ పోర్టల్‌లో అప్లయ్ చేసుకోవాలి. తరవాత హైదరాబాద్ క్యాంపస్‌లోని సంబంధిత డిపార్ట్‌మెంట్‌లో రిపోర్ట్ చేయాలి. ఇప్పటికే దరఖాస్తు చేసుకొని సీటు పొందలేని అభ్యర్థులు మరల అప్లయ్ చేయనవసరం లేదు.


ప్రోగ్రామ్‌లు-సీట్లు

- సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఉర్దూ - 27
- సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియెన్సీ ఇన్ టర్కిష్ - 10
- సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియెన్సీ ఇన్ అరబిక్ - 12
- సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియెన్సీ ఇన్ ఫ్రెంచ్ - 18
- సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియెన్సీ ఇన్ రష్యన్ - 26
- సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియెన్సీ ఇన్ తెలుగు - 15
- డిప్లొమా ఇన్ ఫ్రెంచ్ - 27
- డిప్లొమా ఇన్ అరబిక్ - 16
- డిప్లొమా ఇన్ పాస్తో - 26
- పీజీ డిప్లొమా ఇన్ ప్రొఫెషనల్ అరబిక్ - 18
- పీజీ డిప్లొమా ఇన్ ఫంక్షనల్ హిందీ - 17

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **అభ్యర్థులు క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాల్సిన తేదీ:** సెప్టెంబరు 17
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** సెప్టెంబరు 19
- **అడ్మిషన్ ఫీజు చెల్లింపు:** సెప్టెంబరు 20 నుంచి 22 వరకు
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 23 నుంచి
- **వెబ్‌సైట్:** www.manuu.edu.in

శ్రీ చిత్ర తిరునల్ ఇన్‌స్టిట్యూట్‌లో
అకడమిక్ ప్రోగ్రామ్‌లు



త్రివేండ్రంలోని శ్రీ చిత్ర తిరునల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ(ఎస్‌సీటీఐఎంఎస్‌టీ)- డిప్లొమా, పీజీ డిప్లొమా, అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆపరేషన్ థియేటర్ అండ్ అనెస్థీషియా టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: ఆపరేషన్ థియేటర్‌కు డిప్లొమా(ఎలక్ట్రానిక్స్/బయోమెడికల్ ఇంజనీరింగ్ /ఇన్‌స్ట్రుమెంటేషన్); ఇమేజింగ్ టెక్నాలజీకి రెండేళ్ల సీఆర్‌ఏ/డీఆర్‌టీ కోర్సు పూర్తిచేసి ఉండాలి.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. కార్డియాక్ ల్యాబొరేటరీ టెక్నాలజీ, న్యూరో టెక్నాలజీ, మెడికల్ రికార్డ్స్ సైన్స్, క్లినికల్ పెర్ఫ్యూజన్, బ్లడ్ బ్యాంకింగ్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బయలాజికల్ సైన్సెస్, బయోటెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ ప్రధాన సబ్జెక్టులుగా బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. అభ్యర్థుల వయసు ప్రోగ్రామ్ ప్రారంభం నాటికి 25 ఏళ్లు మించకూడదు.

అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో ఫిజియోథెరపీ ఇన్ న్యూరోలాజికల్ సైన్సెస్, ఫిజియోథెరపీ ఇన్ కార్డియోవాస్కులర్ సైన్సెస్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: నాలుగేళ్ల వ్యవధి గల బ్యాచిలర్ డిగ్రీ ఇన్ ఫిజియోథెరపీ(బీపీటీ) ఉత్తీర్ణులై ఉండాలి. ఫిజియోథెరపీలో ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి.

పీహెచ్‌డీ: ఏడాదికి రెండుసార్లు ప్రవేశ ప్రక్రియ నిర్వహిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా అయిదేళ్లలో పూర్తిచేయాలి. నిబంధనల ప్రకారం ఎంపిక చేసినవారికి ఫెలోషిప్ అందిస్తారు. హెల్త్ సైన్సెస్ విభాగంలో పార్ట్ టైం ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. అభ్యర్థులు దరఖాస్తుతోపాటు కనీసం వెయ్యి పదాలతో రీసెర్చ్ ప్రపోజల్, కనీసం 300 పదాలతో స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ అప్‌లోడ్ చేయాలి.

స్పెషలైజేషన్‌లు: ఫిజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్/బయో మెడికల్ సైన్సెస్, బయో ఇంజనీరింగ్, బయోమెటీరియల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మెడికల్ సైన్సెస్, హెల్త్ సైన్సెస్.

అర్హత: ఫిజికల్ సైన్సెస్‌కి పీజీ(ఫిజిక్స్ విభాగాలు); కెమికల్ సైన్సెస్‌కి పీజీ(కెమిస్ట్రీ విభాగాలు); బయలాజికల్ సైన్సెస్/బయో మెడికల్ సైన్సెస్‌కి పీజీ(ఫిజియాలజీ/బయోకెమిస్ట్రీ/బయోటెక్నాలజీ/జువాలజీ/బయోఇన్ఫర్మాటిక్స్/ప్లాంట్ సైన్సెస్/డెంటిస్ట్రీ/వెటర్నరీ సైన్స్); బయోఇంజనీరింగ్‌కి పీజీ(పాలిమర్ ఇంజనీరింగ్/మెటీరియల్ సైన్స్/బయోమెడికల్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/బయోటెక్నాలజీ/కెమికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ); బయోమెటీరియల్ సైన్స్ అండ్ టెక్నాలజీకి పీజీ(ఫిజిక్స్/ కెమిస్ట్రీ/పాలిమర్ కెమిస్ట్రీ/పాలిమర్ సైన్స్/మెటీరియల్ సైన్స్/బయోటెక్నాలజీ/వెటర్నరీ సైన్స్)/ఎంఫిల్(బయోమెడికల్ టెక్నాలజీ); హెల్త్ సైన్సెస్‌కి పీజీ(మోడరన్ మెడిసిన్/పబ్లిక్ హెల్త్/డెంటిస్ట్రీ/నర్సింగ్/వెటర్నరీ సైన్స్/డెమోగ్రఫీ/ఎకనామిక్స్/సోషియాలజీ/సోషల్ వర్క్/పొలిటికల్ సైన్స్/ బిజినెస్ మేనేజ్‌మెంట్/పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్/స్టాటిస్టిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. మెడికల్ సైన్సెస్‌కి మాత్రం ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతోపాటు ఏడాది వ్యవధి గల రొటేటింగ్ ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి. స్టేట్ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు తప్పనిసరి. ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** పీహెచ్‌డీకి రూ.1500 (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1200); మిగిలిన ప్రోగ్రామ్‌లకు రూ.800(ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.640)
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **ఎంట్రెన్స్ టెస్ట్‌లు, ఇంటర్వ్యూలు:** నవంబరు 14 నుంచి 16 వరకు
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** 2025 జనవరి 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.sctimst.ac.in

రైల్వేలో గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులు

ఖాళీలు 11558

రైల్వే మంత్రిత్వశాఖ పరిధిలోని రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బీ) కింద పేర్కొన్న గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ పోస్టుల భర్తీకి సంబంధించిన నాన్-టెక్నికల్ పాపులర్ కేటగిరీ(ఎన్‌టీపీసీ) నోటిఫికేషన్‌ని విడుదల చేసింది.

ఆర్ఆర్‌బీ రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువాహటి, గోరఖ్‌పూర్, జమ్మూ అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్దా, ముంబయి, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం.

గ్రాడ్యుయేట్ పోస్టులు

1. కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్: **1,736 పోస్టులు**
2. స్టేషన్ మాస్టర్: **994 పోస్టులు**
3. గూడ్స్ రైలు మేనేజర్: **3,144 పోస్టులు**
4. జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్: **1,507 పోస్టులు**
5. సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్: **732 పోస్టులు**

అర్హత: సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత

వయోపరిమితి: 2025 జనవరి 01 నాటికి 18 నుంచి 36 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ప్రారంభ వేతనం: నెలకు రూ.29,200 నుంచి రూ.35,400 వరకు చెల్లిస్తారు.

అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులు

1. కమర్షియల్ కమ్ టికెట్ క్లర్క్: **2,022 పోస్టులు**
2. అకౌంట్స్ క్లర్క్ కమ్ టైపిస్ట్: **361 పోస్టులు**
3. జూనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్: **990 పోస్టులు**
4. ట్రైన్స్ క్లర్క్: **72 పోస్టులు**

వయోపరిమితి: 2025 జనవరి 1 నాటికి 18 నుంచి 33 ఏళ్ల మధ్య ఉండాలి.ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ప్రారంభ వేతనం: నెలకు రూ.19,900 నుంచి రూ.21,700 వరకు.

అర్హత: 12వ తరగతి ఉత్తీర్ణత.

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(టైర్-1, టైర్-2), స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా.

దరఖాస్తు రుసుము: జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ కేటగిరీ అభ్యర్థులకు రూ.500. ఎస్సీ, ఎస్టీ, ఈఎస్ఎం, ఈబీసీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు రూ.250

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: సెప్టెంబరు 14

చివరి తేదీ: అక్టోబరు 13

వెబ్‌సైట్: www.rrbapply.gov.in/#/auth/landing



న్యూ ఇండియా అస్యూరెన్స్‌లో ఆఫీసర్ ఖాళీలు

ఖాళీలు 170

ముంబయిలోని న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్(ఎన్ఐఏసీఎల్)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్

1. జనరలిస్ట్: **120 పోస్టులు**
2. అకౌంట్స్: **50 పోస్టులు**

అర్హత: జనరలిస్ట్ కేటగిరీకి ఏదైనా డిగ్రీ/పీజీ, అకౌంట్స్ కేటగిరీకి చార్టర్డ్ అకౌంటెంట్(ఐసీఏఐ)/కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్, ఏదైనా డిగ్రీ/పీజీ లేదా ఎంబీఏ ఫైనాన్స్/పీజీడీఎం ఫైనాన్స్/ఎంకాం ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 సెప్టెంబరు 1 నాటికి 21 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

పే స్కేల్: నెలకు రూ.50,925 నుంచి రూ.96,765 వరకు చెల్లిస్తారు.

ఎంపిక ప్రక్రియ: ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 29

వెబ్‌సైట్: https://www.newindia.co.in/portal/



లిటిల్స్



అత్యాశ ఫలం

ఒక ఊరిలో గోవిందుడనే యువకుడు ఉండేవాడు. అతను తన దగ్గర ఉన్న ఆవులను సమీపంలో ఉన్న కొండ ప్రాంతానికి తీసుకువెళ్లి, మేపుకుని సాయంత్రానికల్లా తిరిగి తీసుకొచ్చేవాడు. తన పశువులు ఎక్కడైనా తప్పిపోతాయేమో అన్న భయంతో అతను వాటి మెడలో చిన్న చిన్న గంటలను కట్టాడు. ఆ గంటలు చేసే శబ్దాలను బట్టి తన ఆవులు ఎక్కడ ఉన్నదీ తెలుసుకునేలా ఆ ఏరాటు చేసుకున్నాడు. వాటిలో అతనికి చాలా ఇష్టమైన మేలు జాతి ఆవు ఒకటి ఉంది. దాని మెడలో అన్నిటికంటే ఖరీదైన గంట కట్టాడు, తన వద్ద ఉన్న ఒక గంట మోగించగానే ఆ ఆవు తన పిలుపు విని దగ్గరకు వచ్చేది. ఆవు వచ్చే అలికిడిని దాని మెడలోని గంట ద్వారా గుర్తు పట్టేవాడు గోవిందు. ఒక రోజు పశువులు మేత మేస్తూ ఉండగా, దూరం నుండి ఆ మేలుజాతి ఆవును చూసిన పక్కఊరి వ్యక్తి ఆ ఆవును ఎలాగైనా దొంగిలించాలి అనుకున్నాడు గోవిందు గంటల జాగ్రత్తను బాగా గమనించిన అతను గోవిందు దగ్గరికి వెళ్లి, నీ గంట చాలా బాగుంది ఆ గంటను నాకు అమ్మితావా నీకు డబ్బు ఇస్తాను అన్నాడు గోవిందు డబ్బుకు ఆశపడి 'ఇతనెవరో ఉత్త వెర్రి బాగుల వాడి లాగా ఉన్నాడు. ఉత్త గంట కొంటాను అంటున్నాడు' అని మనసులో అనుకుని, సరే అని ఎక్కువ డబ్బు తీసుకుని, ఆ గంటను అమ్మేసాడు. ఆ మర్నాడు మేతకు వెళ్లిన ఆవులన్నీ తిరిగి వచ్చాయి కానీ గోవిందుకు ఇష్టమైన మేలుజాతి ఆవు మాత్రం రాలేదు ఇన్నాళ్లు గంట సాయంతో అది ఎక్కడ ఉందో కనిపెట్టేవాడు ఇపుడు ఆ గంట కూడా అమ్మేసాడు కాబట్టి, మరేమీ చేయలేక బాధ పడుతూ కూర్చున్నాడు. అప్పటికీ అతనికి గంట కొన్న వ్యక్తే తనావును తీసుకెళ్లి ఉంటాడన్న ఆలోచన రాలేదు, కేవలం గంట కొంటానని అడిగినపుడే అతని పన్నాగం గమనించాలి కానీ తన అత్యాశ వల్ల ఆ అవకాశం లేకుండా చేసుకున్నాడు గోవిందు.

10 తేడాలను కనిపెట్టండి






సరైన నీడను గుర్తించండి



ఏవి ఎన్ని?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 407

	7	2			6			
	9		5			1		
3		5		9				2
9		3		6				7
	4						5	
7				1		4		9
8				5		7		1
		9			1		3	
			8			9	2	

సుడోకు - 406 సమాధానం

8	4	1	5	2	6	7	3	9
2	9	5	4	3	7	1	8	6
7	6	3	9	8	1	4	5	2
9	2	7	8	4	5	3	6	1
5	8	4	1	6	3	2	9	7
1	3	6	2	7	9	5	4	8
6	7	2	3	9	4	8	1	5
4	5	8	6	1	2	9	7	3
3	1	9	7	5	8	6	2	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.